

15-7-66

ఆంధ్రసచిత్రవార

పత్రిక

35 పైసలు



బాబూమూవీస్
కన్నెమనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత సి సుందరం సంగీతం మహదేవన్
శ్రీఫిలిమ్స్ విడుదల
MVKR

ఉత్తరాలు

కథలు

ఈ వారం మీరు ప్రచురించిన "ఆదివిష్ణు" గారి పెద్దకథ 'బంధితులు' అత్యద్భుతంగావుంది. పార్థు పాత్రను హృదయంగమంగా చిత్రించారు. కేవలం ఒక పసివాని పాత్రను తీసికొని ఇంత అందంగా మలచటం ఆదివిష్ణుగార్కే చేతనయింది సిరిసంపదలు మెండుగా వుండి, ఏమీలేని అభాగ్యుని కన్నా నీచంగా, హీనంగా పరపంచల్లో బ్రతికే పార్థు ఎన్ని ఆశలను చిన్నిగుండెల్లో నింపుకొని ఆ జైలు నుండి తప్పించుకోవాలని ఎన్ని కమ్మటి కలలు కన్నాడో కానీ, ఆశలన్నీ రాలిన పూరేకులై గాలికి ఎగిరిపోయినపుడు, ఆ పసిహృదయం ఎంతగా విలపించిందో అనిపించి హృదయం ఎంతగానో బాధ పడింది. రచయిత తమతో పాటు పాఠకులను కూడా పార్థు సమక్షంలో నిలిపి వారు అనుభవించిన మానసిక వేదన పాఠకులకు కలగజేసి, ప్రతిఒక్కరికీ తమ స్వానుభవం అనిపించేటట్లు చేశారు. ఎంతగా పాఠకుల సానుభూతి దోచుకున్న 'పార్థు' పాత్ర చిరస్మరణీయమైనది.

కుమారి గడ్డం సరోజాదేవి (విజయవాడ)

* * *

ఆదివిష్ణు గారి బంధితులు కథలో సత్యవతిని ఏడిపించి, పాఠకులు కూడా సానుభూతిగా రెండు కన్నీటిబొట్లు విడుచునట్లుగా వుంది.

దావులూరి విజయమోహన్ (రాజమండ్రి)

* * *

17—6—66 ఆంధ్రసచిత్రవార పత్రికలోని 'దాహం' కథలో రచయిత విజ్ఞాన శాస్త్రమునకు ఒక తీరని అపకారం చేశారు. రత్నమాల కళ్లలో మేగ్నెటిజం లాంటి మెరుపులున్నాయని వ్రాశారు. మేగ్నెట్‌కి, మెరుపుకి ఏం సంబంధం? మేగ్నెట్‌కి ఎలాంటి కాంతి లేదే! చాలసేపు ఈ రెండు ప్రశ్నలు పెద్ద సమస్యలయి కూర్చున్నాయి. చాలసేపటికి, మేగ్నెట్ ఆకర్షణని తెలుపుతుంది గాబట్టి రత్నమాల కళ్లలోని మెరుపులు ఆయస్కాంతాలన్న ఉద్దేశాన్ని రచయిత క్లుప్తంగా ఈ వాక్యంలో రాసి ఉంటారని అనుకున్నాను. నా వూహ నిజమని వూహిస్తున్నాను. ఇకముందు రచయితలు తమ ఉద్దేశాలను వివ

రంగా వ్రాయకపోతే అటు సాహిత్యానికీ, ఇటు శాస్త్రానికి ద్రోహం చేసిన వారవుతారు.

రాయప్రోలు లక్ష్మీరాజ్యం (తిరుపతి)

* * *

'యాద్'' కథ చాలా బావుంది. కథా నాయకుని మదిలోనే గాక మా మదిలో కూడా కథానాయికి తాలూకు యాద్ ఎప్పటికీ నిలిచిపోతుంది.

ఎన్. రంగారాణి. (కటక్)

* * *

ఉత్తరాలు

17—6—66 సంచికలోని 'యాద్' చదివిన తరువాత ఈ విషయం వ్రాయా లనిపించింది.

సుశీల రామ్మూర్తికి రక్షాబంధాన్ని కట్టింది. వానివల్ల ఆతడు ఆమెకు సోదరునితో సమానం. అయితే రచయిత పెద్ద పొరపాటు చేశారు. సుశీల తండ్రి తన కూతురు రామ్మూర్తిని ప్రేమించినట్లు వివాహానికి ఒప్పుకోమన్నట్లు కథలో ఉంది. రక్షాబంధాన్ని గురించి రచయితకు తెలిసి ఉండకపోవచ్చును.

కె. రామారావు (పూనా)

* * *

''పడగ నీడ' కథ చాలా బాగుంది. రచయిత్రికి నా అభివందనలు. కాని ఆకథలో అనగా 33 వ పేజీలో, ఒకటవ కాలంలో చివరి పంక్తిలో ''నిలబడ్డ కావేశాన్ని'' అనుటకు బదులు ''నిలబడ్డ సూర్యాన్ని'' అని యుండవలెను.

పూడిపెద్ది బాలసుబ్రహ్మణ్యం (విశాఖపట్నం)

సీరియల్

''నిరీక్షణ'' సీరియల్ అయిపోయినందుకు మేమెంతో విచారిస్తున్నాము. అందులో రచయిత ''ఉన్నవ విజయలక్ష్మి''గారు కథని ఎంతో ఉత్సాహముతో నడిపేరు. రచయిత్రిగార్కి నా అభివందనములు. మరల ఇలాంటి సీరియల్‌ను త్వరలో మరియొకటి ప్రచురించెదరని తలుస్తున్నాను.

మొల్లేటి అప్పల శ్రీనివాసరావు (వాల్తేరు)

* * *

ఉన్నవ విజయలక్ష్మిగారి నిరీక్షణ సీరియల్ అత్యుత్తమంగా యుంది. ఇందులో రాధ పాత్రపోషణ చాలా చక్కగా యుంది. రచయిత్రికి నా ధన్యవాదాలు.

దాట్ల శకుంతల (హైదరాబాదు)

* * *

శ్రీ భూపతిగారు వ్రాసిన ''ముద్ద మందార'' సీరియల్ 1—7—66వ తేది సంచికలో కథ చివర ''సశేషము'' అని వ్రాయక అచ్చట కథ అయిపోయినట్లు వేసిరి. కథ అయిపోయినదా! లేక తమ అచ్చు తప్పు వలన జరిగినదా! తెలుపగలరు.

జి. ఎస్. కె. బి. ప్రభు (హైదరాబాదు)

* అచ్చు పొరపాటు.

ఉమెన్ కార్టూన్

1—7—66 సంచికలోని, రాయుడిగారి ఉత్తరం చూచి నవ్వు వచ్చింది. అసలు రైఫిలు డ్రిల్లు అంతా కుడిచేతితోనే చేస్తారు. ఎడమచేతిని సహాయంగా మాత్రమే తీసుకుంటారు.

పి. చలమాజీరావు (విశాఖ)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 15—7—'66
పరాభవనామ సం॥ ఆషాఢ మాసం బ॥ ద్వాదశి
సంపుటము : 58 సంచిక : 46

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్త రేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతర దేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

మనలో మాట

గోవాజానపద గాథలని, కొన్ని దశాబ్దాల కిందటి బొంబాయి సినిమా పరిశ్రమకి సంబంధించిన చిన్న చిన్న కథలని పాఠకులకి అందించిన శ్రీ వి. ఎస్. సుక్తాంకర్ కొందరు మహానుభావుల చమత్కారాలని గురించి రాసిన చిన్న వ్యాసం ఒకటి ఈ సంచికలో ప్రచురిస్తున్నాము...

* * *

ఇంతకుముందే చెప్పినట్లు రూపాయి విలువ తగ్గింపు గురించి సినిమా పరిశ్రమలోని ప్రముఖుల కొందరి అభిప్రాయాలు శ్రీ మోహన్‌కుమార్ సేకరించారు. వ్యాసం 50 వ పేజీలో ప్రారంభమవుతుంది...

* * *

జూన్ 29 న సుప్రసిద్ధ గణితశాస్త్రవేత్త, బహుభాషా కోవిదుడూ, చరిత్రకారుడూ అయిన దామోదర్ ధర్మానంద్ కోశాంబి పూనాలో మరణించారు. చరిత్రానుశీలన పద్ధతులలోనే కొత్త రీతులని ప్రవేశపెట్టిన కోశాంబివంటి పండితుడి రచనలని గురించి సమగ్రంగా రాయగలిగిన అర్హత బహు కొద్దిమందికి ఉంటుంది. అందుకనే, కోశాంబి జీవితచరిత్ర, ఆయన పుట్టి పెరిగిన వాతావరణంతో పరిచయం ఉన్న ఒకరిచేత ఆయన జీవితచరిత్రకి సంబంధించిన చిన్న వ్యాసం ఒకటి, ఒక సామాన్య పాఠకుడిమీద 'ఏన్ ఇంట్రడక్షన్ టు ది స్టడీ ఆఫ్ ఇండియన్ హిస్టరీ", "ది కల్చర్ ఎండ్ సివిలిసేషన్ ఆఫ్ ఏన్షంట్ ఇండియా", "మిత్ ఎండ్ రియాలిటీ" వంటి గ్రంథాల ప్రభావాన్ని క్లుప్తంగా తెలిపే చిన్న వ్యాసం మరొకటి వేస్తున్నాము...

* * *

"సర్కార్ ఎక్స్‌ప్రెస్" కథ రచయిత అయ్. ఎ. ఎస్. లో వున్నారు.

పైవారమే ప్రారంభం!

"అపసరణ సిద్ధాంత స్వరూపం"

రచన
మోహన్‌రామ్

దక్షిణ భారతదేశంలో 'ద్రావిడోద్యమాలని' లేవదీసిన రాజకీయపక్షాలని శ్రీ మోహన్‌రామ్ ఈ వ్యాసశీర్షికలో పరిశీలిస్తారు. ఇవి ప్రఖ్యాత ఆంగ్ల వారపత్రిక 'మెయిన్ స్ట్రీమ్' నుంచి పునర్ముద్రితాలు.

విషయానుక్రమణిక

ముఖచిత్రం: నటి గీతాంజలి


" మన మధ్య అఘాతం ఉందని ఎవరన్నారూ "
అభిప్రాయ భేదాలు
మంచిరోజులు వస్తున్నాయి సార్
బరువు తగ్గించాలంటే యిప్పుడు నేను వొప్పుకుంటాము
అంతకన్న నిష్ఠూరం
సహకారానికి రష్యా చేసిన అభ్యర్థనకు చైనా సమాధానం

న్యూఢిల్లీ లేఖ — శ్రీకృష్ణ

రూపాయి విలువ తగ్గింపు : ధరల పెరుగుదల

రూపాయి విలువ తగ్గింపుపై దేశ వ్యాప్తమైన చర్చ యింకా కొనసాగుతూనే ఉంది భారతదేశంలో రూపాయి విలువ తగ్గించాల్సిన అవసరం ఎందు కొచ్చిందంటూ మాజీ ఆర్థికమంత్రి సర్ చింతామణ్ దేశ ముఖ్ సంచలనాన్ని లేవదీస్తున్నారు "మనం మన తాహతుకు మించి వ్యవహరించాం అంకెల రూపంలో కన్పిస్తున్న మొత్తానుచూసి మోసపోయాం" అని కూడా ఆయన అన్నారు

మొట్టమొదటి సారి భారతదేశంలో రూపాయి విలువ తగ్గించిన వెంటనే సర్ చింతామణ్ దేశముఖ్ ఆర్థికమంత్రి అయినారు

ప్రభుత్వ వ్యయంపై తన హయాంలో ఏ విధమైన ఆంక్షలను పెట్టింది సర్ చింతామణ్ దేశముఖ్ వివరించనే లేదు అప్పుడే విదేశీ మారకద్రవ్యం చిక్కులు కూడా తలయెత్తాయి.

ఉక్కు, వాడకందారుకు కావలసిన వస్తువుల దిగుమతులకు పథకాలను రూపొందించడం ప్రస్తుతం అవసరం అందుకే ఉక్కుని ఏదో ఒక విధంగా కొనుగోలు చేయడానికి సంఘాలు విదేశాలకు పంపబడుతున్నాయి

ప్రభుత్వం భరీఎత్తున ప్రణాళికా రూపకల్పన చేస్తే దాని అమలుకు పెద్ద మొత్తాలలో విదేశీ సహాయం కావాల్సి ఉంటుందని సర్ చింతామణ్ దేశముఖ్ అన్నారు "అప్పుడు మీరు ప్రపంచంలోని సహాయకుల బృందం సూచించిన మార్గంలో పయనించగలరు" అన్నారు

రెండవ ప్రణాళికపై సంతకం చేసిన వ్యక్తి సర్ చింతామణిదేశముక్ ప్రణాళికాసంఘం సభ్యుడు కె సి నియోజి ఆ ప్రణాళికను దుయ్యబట్టారు తర్వాత వచ్చిన ఆర్థిక మంత్రి దాన్ని కోసేశారు ఈ ప్రణాళికా కాలంలోనే 'ఎయిడ్ ఇండియా క్లబ్'కు నాంది ప్రస్తావనలు జరిగాయి

దేశంలో క్రమక్రమంగా ఏర్పడుతున్న ఆర్థికప్రతిష్టంభనను తానెలాఎదుర్కొన్నదీ సర్ చింతామణ్ దేశముఖ్ వివరించనే లేదు.

* * *

బొకారో ఉక్కు కర్మాగారం ఉత్పత్తి ఖర్చు తగ్గించే పరిస్థితులను గురించి చర్చించడానికి ఓ సంఘం యిటీవల మాస్కో వెళ్లింది ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ ఎన్ ఎన్ వాంకూ దానికి నాయకత్వం వహించారు ఉక్కుమంత్రిత్వశాఖలోని యిద్దరు ప్రతినిధులు, బొకారో ఉక్కు కర్మాగారం నుంచి ముగ్గురూ, హిందూస్తాన్ స్టీల్ నుంచి ముగ్గురూ, దస్తూర్ అండ్ కంపెనీ నుంచి పదిమందీ ప్రతినిధులు ఈ సంఘంలో ఉన్నారు దస్తూర్ అండ్ కంపెనీకి సంబంధించినంతవరకూ యింకా బేరసారాలు జరుగుతూనే ఉన్నాయి దాని ఉత్పత్తి 17 మిలియన్ టన్నులు ఉన్నప్పుడు 100 కోట్ల రూపాయలు, నాలుగు



ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి హైదరాబాద్ వచ్చినప్పుడు బేగంపేట విమానాశ్రయంలో మేయరు, ముఖ్యమంత్రి, గవర్నర్ ప్రభృతులు స్వాగతమిస్తున్న దృశ్యం.

మిలియన్ టన్నులు ఉన్నప్పుడు 200 కోట్ల రూపాయలకు తగ్గించాలని సూచింపబడింది. రష్యావారు దాన్ని గురించి ఏమీ చెప్పనే లేదు. భారతదేశంలో బొకారో ఉక్కు కర్మాగారమో లేక దస్తూర్ అండ్ కంపెనీయో ఉండాలని రష్యన్లు అన్నారు. కాబట్టి వారు దస్తూర్ అండ్ కంపెనీ విషయంలో ఏమీ జోక్యం కలిగించుకోరని న్యూఢిల్లీకి తెలిసిపోయింది. రూపాయి విలువ తగ్గింపు భారత రష్యాల మధ్య నెలకొని ఉన్న వ్యాపార సంబంధాలపై ప్రభావాన్ని కనపరచింది. తద్వారా రెండుదేశాల సంబంధాలపై కూడా ప్రభావం కలిపిస్తూంది. ఈ పరిస్థితుల్లో రష్యావారు బొకారో ఉక్కు కర్మాగారం వ్యవహారం నుంచి తప్పుకోడానికి ఆతృతను కనపరచవచ్చునటంలో అతిశయోక్తి లేదు. దస్తూర్ అండ్ కంపెనీ అవసరాలకు కావలసిన 5 కోట్ల రూపాయలా ఉక్కు మంత్రిత్వశాఖ యివ్వడానికి సిద్ధంగా లేదు. జూలైలో జరిగే పార్లమెంటు చర్చలో జయంతి షిప్పింగ్ కార్పొరేషన్ విషాదాంతగాథలోని కొన్ని అంశాలు చర్చకు రావచ్చు. అప్పుడు దస్తూర్ అండ్ కంపెనీ తనకు అనుకూలమైన విధానాలను రూపొందించమని ఉక్కు మంత్రిత్వశాఖను వత్తిడి చేసే పరిస్థితికి రావచ్చు.

రష్యావారు బొకారో ఉక్కు కర్మాగారానికి

న్యూఢిల్లీ లేఖ

సహాయాన్ని అందిస్తూ, రాంచీలోని భారీ యంత్రపరికరాల సంస్థకు కూడా సహాయాన్నందించాలనే ఆతృతను కన్పరుస్తున్నారన్నది అందరికీ తెలిసిందే. ప్రణాళికా సంఘం నివేదికను బట్టి రాంచీ సంస్థ ఉత్పత్తి చేసే 80,000 టన్నులనూ పూర్తిగా ఉపయోగించుకోడం జరిగేది, బొకారో ఉక్కు కర్మాగారం మాత్రమే కాక అయిదవ, ఆరవ ఉక్కు కర్మాగారాలుకూడా తయారైతేనే సాధ్యపడుతుంది.

* * *

ఆలిండియా రేడియో అవసరానికి సరిగా ఉపయోగపడక పోవటం యిది మూడోసారి. మొదట చైనా దురాక్రమణ జరిగినప్పుడు, రెండోసారి భారత పాకిస్తాన్ తగాదాలో, మళ్లీ రూపాయి విలువ తగ్గింపు జరిగినప్పుడు కూడా తిరిగి అదే పని చేసింది. ఆలిండియా రేడియో చెప్పిన రెండు వాక్యాలూ దేశంలో రూపాయి విలువ తగ్గింపుకు వ్యతిరేకులు సమాజ వ్యతిరేక చర్య దిగటానికి బాగా అవకాశాన్ని కల్పించింది. ఉదాహరణకు ఢిల్లీలో ఎండు మిరపకాయల ధర 50 శాతం పెరిగింది. దేశంలోని పెక్కు ప్రాంతాలలో వంద రూపాయల నోటు 64 రూపాయల విలువను మాత్రమే పొందగలుగుతున్నది.

భారతదేశంలో రూపాయి విలువ మీద ఉన్న విశ్వాసం మారకూడదు. భారతదేశంలో రూపాయి విలువ ఏమీ తగ్గలేదని ఆలిండియా రేడియో ప్రసారం చేసింది.

ఈ రకమైన కొత్త కల్పన విమర్శకులకు ప్రభుత్వసంస్థద్వారా తమ ఉద్దేశ్యాలను ప్రసారం చేయటానికి అనుమతిని కోరే పరిస్థితి కల్పించింది. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, స్వతంత్రులు, కాంగ్రెసులోని వామపక్షం వారు రాబోయే ఎన్నికలలో తమ ప్రచారానికి, అభిప్రాయ వ్యక్తీకరణకు ఆలిండియా రేడియోలో భాగం కావాలని అడగవచ్చు. అడుగుతారు కూడా.

కాంగ్రెస్ అయినా, తదితర రాజకీయ పార్టీ ఏదైనా ఎన్నికల ప్రచారానికి ఆలిండియా రేడియోను ఉపయోగించుకోరాదనటంలో అపరాధమేమీ లేదు.

బడ్జెట్ గురించి, రూపాయి విలువ తగ్గింపు గురించి ప్రజలకు వచ్చచెప్పటానికి ఆలిండియా రేడియోని ఉపయోగించటం వల్ల వ్యతిరేకులను అరికట్టటం శక్తిమించిన పనిగా పరిణమిస్తుంది.

* * *

ప్రపంచంలోని దేశాలన్నీ భారతదేశంతో స్నేహాభివృద్ధికి ఆశ పడుతున్నాయని పర్యటనలు చేస్తున్న పెద్దపెద్ద హోదా గల వ్యక్తుల వివరణ. ఈ ప్రపంచ పర్యటనల వల్ల తూర్పు ఐరోపాలోని కొన్నిదేశాలతో భారతదేశం సంబంధాలు బాగా పెరిగాయని కూడా చెప్పటం జరిగింది. స్నేహాభివృద్ధికి అప్పుడప్పుడు చేసే ప్రకటనలు, వ్యాపార సంబంధమైన ఒప్పందాలపై సంతకాలు చేయటమే కాకుండా కొన్ని సంఘాలు ఈ ఉద్దేశ్యంతో స్థాపింపబడి ఉన్నాయి. ఇండియా—సోవియట్, ఇండియా— యు. ఎస్. ఎ., ఇండియా—యు. ఏ. ఆర్. మొదలైనవి అందులోకొన్ని. భారతదేశం—యితర దేశాల మధ్య స్నేహాన్ని అభివృద్ధి చేయటమే వాటి ప్రధానలక్ష్యం.

భారత పాకిస్తాన్ పోరాటానికి ముందు అరేబియా, ఇరాన్, టర్కీలలో పర్యటించి వచ్చిన ఒక ప్రముఖ వ్యక్తి చెప్పిన దాన్ని బట్టి ఆ దేశాలు భారతదేశంతో స్నేహాన్ని పెంపొందించుకొనేందుకు ఉబలాట పడుతున్నాయి. కానీ భారత పాకిస్తాన్-యుద్ధంలో పాకిస్తాన్‌కు ఆయుధాలను అందించి సహాయపడిందీ ఆ దేశాలే. పాకిస్తాన్, టర్కీ, ఇరాన్‌లు ఉమ్మడిగా నూనె త్రవ్వకాన్నొకదాన్ని ఇరాన్‌లో ప్రారంభించాలనే ప్రతిపాదన ఒకటి ఉంది. ఇ. యన్. ఐ. కన్సార్టియంలోగానీ, ఫిలిప్స్ పెట్రోలియంతో గానీ నూనె పరిశోధన నిమిత్తం చేరటానికి భారతదేశం పెద్దమొత్తంలోనే విదేశీమారకాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఇరాన్ తన దిగుమతులకు క్రూడ్ ఆయిల్‌ని భారతదేశం తీసుకోడంతో ముడిపెట్టడానికి ప్రతిపాదనను చేస్తున్నదని ఇంకొక వార్త.

భారతదేశం పరిస్థితిని వివరించడానికి పార్లమెంట్ సభ్యుల సంఘాలు దాదాపు ముప్ఫయి ప్రపంచం నలుమూలలకూ పంపబడ్డాయి. ఆ సంఘాల ద్వారా వెళ్లి తిరిగివచ్చిన పెద్దలంతా ప్రపంచంలోని దేశాలన్నీ భారతదేశం స్నేహాన్ని వాంఛించేట్లు చేయటంలో విజయాన్ని సాధించామని అన్నారు. పాకిస్తాన్ ఒక్కసంఘాన్ని కూడా ఎక్కడికీ పంపలేదు. కానీ భారత దేశానికి ఉండాల్సిన స్నేహితుల కంటే పాకిస్తాన్‌కే ఎక్కువమంది ఉన్నారు.

దామోదర్ ధర్మానంద్ కోశాంబి

దేశ ప్రేమ ఉన్న వారందరికీ తమ దేశం గత చరిత్ర తెలుసుకోవాలనే కౌతుకం ఉండటంలో ఆశ్చర్యంలేదు. అందులోనూ, కనీసం రెండు వేల సంవత్సరాల 'చరిత్ర' అనిపించుకున్న భారతదేశంలో పరపరిపాలనని ఎదిరించే వారికి ఈ కౌతుకం మరింత అధికంగా ఉంటుందన్నా ఆశ్చర్యంలేదు. 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' ఒక గొప్ప దేశభక్తుడు తనదేశాన్ని, దేశ చరిత్రను ఎలా అర్థం చేసుకున్నాడో తెలిపే గ్రంథమే కదా? అన్నివిధాలా ప్రాచీన భారత సంస్కృతి, నాగరికతా తక్కిన వాటన్నిటి కన్నా గొప్పవనీ, ఏవో స్వర్ణయుగాలు పోయి మనం ఇతరుల దుశ్చర్యల వల్ల నేటి అధోగతి పాలయ్యామనీ పిడివాదం చేసే వారితో వాదించి లాభంలేదు. కాని, ఆధునిక కాలంలో భారతదేశ ప్రజలూ, సమాజాలూ ఈ విధంగా దిగజారిపోవటానికి కారణం గత చరిత్ర చదివి కొంత దాకా అర్థం చేసుకోవచ్చుననే వూహతో ఎందరో తమ దేశ చరిత్ర చదవటం ప్రారంభిస్తారన్నా అతిశయోక్తి లేదు. (కేవలం తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవటానికే చదువుతామనే వారు లేరనికాదు. అసలు ఏ ఉద్దేశమూ లేక పూర్తిగా ఉదాసీనంగా చరిత్ర పఠనం సాధ్యమా అని ప్రశ్నించుకోవాలి!) ఇలా చదవటం ప్రారంభించిన కొద్దీ బాధ కలిగించే సంగతులు చాలా తెలుస్తాయి. సున్నితమయిన మనస్తత్వంతోబాటు కొంత అహంభావం కూడా కలవారు ఒక రకం ప్రాయశ్చిత్తంచేసుకునే ధోరణిలో స్వజాతి దూషణకి పూనుకుంటారు. ఈ ధోరణి చిరాకు కలిగించినా దానిని అవలంబించే వారి వాదాలలో ఎంతో నిజం ఉండటం చేత బాధపడేవారు మరికొంత చరిత్ర చదవటం మాత్రమే జరగవచ్చు. (తమ జాతి అంటే మితిమీరిన అభిమానం కలవారే సాధారణంగా ఈ దూషణకి దిగుతారనే విషయాన్ని గుర్తించక తిరిగి తిట్టే వారిని అంతగా పట్టించుకోనక్కరలేదు.) కాని ఈ 'దశ'లో కొన్ని సందేహాలు కలుగవచ్చు. వర్ణవిభేదాలు, సతీసహగమనం, బాల్యవివాహాలు నియంతృత్వం వంటి అమానుషమయిన వ్యవస్థలు భారతదేశం అనబడే 'ఉపఖండం' లో ఎలా జన్మించాయి, ఇన్నిశతాబ్దాలు ఎలా నిలిచాయి?—అనే ప్రశ్నలు బాధ పెడ్తాయి. గత చరిత్రని ఒక త్రుటిలో మార్చి పోనూలేము, పైన చెప్పినటువంటి వాటిలో ఎన్నో నేటికీ పూర్తిగా నశించిపోనూ లేదు. ఈ దేశం వాతావరణంలో ఏదో వర్ణించరాని దుష్టశక్తి ఉన్నదని కాని, తూర్పు ప్రాంతాలలో ఎప్పుడూ వ్యక్తి స్వాతంత్ర్యానికి అవకాశం లేదని కాని వాదించే వారి సిద్ధాంతాలు మనకి సంతృప్తికరంగానూ ఉండవు, ఉపయోగపడనూ పడవు. పూర్తిగా పరిణామ వాదాన్ని సమాజానికి వర్తింప చెయ్యాలని ప్రయత్నించే వారి సిద్ధాంతాలూ అంతే. కేవలం భూతకాలంలో జరిగిన సంఘటనల జాబితాలు తయారు చెయ్యటమే కాక మానవజాతి శాస్త్ర (ఏంత్రపాలజీ) పరిశోధనలవల్ల ఏర్పడిన దృక్పథాలని చరిత్ర పరిశోధనలో వినియోగిస్తే కొన్ని సమస్యలు పరిష్కారం కావచ్చు. ఒక దేశంలోని ఉత్పత్తి పద్ధతుల చరిత్ర తెలుసుకుంటే ఆ దేశం చరిత్రని కొంత అర్థం చేసుకున్నట్లే, అలాగే పురాణ గాథలలో అర్థంకాకుండా అస్పష్టంగా ఉండేవి ఎన్నో మానవజాతి శాస్త్రం నేటి సమాజాల అనుశీలనకి అవలంబించే పద్ధతుల దృష్ట్యా పరిశీలిస్తే కొంతవరకూ అర్థం అవుతాయి.



కోశాంబి

మానవులు సమాజాలని నిర్మించటం ప్రారంభించి 'చరిత్ర' మొదలు అయ్యే దాకా కొన్ని కార్యకలాపాల ద్వారా తమ పరిసరాలని మార్చి తమ అవసరాలని ఎలా తీర్చుకున్నారో గార్డన్ చైల్డ్ వంటి వారు వర్ణించారు. ఈ కార్యకలాపాలే, వాటి ఫలితాలే 'సంస్కృతి' అని గుర్తిస్తే (సంగీతం, చిత్రలేఖనం, సాహిత్యం కూడా కొన్ని అవసరాలని తీర్చే కార్యకలాపాలే కదా!) చరిత్రలోని అంశాలని ఎన్నిటినో అర్థం చేసుకోవచ్చు. అప్పుడు రహస్యాల కోసం వెతకనక్కరలేదు, నేడు మనకి జుగుప్స కలిగిస్తూనే మన పురోగమనానికి అడ్డు నిలిచే వ్యవస్థల విషయమై తికమకపడనూ అక్కరలేదు.

భారతదేశ చరిత్రని ఈ విధంగా వర్ణించటానికి ప్రయత్నించిన మేధావి దామోదర్ ధర్మానంద్ కోశాంబి. ఆయన మార్క్సిస్ట్ దృక్పథంతో భారత చరిత్ర రాశానన్నారు. కాని, ఒకవైపు స్వర్ణయుగాల కోసం వెతికే వారితోనూ, మరొకవైపు తమ పూర్వీకుల కర్మలకి ప్రాయశ్చిత్తం చేసుకునే ధోరణులని ప్రదర్శించే వారితోనూ విసిగిన వారిని కోశాంబి రచనలు కదిలించి వేస్తాయి. సంపూర్ణ వైజ్ఞానిక దృక్పథం కల ఒక మహాపండితుడు మన ప్రాచీన సంస్థలని గురించి, వ్యవస్థలనిగురించి కృత్రిమమైన గౌరవం చూపించకుండా—ఆయన సునిశిత విమర్శల వెనుక కొంత వాత్సల్యం దాగి ఉందనే అనుమానం పాఠకులకి కలుగకమానదు— వ్యాఖ్యానిస్తూ ఉంటే అంతదాకా (ఈ వ్యాసరచయిత వంటి) సాధారణ వ్యక్తులకి అర్థంకాని విషయాలెన్నో తెలియటమే కాక ఒక కొత్త రకమయిన సహనశీలత కూడా అలవడుతుంది. అర్థం చేసుకోవటంవల్ల సంస్కరణ సాధ్యమనే ఆశ చిగురిస్తుంది. ఆధ్యాత్మిక వాదుల బారి నుండి తప్పించుకోవాలని చూసేవారికి కోశాంబి రచనలు శరణు కల్పిస్తాయి.

జాత్యభిమానం ఎల్లప్పుడూ మంచిది కాకపోయినా గణితశాస్త్ర వేత్తగా, చరిత్రకారుడుగా, బహుభాషా కోవిదుడుగా (ఆయనకి బాగా వచ్చిన భాషలలో మరాఠీ, కొంకణి, సంస్కృతం, ఇంగ్లీషు, ఫ్రెంచి జర్మన్, ఇటాలియన్, లాటిన్ కొన్ని), దేశభక్తుడుగా

అంతర్జాతీయ కీర్తిని సంపాదించుకున్న దామోదర్ ధర్మానంద్ కోశాంబి భారతీయుడు కావటం గర్వ కారణం.

ఆయన జూన్ 29 న పూనాలో స్వగృహంలో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 59. మాత్రమే.

—ఆర్.

కొస్‌బె (గోవాలో ఒక చిన్న గ్రామం. ప్రొఫెసర్ కోశాంబి తండ్రి ప్రొఫెసర్ ధర్మానంద్ ఈ గ్రామంలోనే ఒక మధ్యతరగతి సారస్వత బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. కొస్‌బె) వూరివాడు కాబట్టి ఆయన పేరు ధర్మానంద్ కోసంబోగా ఉండేది. అందరూ ఆయన్ని ధర్మ కోసంబో అని పిలిచేవారు. కాని తర్వాత ఆయన తన పేరుని ధర్మానంద్ కోశాంబిగా, మార్చుకున్నాడు.

సాధారణంగా గోవాలో ఉండే సారస్వత బ్రాహ్మణులు అందరూ చదువు కున్నవారుగానే ఉంటారు. కాని ధర్మకిమాత్రం కొన్ని ఇబ్బందుల వల్ల తన చిన్నవయస్సులోలంతగా విద్యాభ్యాసం జరుగలేదు. ఆయన తన పంతొమ్మిదవ ఏట బుద్ధభగవానుడి మీద మరాటీలో రాసిన ఒక చిన్న పుస్తకం చదవటం సంభవించింది. ఇది ఆయనజీవితంలో ఒక మలుపు. ఆయనలో అణిగి మణిగి ఉన్న మేధాశక్తి మేలుకుంది. బుద్ధుడి బోధనలను పూర్తిగా తెలుసుకోవాలనే వాంఛ ఆయనలో చెలరేగింది. జీవితాన్ని ఈ లక్ష్యం కోసమే ధారపొయ్యాలనే నిశ్చయం కలిగింది. అందుచేతనే, అప్పటికి ఆయనకి వివాహం అయి ఒక బిడ్డ కలిగినప్పటికీ, ఇల్లువదిలి పూనా వెళ్ళిపోయాడు. పూనాలో సంస్కృతభాష నేర్చుకున్నాడు. అక్కడి నుంచి సిలోన్,బర్మాలకి వెళ్ళాడు. ఇక్కడ నేర్చుకొనతగినదంతా నేర్చుకుని నేపాల్ చేరుకున్నాడు. తన ప్రయాణాలలో ఎన్నోకష్టాలకి లోనయ్యాడు. కొన్నిచోట్ల కాలినడక మీదనే వెళ్ళవలసి వచ్చేది. ఇలా ఏడుసంవత్సరాలు నిర్విరామ కృషిచేసి ధర్మ తన లక్ష్యాన్ని సాధించాడు. పాలీభాషలో పరిపూర్ణత్వం సంపాదించాడనిపించుకున్నాడు. భారతదేశానికి తిరిగివచ్చేశాడు. ఆయన కృషిని గుర్తించినవారు ఆయన్ని గొప్పపాలీ పండితునిగా బవుద్ధమతానుశీలకునిగా ప్రశంసించారు.

ధర్మ మొదట కలకత్తా విశ్వవిద్యాలంలో పాలీభాష ఉపన్యాసకుడిగా పనిచేసి తర్వాత పూనా ఫెర్గూసన్ కాలేజికి మారిపోయాడు. 1920 లో హార్వర్డు విశ్వవిద్యాలయంవారు ఆయనని .కొన్నిగ్రంథాల ప్రచురణ విషయములో ఆహ్వానించారు.

1925 లో ధర్మ భారతదేశానికి తిరిగి రాగానే గాంధిగారు ఆయన్ని తన గుజరాత్ విద్యాపీఠ్ లో పాలీ అధ్యాపకుడుగా చేరమని. కోరారు. 1927 లో ఒక రష్యన్ విశ్వవిద్యాలయంవారుకూడా ఆయన్ని బవుద్ధ పరిశోధనలకోసం అక్కడికి రమ్మని పిలిచారు. రెండేళ్ళు రష్యాలో గడిపి ధర్మ కోసంబో స్వదేశానికి వచ్చేశారు. వచ్చి సహాయనిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. అయితే 1945 నుంచి తన మరణందాకా ధర్మానంద కోశాంబి పాలీ భాషా పరిశోధనలని గాని, మరాటి రచనలనిగాని మరచిపోలేదు. ఆ రంగంలో తన కృషిని కొనసాగిస్తూనే ఉండిపోయాడు.

ప్రొఫెసర్ దామోదర్ ధర్మానంద్‌కోశాంబికి తండ్రిగుణాలు బాగా అబ్బాయి. అంటే తండ్రి ఎంత నిశితబుద్ధికలవాడో తల్లివైపు వారు అంత సాహిత్యాభిమానులు, పౌరుషవంతులూ కూడా. గోవాలోని 'చిఖాలీ' గ్రామానికి చెందిన లాడ్ వంశానికి చెందిన లక్‌బా దాదాలాడ్ 18వ శతాబ్దంలో సింధియా సైన్యంలో చేరి ఉత్తర దేశానికి వెళ్ళిపోయాడు. సింధియా సేనాధిపతి కావటమే కాక ఎన్నో యుద్ధాలు గెలిచాడు. మరాటి చరిత్రలో లక్‌బాదాదా పేరు చిరస్మరణీయమైనది. ఆయన వంశం ఐశ్వర్యానికి, మర్యాదకీ పేరు పొందింది.

ఇక ఆధునికులలో ప్రొ. కోశాంబి మేనమామ డాక్టర్ సఖారామ్‌లాడ్ పంతొమ్మిది, ఇరవయ్యవ శతాబ్దాలలో పేరుపొందిన సంఘ సంస్కర్త. సముద్రయానం మహాపాపం అనుకునేకాలంలో లిస్బన్ (పోర్చుగల్)కి వెళ్ళి వైద్యవిద్యాభ్యాసం చేశారు. గోవాలో ఎందరో ఆయన్ని వెలివేశారు. ఈయనకంటే అధికంగా కీర్తి సంపాదించుకున్న వ్యక్తి డాక్టర్ భావూదాజీలాడ్. ఇరవయ్యవ శతాబ్దంలో పుట్టిన డాక్టర్ భావూదాజీ బొంబాయికి పోయి అక్కడ మెడికల్ కాలేజీలో చేరారు పట్టాపుచ్చుకున్న మొదటి ఆరుగురిలో ఆయన ఒకరు. డా. భావూదాజీకి వైద్యమే కాక సంస్కృత భాషా పాండిత్యంకూడా ఉండేది. అంతేకాక పురావస్తుతత్వశాస్త్రంలో తన ప్రతిభని ప్రకటించారు. కుష్టు వ్యాధికి నివారణ ఇచ్చే మూలికను కూడా నిరంతర కృషి తర్వాత కనిపెట్టారుట. కాని ఆయన పరిశోధనల ఫలితం నేడు మనకు లభ్యం కావటంలేదు.

ఇలా ప్రొఫెసర్ దామోదర్‌ధర్మానంద్ కోశాంబికి తల్లిదండ్రులు ఇరువురివైపు నుంచీ కూడా పాండిత్యం, బుద్ధికౌశల్యం, ధైర్యం, పురోగమన వాదాలు, వాటికి సంబంధించిన సంప్రదాయాలు అబ్బాయి అన్నా అతిశయోక్తిలేదు. దానికితోడు, తండ్రితో అమెరికాలో ఉన్నప్పుడు హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశం కలిగింది. ఇక్కడ గణితశాస్త్రంలో పట్టభద్రుడయి భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత వారణాసిలో ప్రొఫెసర్ ఉద్యోగంలో చేరాడు. కాని 1933లో ఆదర్శవాది అయిన కోశాంబి మంచి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి పూనా ఫెర్గుసన్ కాలేజిలో చేసేవారు. మొదట 'దక్కన్ ఎడ్యుకేషన్ సొసయిటిలో చేరారు. (ఎటువంటి అధ్యాపక పదవిలో ఉన్నా 140 రూ. లకన్నా ఎక్కువ జీతం పుచ్చుకోరాదు.) ప్రొఫెసర్ కోశాంబి ఫెర్గుసన్ కాలేజిలో ఇరవయి సంవత్సరాలు పనిచేసి 1953లో తాతావారి పరిశోధన సంస్థలో గణితశాస్త్రాధ్యపకుడుగా చేరాడు. అక్కడ ఆశాస్త్రంలో ప్రొఫెసర్‌గా 1965లో రిటయిర్ అయ్యారు. ప్రతిరోజూ పూనా నుంచే రైలుబండిలో బొంబాయి వెళ్ళి వచ్చే ప్రొఫెసర్ కోశాంబి తమ స్వగృహాన్ని ఎప్పుడూ వదలలేదు. ప్రతిదినం వ్యాయామం కోసం కాలినడకన వెళ్ళి ఆజానుబాహువైన దామోదర్ ధర్మానంద్ కోశాంబి విగ్రహం ఆప్రాంతలో వారికి సుపరిచితం.

—(వి)

[గోవా ప్రాంతీయుడే అయిన వ్యాసకర్త పేరుప్రచురించటానికి ఇష్టపడలేదు.కాబట్టి ఆయనపేరు తెలుపటం లేదు. —సం.]

వ్రాసిన రాకడ—ప్రాణంపోకడ తెలియదం టారు పెద్దలు. తెలియకపోబట్టే గదా అనుకోకుండా వచ్చిన వాన అన్ని తికమకలకీ దారితీసింది.

ఆఫీసులో పనిపూర్తి చేసుకుని ఇంటి మొహం పట్టేము—నేనూ, మా హెడ్ గుమాస్తాగారూ. మా ఇళ్ళు ఎదురెదురుగా ఉంటాయి.

సగందూరం వచ్చేసరికి ఉరుములు మెరుపులతో బ్రహ్మాండంగా వర్షం ప్రారంభించింది.

ఎన్నోసార్లు చూశాను. ఉరుములని మెరుపులని చూస్తే దీపాలకి భయమో. అసూయో ఉన్నట్టుండి నిస్తేజాలవుతాయి.

వేరే దారి తోచక దగ్గరలో ఉన్న సత్రం వసారాలోకి పోయి నిలపడ్డాము.

హెడ్‌గుమాస్తా గారు అసలే బక్కపలచని మనిషి. సుస్తీ చేసి సెలవు పెట్టి నాలుగయిదు రోజుల క్రితమే డ్యూటీలో చేరేరు.

హెడ్‌గుమాస్తాగారు మితభాషి మాత్రమే కాక 'మితశ్రోత' కూడా. తాము ఎక్కువగా మాట్లాడరు. ఇతరులు మాట్లాడితే వినలేరు. రెండు దశాబ్దాలకి పైగా ఫైళ్ళలోనే జీవితం గడిపేశారేమో ఆయన ఆలోచనలు కూడా నిరంతరం ఆఫీసుకు సంబంధించినవిగానే ఉంటాయి. వారి రిమార్కులు "అల్పాక్షరాలలో అనల్పార్థ రచనలు"

నిజమో, కల్పనోగాని, "రెండు మూడు సార్లు జ్ఞాపకం చేసినా చాకలి వెనకటి

చిత్రహింస

యస్.కె.యస్. రామానుజాచారి

రేవులో వేసిన చొక్కా తీసుకుని రావే లేదండీ"అని వారి భార్య చెపితే—"డి. ఒ.—లెటరు రాస్తేసరి తిరుగు టపాలో వ్యవహారం తేలిపోతుంది"—అన్నారని చెప్పుకుంటూ ఉంటారు.

గుమాస్తాల చేత పని చేయించటంలో హెడ్‌గుమాస్తాగారు మంచి దిట్ట.

ఒకసారి ఉదయం వా ఎడమచేతి వేలికి తేలు కుట్టింది. ఆ రోజున సెలవు పెడతానంటే, 'కుట్టింది ఎడమచేతికి కదా! కుడి చేతితో వ్రాయవచ్చు. సెలవు పాడు చేసుకోకండి'—అని సలహా ఇచ్చారు.

విధి నిర్వహణలో అంతటి అప్రమత్తులు గనుకనే అస్మదాదులకి అంత గౌరవం ఆయనంటే.

జల్లు వసారాలోకి పడుతూంది. "లోపలికి పోతే బాగుంటుందేమో, హెడ్‌గుమాస్తా గారూ!" అన్నాను.

"ఎవరు బాబూ నిలబడింది—హెడ్ గుమాస్తాగారా లోపలికి దయ చెయ్యండి" అని పిలుపు వినిపించింది కుడివైపు గదిలోంచి.

ఆహ్వానించినవారు క్రితంరోజున ఆఫీసుకు వచ్చి హెడ్‌గుమాస్తా గారిని కలుసుకున్నవారే. తాయెత్తులు తయారు చేసి విక్రయిస్తారట ఆయన. భారతదేశమంతా తిరుగుతూ ఉంటారుట.

లోపలి కెళ్ళి తుంగ చాప మీద కూర్చున్నాము. కోడిగుడ్డు దీపం వెలుగుతూంది గదిలో.

"ప్రకృతిశక్తులని అదుపులో పెట్టే శక్తిసామర్థ్యాలు ఆ పరమాత్మకి ఒక్కడికే ఉన్నాయి. ఈ అకాల వర్షమేమిటి చెప్పండి" అన్నారు తాయెత్తుల గురువుగారు.

హెడ్‌గుమాస్తా గారు ఏదో ఆలోచనలో ఉన్నారు.

"ఈ శలభాన్ని చూశారా, హెడ్ గుమాస్తాగారూ"— దీపం చుట్టూ ఎగురుతూన్న మిడతని చూస్తూ అన్నారు గురువుగారు. "దీపకాంతి—శలభభ్రమణం—అంతా మాయ. మరో క్షణానికి ఏమి జరుగుతుందో శలభానికేమిటి— మానవుడికే తెలియదు గదా! మానవ కల్యాణం కోసమే మంత్రపూతమైన ఈ తాయెత్తులు తయారు చేశాను."


గురువుగారి 'మానవ కల్యాణం' వినే సరికి, మాకు సరుకులమ్మే దుకాణదారు జ్ఞాపకమొచ్చాడు. అతను అంటూ ఉంటాడు, "బాబూ, జనానికి సేవ చెయ్య

(48 వ పేజీ చూడండి)




మీరు శ్రద్ధ
వహించరా?
CINTHOL

నిరుద్యోగపర్వం



రెండవకథ । నిరుద్యోగిబైస్కోపు

వేళ్లపల్లి వెంకటలక్ష్మీనారాయణ

ఓనాటి సాయంకాలం డ్యూటీలో కొచ్చాడు నిరుద్యోగి...అతనికేం నైట్ షిఫ్టుగానీ పార్ట్‌టైం ఉద్యోగంగానీ లేదు. మరి సాయంకాలం ఉద్యోగం ఏవిటీ అంటే... అదే...సాయంకాలం నిరుద్యోగికి ఉద్యోగం షికారు. వచ్చేపోయే కార్లనీ, కార్లలో మనుష్యుల్నీ వాళ్ల తాలూకు ముఖాల్నీ చూస్తూ సెంటర్లో కొచ్చాడు. గవర్నరుపేట సెంటరు చాలా రద్దీగా వుంటుంది సాయంకాలం. వచ్చేపోయే వాళ్ల మాట అటుంచి అడుగటూ యిటూ వెయ్యకుండా కదలకుండా నుంచుంటారు. వీళ్లదీ రద్దీ. పదిమందిలో మొకాల నిలబడే నిరుద్యోగిలా, వద్దంటే వినకుండా వోవాంచిక్లాసిక్కు తీసి, డబ్బెట్లా వస్తోందో తెలుసుకుంటానికి, ప్రజలెట్లా వస్తున్నారో చూద్దామని, వో సెంటరు కొచ్చి సినిమా హోలెక్కడ నిలబడి చూసే ప్రొడ్యూసర్లు నిలబడ్తారు సెంటర్లో. పగలల్లా ఆఫీసుల్లో పన్జేసి ఫీల్డాగి క్లాస్సేపిక్కడ నిలబడి వచ్చేపోయే వాళ్లనీ, వాళ్ల ఆడవాళ్లనీ, కళ్లప్పగించి చూస్తూ వుంటారు. నలుగుర్తో నారాయణా, ఉద్యోగులొస్తే గోవిందా అంటూ నిరుద్యోగులు కూడా వచ్చి చేర్తారు వీళ్లతో. యిపుడెవరు నిరుద్యోగో ఎవరుద్యోగో తెలుసుకోలేరు ప్రజలు. అందుకే పొద్దున పది తర్వాత తిరగటం సాధ్యమైనంతవరకూ తగ్గించి సాయంకాలం తప్పకుండా వస్తారు..

యిల నిలబడున్న నిరుద్యోగి ముందు సినిమా కారొకటి వచ్చి నిలబడింది...నిరుద్యోగి ఆశ్చర్యపడి కొంచెం బెంగెట్టుకున్నాడు. ఆ మాట కొస్తే యితగాడాశ్చర్యపడందెపుడూ, బెంగెట్టుకోందెపుడు ? ఎపుడూ పడ్తూనే వుంటాడు. పెట్టుకుంటూనే వుంటాడు ఆశ్చర్యం, బెంగ. పోస్టుమాన్ ఏంతేకపోయినా, రెండోపేజీలో తనకు తగిన ఉద్యోగం లేకపోయినా, లేకపోతే యింకో విధంగా చెప్పాలంటే..ఉద్యోగానికి తన డిగ్రీ చాలకపోయినా పడ్తాడు...పెట్టుకుంటాడు. యిప్పుడూ అలాగే బెంగెట్టుకోవాల్సి వచ్చింది. మధ్యాహ్నం పోస్టుమాన్ వచ్చినపుడు బెంగ పెట్టుకుని యివాల్టికి బెంగెట్టుకొనే అవసరం అయిపోయిందనుకున్న నిరుద్యోగికి మళ్లీ సాయంకాలం కూడా బెంగెట్టుకోవాలనేప్పటికి కొంచెం 'యిద'య్యాడు. యింతకూ జరిగిందేవిటంటే— వో హిందీ పిక్చరు 'యివాళ తాస్సేపూ వుంటాను. రేపుండను. వెడతాను' అంది. ఓ పక్క కొత్త పిక్చరు బోర్డు కట్టుకుని రేపు తారీఖు వేసుకొని వేడే చూడండంటూ బయల్దేరిందా కారు. యింకా పైగా త్వరపడండంది కొత్త సినిమాకి... నిరుద్యోగి తొందరపడ్డాడు. తొందర కొత్త సినిమాకి కాదు. యివాల్టితో పాత సినిమా పోతోందే అని తొందరపడ్డాడు. డబ్బుల్లేవే అని బెంగెట్టుకున్నాడు. అయినా అపుడే వెడ్తాం దేవిటి?' అని ఆశ్చర్యపడ్డాడు. వెడితే వెళ్లింది...అయినా వుండమని ఎవరూ అన్లేదుట..ఏడవటం అసలే లేదుట. అసలు అందుకనే వెడుతూందిట. పోతేపోయింది. కానీ డబ్బుల్లేనపుడు తను చూడకుండా తను చూడలేనప్పుడూ పోతోందని బాధ, బెంగాను...తొందరగా యింటి ముఖం పట్టాడు.

దార్లో వో మిత్రుడు, తోటివాడు, సాటి నిరుద్యోగి ఎదురయ్యాడు. 'ఫలానా పిక్చరు వెళ్లిపోతూందిటగ' అంటూ ఫిర్యాదు చేశాడు నిరుద్యోగి. వాడే ఫిర్యాదు విన్లేదు నిరుద్యోగి మాట వినని యింట్లో వాళ్లలాగా..అతగాడిది వినకుండా యింకో ఫిర్యాదు చేశాడు...'ఫలానా తెలుగు సినిమా కూడా పోతూందిటగా' అన్నాడు.

'తెలుగు సినిమానా!' చప్పరించాడు నిరుద్యోగి.

'పోనివ్వవోయ్ ఏవడికేం పోయింది.. అయినా అర్థం పర్థంలేని సినిమాలు. పేరుకీ కథకీ ఏవీ పొంతనుండదు...అందుకే మొన్నీమధ్యోకాయన 'జగదేక వీరుణ్ణి' గురించి భలే మాటన్నాడు 'దాని కాపేరెందుకు? అతగాడు సాడిచేసిందేమిటి? పార్వతి సహాయం చేసిందిగాని..లేకపోతే యితగాడి పొట్లు తెలిసేవి. ముక్కు మూసుకుని గుండంలో దూగ్గానే వీరుడయినట్టా' అని. 'నిజంగా అట్లాగే వుంటున్నయ్ మన సినిమాలు.. అబ్బెబ్బే' అన్నాడు నిరుద్యోగి.

అవతలివాడు తెలుగు సినిమా పక్షపాతి. పక్షానికి మూడో నాలుగో తెలుగులే చూస్తాడు. అతడు కోప్పడ్డాడు. 'అయినా కాకపోయినా యీ హిందీ లొచ్చాక అయిన్దానికి కానిదానికి తెలుగు సినిమాని ఆడిపోసుకోవడంగాని.. ఆ జగదేకవీరుడేదో ప్రపంచం తల్లక్రిందుల్జేసి దాని మీద నిలబడ్తాడనా


కొన్నారా? అయినా నేతి బీరకాయ కొన్నాం అందులో వెయ్యేందనుకున్నాం' అంతే అమ్మిన వాడు, మోసం చేసినట్లవుతుందా? లేకపోతే ఖారనేది దానికి 'జగదేక భీరుడ'ని పేరు పెట్ట మంటారా? అప్పుడు మాత్రం కథకీ పేరుకీ పొంత నుంటుందా..అయినా మీ పిచ్చి కాక పోతే వాటీజ్ దేర్ యిన్ నేమ్?' అన్నాడు అవతలివాడు.

'ఏవయినా తెలుగుసినిమాల గురించి నాతో చెప్పకండి..మీరూ నిరుద్యోగులే నేనూ నిరుద్యోగినే. యీ విషయంలో మాత్రం మనకి భేదాభిప్రాయాలున్నాయి. మనిద్దరికీ పొత్తు కుదరదు. వస్తాను. డబ్బులు వెకోత్కవాలి' అంటూ కదలి పోయాడు నిరుద్యోగి.

ఇలా తెలుగు సినిమాల నెత్తిన యింత దుమ్మెత్తి పోసినా తెలుగుసినిమా అంటే మరీ ద్వేషికాడు. అపుడపుడూ వట్టిగ్గా యింత దుమ్మెత్తిపోస్తాడువానదేంపోయిందని. ఊరికే పైకట్లా తిట్టడం ఫ్యాషన్ ...ఓ తెలుగు సినిమా కూడా పోతోందనే సరికి ఆలోచనల్లో పడ్డాడు. ఆ రోజుకి యింకో షోనే వుంది. సెకండు షో. పోయేవి రెండు సినిమాలు. కాంపిటీషన్. రెండు గవర్నమెంటు వుద్యోగాలకి యింటర్వ్యూ వకే రోజున వచ్చినట్టే వచ్చేసింది. వాన్నటవా? వెళ్లటవా? దేన్ని మానాలి.. అంటే దేని కెళ్ళాలి? యిదీ సమస్య. మనభాష కదా. తెలుక్కెడదాం' అనుకున్నాడు. అవతలి పిక్చర్లో వేషం గీషం చాలా బాగుంటుందని విన్నాడు. అటు భాషాభిమానం యిటు వేషాభిమానం....భాషాభిమానం ఉండొద్దన్నారు గానీ వేషాభిమానం గురించి యింకా ఏవీ అనలేదెవరూ. అందుకని వేషాభిమానం వున్నా దేశద్రోహం కాదు. నేరం అంతకన్నా కాదు. అందుకని హిందీకే వెడదాం అనుకున్నాడు.

దేనికెళ్ళాలో తేల్చుకున్నాక దేంతో వెళ్ళాలి అని ప్రశ్న వచ్చింది. నిరుద్యోగి దగ్గర దండిగా డబ్బుండదు. నిరుద్యోగి నాన్న మండిపడుతూ నెలకైదు రూపాయలు భరణం యిస్తాడు. ముప్పొద్దులా యింట్లో వేపుంటూ యింట్లోనే తింటూ యింకా పైనెందు కంటాడు ముందు. 'పై ఖర్చు'వి గొణుగుతాడు నిరుద్యోగి. పై ఖర్చులూ యిస్తూనే వున్నాంగా..నీ చాకలి ఖర్చులూ, మానెలా,,వీటన్నిటికీ..యింకా పై ఖర్చేవిటి? ఆకాశం ఖర్చు' అంటాడు నిరుద్యోగి తండ్రి......ఎలాగో వాళ్లచేత వీళ్లచేత చెప్పించి పదిరూపాయలు శాంక్షన్ చేయించు కుంటాడు. ఆ పదీ పదిరోజులు కూడా రావు. తర్వాత నోరుమూసుకుని, కళ్ళు మూసుకుని పడుకోవాలి. పడుకోవచ్చు. ఆ మాటకొస్తే కళ్ళు మూసుకుని కూర్చో వచ్చు, వచ్చినపిక్చర్లన్నీ తన ఉద్యోగం వచ్చిం దాకా వుంటే..యిపుడొచ్చే సినిమాలు నిరుద్యోగి నవ్వు మాదిరి ఎంతోకాలం వుండటం లేదు. ఆ నవ్వు మాదిరే జీవం లేకుండా వుంటున్నయ్...యీనెల్లో యిచ్చిన పది రూపాయల్లో అణా మిగిలింది. కాళ్ళీడ్చు కుంటూ యింటి కొచ్చాడు.

యింటి కొచ్చేసరికి చుట్టం వొకాయన కుర్చీలో తిష్టవేసి కూర్చున్నాడు. యీ చుట్టం నిరుద్యోగి కుటుంబాన్ని, ముఖ్యంగా నిరుద్యోగిని చూద్దామని మహా యిదైపోయి యివాళ పనిమీద యీ వూరొచ్చి పన్లు పని గాకుండా పనిగట్టుకుని యిల్లు వెతుక్కుంటూ మరీ వచ్చాట్ట. పరామర్శించి



భోంచేసి వెళ్ళాలని వుద్దేశంట'

భోజనం అయ్యిందా' అన్నాడు నిరుద్యోగి.

'అబ్బే, యింకా లేదు'అన్నాడు చుట్టం. అయితే, యిపుడపుడే కదలవన్నమాట' అనుకున్నాడు నిరుద్యోగి. ఆయన భోజనం చేసిగానీ కదల్నని వస్తూనే చెప్పాట్ట......' యితగాడి ప్రశ్నలకి జవాబులిస్తూ, కూర్చుంటే యివాళ సినిమా చూసినట్టే' అనుకున్నాడు నిరుద్యోగి. ఆ చుట్టపాయన అడగవే అడిగాడు' అబ్బీ! నువ్విపుడేం చేస్తున్నావ్' అని....యింటికొచ్చే ప్రతివాడికీ యిదో తెగులు. నిరుద్యోగం టే ఆట.

'నువ్వేం చేస్తున్నావ్' విద్దరోతున్నావు టగా' అంటారు. అందుకే నిరుద్యోగులో పథకం వేసుకుంటారు. కొత్తల్లో మాత్రం అనుభవంలేక పాపం ఉద్యోగం కోసమే వెతుకుతోన్నానండి' అంటారు. తర్వాత తర్వాత కాస్త రాటుదేలి నీటుగానే జవాబిస్తారు. లేకపోతే చులకనైపోరూ...యిలాంటి పదూళ్ళ పాపారాయళ్లతో మాట్లాడేప్పుడు మరీ జాగ్రత్త పడ్తారు. లేకపోతే 'వాడి కుద్యోగమే లేదుట' అంటూ చెప్పి ఉద్యోగం నెత్తిన వేసుకుంటారు. అందుకనే జాగ్రత్త పడి 'యింకా చదువులున్నాయి. రేపు అక్టోబర్లో కలెక్టరు ఎగ్జామ్‌కి వెళ్దామని ఓ ఏడాది పట్టున యింట్లోనే వుండి బాగా చదువు దామని యింట్లోనే వున్నాను. యీమధ్య ఢిల్లీలో వో ఉద్యోగం వచ్చింది. అయినా పోలేదు.' అంటారు. ఆమా(పా)టే యీ నిరుద్యోగి వుపయోగించాడు. చుట్టపాయన సంతోషం చూపించాడు. సంతోషపడ్డాడో లేదో తెలియదు. 'ఆదీ, అట్లా చెయ్యి.' పెద్ద పెద్దవాటికి చూడాలి. ఉద్యోగం పురుష లక్షణం అంటూ ఏదో ఉద్యోగం చెయ్య కూడదు. చిన్నఉద్యోగం చెయ్యడం అవలక్షణం కూడాను...అయినా యిప్పట్నుంచీ నువ్వు వుద్యోగం చేసి వూళ్ళేలాలా...బజార్ల వెంట తిరుగుతూ చదువుకో' అన్నాడు.

8—30కి భోంచేశాడు చుట్టపాయన. అయినా వెళ్లలేదు. వచ్చి వసారాలో మడత కుర్చీలో పడుకున్నాడు...కాస్సేపలా పడుకుని 'మీ వసారాకి పదిహేడు వాసాలున్నాయి. పదిహేడుండ కూడదు. పద్దెనిమిది వుం

తాలి. లేకపోతే వదవోరుంటారే.' అన్నాడు. యితగాడికి యింట్లో తిని వసాతా వాపిలు లెక్కెట్టడం అలవాటు. పోనీ వకటి పీకేద్దాం. వదవోరుంటారే' అన్నాడు యింకా పైగా. నిరుద్యోగి తండ్రి భయపడ్డాడు యిల్లు పీకుతాడేమోనని. 'అయ్యో, తొమ్మిదింటికే రైలు. బయలుదేరండిహ' అన్నాడు. చుట్టం హడావుడిగా వెళ్ళిపోయాడు. నిరుద్యోగి తొందరపడి బామ్మ దగ్గర చేరాడు.

'బజారు గుడ్డల్లో అలా మీదపడకు. దూరంగా కూర్చో' అంది బామ్మ కసురుకుంటూ.

ముందే హైపిచ్‌లోకి వెడితే లాభంలేదని నిరుద్యోగి వెనక్కి తగ్గాడు. 'బామ్మా, నువ్వు కసురుకో. నేనేం అనుకోను. అసలు నువ్వనటం నేను పడటం విధాయకం. నువ్వివ్వటం నేను పుచ్చుకోటం రివాజు... నువ్వు దగ్గరగానే తిట్టు. మా అమ్మని తిట్టినట్టు గొణుగుతావేం.'

'పోరా, పిచ్చిసన్నాసి! నిన్నెందుకు తిడ్తాను...సరే, ఏవిటీ పరామర్శింపు. ఏవన్నా డబ్బులా. బాబ్బాబు. అవడక్కు. నేను లవంగం పలుకు వేసుకుందు కూడా పైసా లేదు.' అంది బామ్మ.

'బామ్మా, నువ్వు నిజంగా గాంధిగారికన్నా గొప్పదానివే...ఏం సింప్లిసిటీ. నీ దగ్గరో మంచి గుణం వుందిలే, ఎంతున్నా బయటపెట్టవ్..కనీసం నా బోటివాడికి బుణం కూడా పెట్టవ్...అసలా గుణం వుండాల్లే...నిండుకుండ తొణకదని. నేను చూడు ఏం లేక పోయినా ఎగిరెగిరి పడ్తాను' అంటూ యింకాస్త దగ్గరికి జరిగాడు నిరుద్యోగి.

'ఓరేయ్, నువ్వు లెక్కచెప్పు. నా దగ్గర కానీలేదు. నిన్న గుళ్ళో వేస్కోనికి కానీ కూడా లేక ఎంటిదైనాను. కార్తీక సోమవారం గదా అంటే కానీ కనిపించలేదు.' అంది బామ్మ.

'కళ్ళజోడు పెట్టుకోకపోయినావ్' అంటూ నవ్వుకున్నాడు నిరుద్యోగి. బామ్మ నవ్వింది. నవ్వి అంది. 'అసల్లేందే ఏం కనిపిస్తుందిరా... కళ్ళజోడు పెట్టుకుంటే మాత్రం..' యీ పెద్దాళ్ళ దగ్గరో సుగుణం వుంది. అవతలి వాడు నవ్వుతూ ఎగతాళి కన్నా, అలాంటి వాడి కూడా సమాధానం యిస్తారు. బామ్మ కూడా అలానే యిచ్చింది.

'లదా. అసలు లేదంటావా...అయినాగానీ బామ్మా..నీకు తల వక్కొక్కప్పుడు పని చెయ్యదా..నేను వెళ్ళింది సెంటరుకి గాని

నిరుద్యోగపర్వం

శంకరగిరి మాన్యాలకి కాదుకదా. కానీ అర్ధణా. నీక్కావలిస్తే నన్నడిగితే యివ్వనూ. బామ్మా నీకిపుడే చెబుతున్నాను. మళ్ళీ మళ్ళీ చెప్పను. కానీ అర్ధణా నీక్కావలిస్తే నన్నడుగు, రూపాయి, రెండూ కావాల్సొస్తే నేన్నిన్నడుగుతాను. వేనడక్కపోయినా నువ్విచ్చక పోయినా నీ మీదొట్టు..'

'నా తండ్రే, యిచ్చినా యివ్వకపోయినా యిచ్చినంత మాటన్నావు. చాలు' అంటూ ఎంతో యిదైపోయింది బామ్మ. నిరుద్యోగి పుంజుకున్నాడు.

'బామ్మా, నాకో విషయం చెప్పు. ఏవిటే ఆ సూరమ్మ అంత యిదౌతుంది. వాళ్ళాయనేవన్నా బాగా యిచ్చిపోయాడా. వాళ్ళ మనవడు సుబ్బారావు లేడూ.. వాడికి రోజుకు రూపాయిస్తుందిట. 'మా బామ్మకి చాలా డబ్బు'ందంటాడు. యింకా పైగా 'మా బామ్మకంటే ఎక్కువుంద'న్నాడు.. నీతో చెప్పటం కాదుగానీ నా కప్పుడు భలే కోపం వచ్చిందిలే. అదికాదు బామ్మా! నీ పరువు పోతే వకటే, నా పరువు పోతే వకటా.... వెంటనే అనేశాను. నీ స్నేహితురాలైతే అయింది కానీ..'ఏవిటోయ్, మా బామ్మకున్న ఆస్తి. మా బామ్మకున్న దాంట్లో సగంలేదూ' అని. అయినా బామ్మా ఎవరికెక్కు వుందే.'

'దాని బొంద. దానికేం వుంది. నాకు తెలియదా దానాస్తెంతో! చచ్చేప్పుడు వాళ్ళాయనో కుంట రాసిచ్చాడు. మరి నాకు ఆ మహారాజు...మా తాతయ్య... రెండు కుంటలు రాసిచ్చాడు గదా.. ఏమనుకున్నాడో ఆ సుబ్బిగాడు.'

'అయినా బామ్మా! వాళ్ళ సనేం లాభం. మనం పైకి వున్నట్టు కనిపించడం లేదే. ఎవడి గొప్పయినా పైకి వస్తేగానీ కనిపించదు.'

'అయితే ఆదస్తావేజు లివ్వడమను తెలుస్తుంది.'

'బామ్మా! నువ్వీ కాలంలో వుండాల్సిన దానివి కాదే. వట్టి పిచ్చకాలం మనిషివి... డబ్బుందని చెపితాని కాగితాలు చూపిస్తావుటే..అయినా ఎంతనుందికని చూపిస్తావు..డబ్బుందని చూపించాలంటే డబ్బు చూపించి వాళ్ళ కివ్వకుండా మనం ఖర్చు పెట్టాలి. అప్పుడు తెలుస్తుంది మనగొప్ప! ఆ సుబ్బారావు చూడు ఎట్లా ఖర్చు పెడతాడో! పైగా 'మా బామ్మ బాగా వున్నది. ఆవిడ బాగున్నంతవరకూ నాకేం ఫర్వాలేదు' అంటాడు. నువ్వు కూడా నాకట్లా యిస్తూ వుండు. వాడి నోరు నేను నెల.. ఒక్క నెలరోజుల్లో మూయిస్తాను.'

బామ్మ విన్లేదు. కాగితాలైతే చూపించమంది గానీ డబ్బు లివ్వనంది. యిలా లాభం లేదని నిరుద్యోగి అసలు గోడు చెప్పుకున్నాడు. సినిమా పోతే మళ్ళీ రాదన్నాడు. రూపాయి పోతే రెండు రూపాయి లొస్తయ్యన్నాడు... చివరి కిచ్చిందో ఆరణాలు.

'యిదేమిటే, గాంధిగారి క్లాసు కెళ్ళనా? యూనివర్శిటీలో రూపాయిన్నరకి తక్కువకి వెళ్ళని వాణ్ణి ఆరణాలకా? బామ్మా నీకు హృదయం లేదు. నన్నింత అవమానం చేస్తావా? నీ అవమానం నా అవమానం వకటే అన్నా యింత పన్జేస్తావా' అంటూ వాపోయాడు.

'అబ్బ, అవమానం అయితే అవి యిట్లా పారెయ్యి. నా దగ్గర యిహ కానీ లేదు' అంది బామ్మ మంచం మీద పడుకుంటూ.

'బామ్మా! నీకీ వెధవ పిసినారి తనం ఎక్కణ్ణుంచి వచ్చిందే, నాకులేంది..ఏం వెళ్ళేప్పుడు కట్టుకుపోతావా పట్టుకుపోతావా? అన్నీ వెధవ పీనాసి చేష్టలు.' అన్నాడు నిరుద్యోగి కోపంగా.

'హారా! వెధవా! అవిటి పారెయ్యాసలు. అంటూ మంచం మీదించి లేచింది బామ్మ. నిరుద్యోగి చొక్కా జేబులోంచి డబ్బులు విసురుగా తీశాడు..ప్యాంటు జేబులో వేసుకున్నాడు. ఆట్టే అరుస్తే బయట కూడా వెళ్ళనివ్వరని వీధిలో పడ్డాడు.

తొమ్మిదిన్నరయ్యింది. యింకో వందగజాల్లో హాలుందనగా సినిమా కొచ్చినట్లు కాకుండా పని మీద అటు పోతున్నట్లుగా చకచక నడుస్తూ, పక్క నెవరన్నా ఎరిగున్న వాళ్ళుంటే తొందర 'పనుండి పరుగెత్తుతున్నాడనుకునేట్లుగా చుట్టుపక్కలన్నీ చూస్తూ వెళ్ళిపోయాడు. కాస్సేపయ్యాక మళ్ళీ వెనక్కి తిరిగొచ్చాడు. మళ్ళీ పనున్నట్టుగానే నడక. ఈ మాటెవ్వడూ లేడని నిశ్చయించుకుని రూపాయిన్నర బుకింగు దగ్గర కాస్సేపు తిరిగాడు. యింతలో సైకిలు మీద పోతూ 'హల్లో! నిరుద్యోగీ!' అన్నాడు. నిరుద్యోగి గతుక్కుకున్నాడు. 'ఎవడీ అప్పుడు' అనుకున్నాడు. అప్పుడు దగ్గరి కొచ్చాడు.

'సినిమాకా?' అన్నాడు అప్పుడు. అందు

కేనని అనుకుంటున్నానని అవునని నమా ధానం రావాలని ధ్వనించేటట్లు.

'అబ్బే, సినిమాక్కాదోయ్..మా బొమ్మొ చ్చింది సినిమాకి. తీసుకెళదాం అనివచ్చాను' అన్నాడు నిరుద్యోగి.

అప్పుడు ఆర్తనాదం చేశాడు. వాడికది నవ్వు. 'హిందీ సినిమా ల్యాస్తోందా మీ బొమ్మ' అన్నాడు నవ్వుతూనే. నిరుద్యోగి తెలివిలోకి వచ్చాడు. తన తెలివితేటలకి సిగ్గుపడ్డాడు. యిపుడేం చేయాలా అని ఆలోచించాడు.

'ఆ, ఏం హిందీ సినిమానోయ్..'ఇల్లరికం' కథే కదా!.. అందుకని యింట్లో అందరూ 'ససురాల్' బాగుందో అంటుంటే వచ్చింది. అదీగాక ప్యాసొకటొచ్చిందిలే. అందుకని మా చెల్లాయితో కలసి వచ్చింది' అన్నాడు.

'అలాగా' అని అలాగే నిలబడ్డాడు అప్పుడు. వెళ్లిపోలేదు. వీడూ సెకండుషో కేనేమోనని అనుమానం వేసింది. దాంతో భయం వేసింది. వీడూ యీ సినిమాకే వస్తే యివాల్టికి సినిమా 'ప్రోగ్రాం' క్లోజ్. సంశయ నివృత్తి కోసం అడిగాడు. 'ఏం, నువ్వు దీనికి వెడుతున్నావా?' అని, నేను వెళ్లటం లేదని బాగా ధ్వనించేటట్లు.

'అదే చూస్తున్నా..పాటలూ అవీ బాగున్నాయి. మళ్లీ చూద్దామ. యీవాళ లాస్టు డే కదా...అఫ్‌కోర్సు ఓ నాలుగు తడవలు చూశాననుకో' అన్నాడు అప్పుడు.

'నీ బొంద' లిట్టుకున్నాడు నిరుద్యోగి. ఆ మాటె పైకన్నాడు.

'నీ బొంద. నాలుగుసార్లు చూసి మళ్లీ ఎందుకు? రెండుసార్లు చూసిన నాకే మళ్లీ వెళ్ల బుద్ధెయ్యడంలేదు.' ఒక అబద్ధమాడి వాణ్ణి సినిమా చూసే ప్రయత్నం నుండి మళ్లించాలని చూశాడు. అవతలివాడు గడుసువాడు.

'ఎన్నిసార్లు చూస్తే ఏమోయ్..వెళ్లలనే అనుకుంటున్నాను' అన్నాడు...పిల్లికి చెలగాటం ఎలుక్కి ప్రాణసంకటం మాదిరుంది...నిరుద్యోగి ఆలోచించాడు... నిరుద్యోగి బుర్రలో మెరుపు మెరిసింది.

'ఒరేయ్....ఆ తెలుగు పిక్చర్ చూశావ్' అన్నాడు.

'లేద'న్నాడు అప్పుడు.

'మరి దానికి పావరాదూ. (స్వగతం: శనేశ్వరంలా దీనికేడవకపోతే) అదీ యివాల్టితోనే పోతోంది' అన్నాడు.

అప్పుడు ఆశ్చర్యపడ్డాడు. క్రింద పడబోతే 'నిరుద్యోగి పట్టుకున్నాడు..'నిజంగా. పోతూందా...మొన్ననేగా వచ్చిందనుకున్నా యింకా చూళ్లేదు. మంచిమాట చెవి వేశావ్. సరేవస్తా' నంటూ బయల్దేరి వెళ్లబోతూ మళ్లీ ఆగాడు.


'ఒరేయ్, మీ బొమ్మని చూసి చాలా రోజులయ్యింది. యిక్కడకొచ్చి కూడా చూళ్లేదంటే ఏమన్నా అనుకుంటుంది. యీ పిక్చరొదిలాక మీ బొమ్మని పలకరించి పోతా' నన్నాడు.

నిరుద్యోగికి గుండె ఆగినట్లయ్యింది. కాని వెంటనే, 'ఒరే అప్పుడూ! మా బొమ్మ క్కనపించి మాటలు మొదలెట్టావంటే యివాళ సినిమా గోవిందా' అని ఝడిపించాడు.

అప్పుడు భయపడి పారిపోయాడు సైకిలు మీద. 'హమ్మయ్య' అనుకున్నాడు నిరుద్యోగి.

సినిమా వదిలారు..అందరూ వెళ్లిపోయారు. నిరుద్యోగి ఏ బుకింగు దగ్గరా నిలబళ్లేదు. పదణాల దగ్గర్నుంచి పైక్లాసు అన్నిటికీ టిక్కెట్లిస్తున్నారు. నిరుద్యోగి రోడ్డు మీద నిలబడి బుకింగు వేపు చూడకుండా యింకో వేపు చూస్తున్నాడు. ఎవడి కోసమో వెయిట్ చేస్తున్నట్లూ, వాడొచ్చాకే టిక్కెట్లు కొనేట్లు.. 'యిన్ని టిక్కెట్ల బుకింగ్ లెందుకు? అన్నీ ఒక చోటే అమ్మితే ఏ టిక్కెట్టు తీసుకున్నాడో యిచ్చేవాడికీ పుచ్చుకునే వాడికీ తప్ప మూడో కంటి వాడికి తెలియకుండా పోవచ్చు' అనుకున్నాడు...ఆరణాల బుకింగు తెరవకుండానే నస్టు బెల్లుకొట్టారు. 'నిరుద్యోగినూస్తే యింట్లో వాళ్లకెంత అలుసో ఆరణాల వాళ్లని చూస్తే హాలు వాళ్లకంత చులకన. ఆరణాల క్యూ దగ్గర చూశాడు. అక్కడో వంద గజాల 'క్యూ' వుంది. అదనంగానే తీసుకుందాం, నిలబడితే మధ్యలో ఎవడన్నా చూస్తే బాగుండదని ఆరణాల వేపు చూసీ చూడకుండా చూస్తున్నాడు.. ధర్డు బెల్ కొట్టేసి న్యూస్ మొదలు పెట్టారు... 'హమ్యా' అనుకున్నాడు నిరుద్యోగి. యింతలో పదిమంది ముఠా కట్టుకొచ్చి నలుగుర్తో మనం అంటూ వరసనే నిలబడ్డారు.. నిరుద్యోగికి ఆదుర్దా హెచ్చయ్యింది. సినిమా మొదలెట్టేశారు..యింకా నలుగురే వున్నారు. 'హమ్మయ్య' అనుకున్నాడు..అయినా కడి వెనకాల వకడు వస్తూనే వున్నాడు. క్యూ పెరుగుతూనే వుంది. నిరుద్యోగి తొందర్లో వస్తుందనుకున్న ఉద్యోగం మెల్లి మెల్లగా ఆలశ్యం అవుతున్నట్లు...చివరికి అంతా వెళ్లిపోయారు. నిరుద్యోగి అటూ యిటూ చూసి అప్పుడూ, ఆవగింజంతవాడూ ఎవ్వడూ లేడని నిర్ధారణ చేసుకుని బుకింగు దగ్గరకు పరుగెత్తాడు..టిక్కెట్టిచ్చే వాడిక్కూడా ముఖం చూపించకుండా టిక్కెట్టు తీసుకుని హాల్లో కెళ్లి నలుగురి మధ్యా కూర్చున్నాడు.

యింటర్వెల్లవుతోంది...'వెధవ గొడవ, యింటర్వెల్లేకుండా చూపిస్తే నీడి సొమ్మేంపోయింది?' అనుకున్నాడు.. నిరుద్యోగి ఏమనుకున్నా యింటర్వెల్లయింది. పైగా యింకో అన్యాయం జరిగింది. నీడ కోసం తాటి చెట్టు క్రింద నిలబడ్డ బట్టతల పైనే కాయపడ్డట్టు, ఉరుము మంగలం మీద పడ్డట్టు నిరుద్యోగి నెత్తిమీదే సూటిగా లైటు పడింది. 'యింటర్వెల్' అని తెర



నిరుద్యోగపర్వం

మీద కనుపించగానే తలొంచేసి ముందు బెంచీని ముద్దెట్టుకుంటున్నాట్టు ముందు బెంచీ క్రింద చూస్తూ వంగి కూర్చున్నాడు. రైళ్ల మాదిరి 'జనతా' హాల్సు కూడా వస్తే బాగుండు ననుకున్నాడు. యింతలో కొందరు బయటకు పోవానికి లేచారు వీళ్లు బయటకు పోతూ ప్రక్కవాళ్లని 'తప్పు కోండి, కాళ్లు తీయండి' అనరు నడుస్తూ కాళ్లతో మోకాళ్లతో నో తాపుతంతూ వస్తారు. యిలాంటి వాడే వకడొచ్చాడు నిరుద్యోగినో తాపుతన్నాడు 'నెవ్వర్ మైండ్' అన్నాడు నిరుద్యోగి అని వాలి క్కరుచుకున్నాడు అలావో దెబ్బ తిన్నప్పుడు తిన్పించినవాడు 'సారీ' అంటం విధాయకం తిన్నవాడు 'నెవ్వర్‌మైండ్' అంటం అల వాటు వానీ యీ తాపుతన్నిన వాడు 'సారీ' అన్లేదు అయినా నిరుద్యోగి 'నెవ్వర్‌మైండ్' అన్నాడు యిలాంటివే అసంకల్పిత ప్రతీ కార చర్యలకు ఉదాహరణలని నవ్వుకుని తప్పుకున్నాడు కాళ్లు పైకి తీసుకున్నాడు కానీ తల పైకెత్తలేదు వాడటుపోంగానే మళ్లీ తలముందు బెంచీ క్రింద పెట్టే శాడు

ఓ నళ్లీ, నళ్లీ తల్లి బెంచీ మీద కొచ్చాయి నళ్లి ఆశ్చర్యపడింది నిరుద్యోగిని చూసి.

ఓ (వ)తల్లీ! ఎవ్వరీతడు? అంతా లేచినా లేవడు' అందితల్లి నళ్లి నుద్దేశిస్తూ నళ్లి తల్లి కధంతా చెప్పింది

'హార్ట్లే లేక హాసిని! మనం పి(ప)లిస్తే ఎట్లా వుంటుంది' అంది ఉత్సాహంగా.


'చూడు అయినా' అంది తల్లి నళ్లి వెళ్ళింది నిరుద్యోగి అబ్బా అనుకున్నాడు కాలేవలేదు అటుకదల్లేదు ఇటుకదల్లేదు. నళ్లి 'ఓరి వీడి దుంపతెగా' అనుకుంటూనే నెత్తురు జుర్రుకుంటూంది తల్లి కూడా వచ్చింది అయినా నిరుద్యోగి కదల్లేదు కర్వలేదు కుమ్మరి పురుగూ కథ గుర్తు కొచ్చి నవ్వుకున్నాడు ఏడుస్తూ యిది విని మరీ ఆశ్చర్యపడింది నళ్లి

'నేం చెప్పలా శతమొండి' అంది తల్లి

లైట్లార్పారు తల్లి నళ్లిని తొందర పెట్టింది 'రా, యిహ పోదాం. యిక్క డుంటే ప్రతీకారం చేస్తాడు' అని ఆవతలికి లాక్కెళ్లింది నిరుద్యోగి లైట్లార్పంగానే లేచాడు ప్రక్క వాడంటున్నాడు 'యింత సేపూ కూర్చుని యిపుడు లేస్తావేమయ్యా' అని. నిరుద్యోగి యివేం వినిపించుకోకుండా చేత్తో బెంచీ మీద గట్టిగా రుద్దాడు. జేబు రుమాలతో తుడిచాడు. కూరున్నాడు..

పిక్చరవ్వుస్తోంది హీరో హిరోయిన్ అపోహల్పంపేసుకుని షికారు బయల్దేరు తూంటారు. పాపం యీ ప్రేక్షకులికి నాటకాల్లో 'హన్స మోర్' అనే హక్కున్నా వుంది యిక్కడదీ లేదు అలా అని యివి నాటకాల కన్నా గొప్పా ఏమన్నానా అనుకుని కొందరు హృదయం వున్న, వున్న హృదయం మంచిదైన డైరెక్టర్లు సినిమా మధ్యలో పాడిన పాటలో ఓ చరణం చివరికి పెడ్తారు. యీ సినిమాలో కూడా ఆ సీను వచ్చింది. ఆ సీను రాకముందే వాళ్లు కలుసుకున్నపుడే నిరుద్యోగి ద్వారం దగ్గరకు వచ్చేశాడు! వాళ్లలా కార్లో ఎక్కి షికారెడ్తూండగా ఆరణాల గేటు దగ్గర్నించి రూపాయి గేటు దగ్గరకెళ్లి అక్కణ్నించి వాళ్ల షికారూ, అవీ చూసి సినిమా అయ్యాక రూపాయి గేట్లోంచి బయటకొచ్చాడు.

(ఇంకా ఉంది)



దగ్గు మరియు రొంపనుండి

నిజమైన స్వస్థత పొందుటకు



సిరోలిన్ వాడండి

దగ్గు లేక రొంపను అశ్రద్ధచేయకండి సిరోలిన్ వాడి నిరపాయముగా, శీఘ్రముగా నిజమైన స్వస్థత పొందండి. సిరోలిన్ దగ్గును ఆపుటయేకాదు అది మీ దగ్గుకు మూలకారణమైన హానికరమగు సూక్ష్మ క్రిములను నశింపచేయును, కఫమును సునసు పోగొట్టును. సిరోలిన్ ఎంత కష్టమైన దగ్గునైనను శీఘ్రముగా పోగొట్టి స్వస్థత చేకూర్చును. దాని పనితనమును బట్టియు రుచిని బట్టియు సిరోలిన్ కుటుంబములోని వారి అందరి అభిమాన పాత్రమై యున్నది. పిల్లలకు సిరోలిన్ అంతే ఎంతో ప్రీతి




మీ యింట్లో సిరోలిన్ తప్పక ఉంచండి

రోష్ తయారు వోల్ట్ డిస్ట్రిబ్యూటర్స్ వాల్టాస్ లిమిటెడ్

HWT VT-2397

వైజ్ఞానిక గాథావళి-66



రసవాదము సంగతి

రోము నగరములో స్వాతంత్ర్య భవనము చూస్తూంటే ఒక యువకుడు "పార్కర్ పెన్ను. కొత్తది, కావాలా?" అని అడిగేడు బంగారపు కేపూ, ఉల్లిపొర కాగితపు కవరూతో అవుననే అనిపించింది. చేతిలోకి తీసుకుని ఉల్లిపొర గొట్టాములోంచి పెన్ తీసి చూశాను. PARKER అని అక్షరాలు చక్కగా కనబడ్డాయి మళ్లీ ఇచ్చేసి, ఎవరినైనా కనుక్కుని మరీ కొందామనుకుని వెనక్కి తిరిగేను "2000 లీర్లు ఇవ్వండి కొత్త పార్కరు షాపులో నాలుగు వేలు, 8000 లీర్లు" అన్నాడు నేను వినిపించుకోలేదు. తరవాత నా స్నేహితుడు చెప్పేడు అది పార్కరు కాదూ P ARKER పెన్ను, P తరవాత చుక్క వుంటుంది చూడమని. అర్ధరూపాయి విలవ కూడా ఉండదట!

పదహారూ పదిహేడూ శతాబ్దాలలో బంగారము చేస్తున్నామని చెప్పిన రసవాదుల బంగారము కూడా అలాటిదే బంగారపు వన్నె పసిమి దానికి మెరుగు ఉంటుంది గంధకము పచ్చగానే వుంటుంది గాని దానికి మెరుగ రాదు పాదరసానికి మెరుగైతే వుంది గాని అది పసిమికాదు గంధకమూ పాదరసమూ చేర్చి వండితే, దాని పసిమీ దీని మెరుగూ చేరిన లోహము—బంగారము—వస్తుందని తంటాలుపడ్డారు రసయోగులు. ఈ రసమన్నది పాదరసము కాదనీ, యోగులకు అమ్మవారు వరముగా ఇచ్చిన రసమేదో ఇంకొకటి అనే భక్తులూ ఉన్నారు. అలింపురము బ్రహ్మేశ్వరాలయములో ఒక యోగి విగ్రహమున్నది. అతని భుజానికి తాడుతో సొరకాయ బుర్ర తగిలించి ఉన్నది ఈ యోగి అక్కడి ఆలయాల్ని ఆ సొరకాయ బుర్రలోని రసాన్ని ఉపయోగించి చేసిన బంగారము ఖర్చుచేసి కట్టించాడని కథ అక్కడి ఆలయాల వెనుక త్రవ్వకాలలో ఈ రసయోగులే కాబోలు వంటలు చేసిన పొయ్యిలు బయట బడ్డాయి ఇవి బంగారము చేసే యత్నాన్నే బయల్పరుస్తాయి గాని ఆ యత్నవిజయాన్ని కాదంటాను.

'సువర్ణము యొక్క రంగుని అధమ లోహమైన సీసమునకు తెప్పించే యత్నాలూ జరిగేయి సీసము కొంచెముగా వెచ్చబెట్టితే పసుపుపచ్చని తొలి సీసపు ఆక్సైడు ఏర్పడుతుంది. దాని రంగును సీసపు లోహానికి తెప్పించడమే తరవాయి అని తంటాలు, పడ్డారు రసవాదులు ఈ తంటాలన్నిటా తయారై బయటబడినవి లోహభస్మాలు లోహభస్మాలు ఆ లోహమును యథాతథంగా భస్మరూపానికి తేవడాలు కాదు, మరి ఆ లోహాలకు ఇతర పసరులో ఏవో చేర్చి లోహసంయోగముల (Chemical Compounds)ను చేయడాలు లోహసంయోగాలు ఎన్నో పసుపు వర్ణానివి ఉన్నాయి. 'ఇక మిగిలినది, ఇలాటి వంటలలో పుటములలో, పచ్చని లోహాన్ని మిగిలించడము' అని చాలామంది, చాలా యత్నాలు చేశారు. ఎవరికీ పచ్చని లోహమైతే రాలేదుగాని, భస్మాలు వచ్చాయి. భస్మాలు వైద్యములో ఉపయోగించేవారు కనుకనే 'రస వాద భ్రష్టో వైద్యశ్శేషః'.

ఈ యత్నాల తబిశీళ్లే కాబోలు "ఉప్పు చింతపండు ఊరిలో నుండగా కరువదేల వచ్చె కాపులార, తాళకం బెరుగరో తగరంబు నెరుగరో" అన్న లాటి వేమన్న పద్యాలలో కనబడతాయి. ఉన్నవ లక్ష్మినారాయణగారు ఉప్పు అంటే మూత్రమనీ, చింతపండు అంటే మలమనీ చెప్పేసారు నాతో. తాళకము అంటే ఆర్సెనిక్కు పాషాణము ఇది తగరానికి 'సు' వర్ణము తెస్తుందో లేదోగాని, రసయోగుల పిచ్చి పిచ్చి యత్నాలను మట్టుకు బాగా సూచిస్తుంది. ఏదేది దొరికితే దాన్నల్లా తెచ్చి వంటబెట్టిన వెర్రి మాత్రము తెలుస్తుంది వీటిలో 'ఇంగిలీక మహిమ హేమించ నేరక' అని ఇంకొక పద్యముంది, ననారి అన్న ఋషితో సంవాదము ఒక పుస్తకముంది "అది అంతా నిగూఢ సువర్ణ యోగ సూత్రాలది" అని రసయోగము సాధించడానికి తన సొమ్మునే కాక ఇంకొకరి సొమ్మును కూడా ఖర్చు చేయించే ఆయన చెప్పేరు నాతో

వీటన్నింటా పనికి వచ్చే ప్రక్రియ ఏదీ లేదంటారా అని అడిగితే అందరికీ పనికి వచ్చేదన్నో కాదోగాని కొందరికి పనికి వచ్చే ఉండవలసిన ప్రక్రియ చేతలలో కాకపోయినా మాటలతో తేలింది బంగారము కొంత కొని, దానిలో ఏ పాషాణమో చేర్చి, (నీచ లోహమును కూడా కాబోలు) కరిగించి,, మోతాదు వేడిమిలోనే ఆపి చల్లారుస్తారట కొందరు పాషాణము అంటే ఆర్సెనిక్కు సంయోగము ఆర్సెనిక్కు సల్ఫైడ్ పసుపు పచ్చగా వుంటుంది ఈ వంటలో మిగిలేదానిలో మొదట వేసిన బంగారము వుంటుంది గదా? అది గీటుబంగారము లాగే గీస్తుంది నైట్రికు ఆమ్లముతో కడిగినా బంగారపు గీటుపోదూ, నకిలీ ఆ గీటులో ఏ కొంచెమున్నా కడుక్కుపోతుంది. బహుశా అది గీటు పెట్టగలిగేటంత గట్టి నకిలీ (impurity) కాదేమో! అంటే ఏమన్న మాటా? బంగారముతో దాని బరువుని పెంచే వర్ణమును మార్చని వస్తువును దేనినో చేరుస్తారన్నమాట వీళ్లు. బజారులో బంగారు పరీక్ష గీటూ, నైట్రికు ఆమ్లపు శుద్ధిని ఈ చిన్నముక్కలతో, గీటు రాతి మీదేగాని ముద్దలతోనైతే నిలవక పోయినా, పైన చెప్పిన పి. అర్కరు పెన్ను

లాగ అతి ఆసక్తి గల కొనుగోలుదారులను మోసగించడానికి పని చేస్తుంది

ఆధునిక రసాయన శాస్త్రజ్ఞులు పాదరసపు పరమాణువులను విశ్లేషించి, వాటి లోంచి ఏ భాగము తీసేస్తే అవి బంగారు పరమాణువు లవుతాయో కనుక్కున్నారు. అంతే ఈవిచ్ఛేదము ముద్దలతో సాధ్యము కాదు పరమాణువులతోనే సాధ్యము. రాసాయనిక ప్రక్రియలలో వినియోగానికి వచ్చే ఉష్ణశక్తులూ సంశ్లేషశక్తులూ, మొక్కలలో వినియోగానికి వచ్చే జీవ రసాయన శక్తులూ పరమాణు విచ్ఛేదక దక్షతలేనివే కనుక ఆ మట్టములో జరిగే ప్రయోగాలకు లోహములు మారలేవు కనుక ఎవరు యత్నము చేసినా మారబోవు. బంగారము లేని మొక్కలలో ఎరువులూ రసాయనాలూ సప్లైచేసి బంగారము తయారయేటట్టు చేస్తామన్న వారివీ వట్టి భేషజాలే. పరమాణు విచ్ఛేదము వల్ల తయారు కాగల బంగారపు ఖరీదుకి వేలాది రెట్లు సొమ్ము, ఆ యంత్రాల్ని పని చేయించడానికి అవుతుంది! ●





మనిషికి అవసరమున్న మరొకటి

శ్రీపతి

అమ్మా, మనపొరుగింట్లో దిగుతున్నారే—వాళ్ళు—ఆయన లెక్చరర్‌గారంట అమ్మా—వాళ్ళు— మన చిన్నపిన్నంత ఉంటుం దమ్మా—ఆమె! లెక్చరర్ గారిభార్య అంట.' అని ఇంకేదో చెప్పబోయాడు. కాని చెప్ప లేక కూచున్నాడు కరుణ అమ్మ ఎదురుగా.

అమ్మ తోటకూర కడుగుతోంది. పక్కనే వత్తుల స్టౌ మండుతోంది. సాయంత్రం వంట చేసుకోవటంలో వుంది అమ్మ కాలేజీ నించి వచ్చాను ఇంకా ముఖమన్నా కడుక్కో లేదు. వాడి గొంతు వినీవినడంతోనే ఏమిటా అని వెళ్ళాను.

'అమ్మా, ఒకమ్మాయి వుండే. వాళ్ల అమ్మాయేనంట' అన్నాడు నేను బాత్‌రూం వేపు వెళ్ళడం చూసి

దాంతో అందమైన ఆలోచన ఒకటి తట్టింది. ఆ అమ్మాయి వీడిక్లాసే అయి లేనో! రోజా అమ్మాయి వీడిని పిలవటానికి వస్తేనో! ఆడపిల్లలంటే వీడికి తగని సిగ్గు. ఆ సిగ్గు పోగొట్టానికి పెద్దన్నయ్య చెయ్యని ప్రయత్నమంటూ లేదు.

రెండో దినం ఆ అమ్మాయిని బడిలో చేర్చాలనుకుంటున్నారని ఆ పక్కింటి రాధమ్మ చెపితే నా ఊహాలు నిజమవుతున్నంత సరదాగా వుంది. ఆ రోజే ఆ ఇల్లాలు 'ఏమండీ' అంటూ ఇంటికి వచ్చారు. వరండాలో కూచుని రజనీ నేనూ మాటాడుకుంటు న్నాము. అప్పుడే వచ్చాం కాలేజినించి.

'అమ్మగారున్నారా?' అని ఆమె బయట నించి

'ఉన్నారండీ, రండి' అని అమ్మతో పరి చయం చేశాను తీసుకుపోయి.

ఆ కొత్తదనంచూసి 'ఎవరు?' అందిరజని.

'పొరుగింట్లో దిగారు. విన్ననే'

'ఏం చేస్తున్నారంట?'

చెప్పాను—

అంతలో స్కూల్‌నించి బాబ్జీ, కరుణ, వాని, ప్రసాదు, శీను, స్వామి అంతా వచ్చారు. వాళ్లంతా కరుణ క్లాస్‌మేట్సు ఆరులో వున్నారు. కబుర్లుచెప్పుకుంటూవస్తున్నారు.

'అక్కయ్యా, పక్కింటిలో దిగారే—ఆ అమ్మాయిని మా స్కూల్లోనే చేర్చారు. మా క్లాసే' అన్నాడు బాబ్జీ.

బాబ్జీ ఎవరి గురించి చెపుతున్నాడో నాకు తెలుసు. అయినా అడిగి తెలుసుకోవా లని 'ఎవరు?' అన్నాను.

బాబ్జీ మళ్లీ విసుక్కోకుండా చెప్పాడు,

'మీ క్లాసేనా?'

'ఆ'

'ఆ అమ్మాయి బెజవాడలోనే చదువుతుండేదంట.' అని తెలిసిన సంగతులే తలో మాట చొప్పున గొడవ చేసి చెప్పారు

అంతకువరకు తలదించుకుని రాసుకుంటున్న పెద్దన్నయ్య పక్కకి తిరిగి కరుణ వేపు చూసి 'ఇంకేం?' అన్నాడు

కరుణ స్నేహితులంతా వెళ్ళిపోతామని చెప్పడంలో వెధవ వినలేదేమోనని వాళ్ళు వెళ్ళిపోయాకా మళ్ళీ 'జత దొరికిందిరా నీకు' అన్నాడు పెద్దన్నయ్య మళ్ళీ

'పో శాడీ' అనేసి అమ్మ దగ్గరికి వంట గదిలోకి వెళ్ళిపోయాడు కరుణ.

ఎప్పుడన్నా కరుణని ఏడిపించాలనుకుంటే మా పెద్దన్నయ్య రెండు బాణాలు ఉపయోగిస్తాడు ఒకటి— బస్సు రెండు చిన్నకోడలు బస్సు సంగతేమిటంటే ఓరోజు ఇద్దరూ బస్సులో వస్తున్నారట అంతలో ఓ పాప యెక్కిందంట కరుణ పక్కనే సీటుందంట ఆ అమ్మాయి చక్కా వచ్చి వాడి పక్కనే కూచొందొంట పెద్దన్నయ్య వాడి కళ్ళలోకి చూశాడుట దాంతో కరుణకి సిగ్గేసి లేచి నుంచొన్నాడట ఆ సంగతి పెద్దన్నయ్య భోంచేస్తున్న సమయంలో చెప్పాడు తింటున్న వాడల్లా తినడం మానేసి ఏడవడం మొదలెట్టాడు వెధవాయి అసలే వాడిని పెద్ద గుండ్రని కళ్ళు. ఆ కళ్ళల్లోకి దుఃఖం చేరితే అమ్మ భరించలేదు పెద్దన్నయ్యని గట్టిగా తిట్టింది 'సౌందర్య గురించినీలాకాదు' అంది

మా పెద్దన్నయ్య కథలు రాస్తాడు వాడి కథలన్నిటిలోనూ సౌందర్య వుంటుంది ఆ కథకూ సౌందర్యకూ సంబంధం లేకపోయినా ఎరే అంచేత మేము 'పెద్దన్నయ్యా! యీసారి నీ కథలో సౌందర్య అవతారమేమిట్రా' అనడం కద్దు

కరుణ మరీ అల్లరి పనులు చేయడం ఆరంభిస్తే పెద్దన్నయ్య మెల్లగా అమ్మ దగ్గరికెళ్ళి, 'అమ్మా యీరోజు మన సీతారామయ్య గారింట్లో ఓ అమ్మాయిని చూశానూ మన చిన్నకోడలయితే'' కరుణకి వినిపించేట్టు చెపుతాడు దాంతో కరుణ అల్లరి తగ్గినన్నా తగ్గుతుంది లేదా హెచ్చినన్నా హెచ్చుతుంది.

'శాడీవాడికి ఆ మాటల కంటే యింకేం తెల్సు?' అని కళ్ళల్లో కోపం ప్రకటిస్తాడు.

మూడోరోజున ఆ లెక్చరర్ గారమ్మాయి చంకన పుస్తకాల సంచి వేలాడేసుకొని, గేటు దగ్గర నుంచోని 'కరుణా, కరుణా' అని పిలుస్తోంది. కరుణ అమ్మ దగ్గర వంటగదిలో వున్నాడు పాలు తీసుకుంటున్నాడల్లే వుంది ఇదే మంచి అదననుకుని

'రా పాపా' అని పిలిచి, 'లోపలున్నాడు' అని చెప్పాను

పాప వరండాలోకి వచ్చి నుంచొంది

'నీ పేరు?'

'కమల'

'ఏ క్లాసు?'

'ఆరు' అని 'మా కరుణా నేనూ ఒకే క్లాసు' యింకా స్పష్టంగా వుండాలని చెప్పింది.

గొంతు ఖంగుమంటోంది

'ఇంతకు పూర్వం మీ నాన్నగారెక్కడుండేవారు?'

'ఇక్కడేనండి'

'మరి నువ్వో?'

'మా పిన్ని దగ్గరుండేదాన్నండి' అంది

'సరే, లోపలికెళ్ళి పిలువ్ పాపా' అన్నాను

నా రెండో ఒడ అల్లుకుంటున్నాను ఒకసారి అద్దం ముందుకు—

వాళ్ళబడి ఎనిమిదికే అంచేత తొందరగా తెమ్లారే తయారవాలి

కమల పావురంలా లోపలికెళ్ళి 'కరుణా' అని పిలిచింది ఏం జరుగుతుందో చూడాలనిపించి మెల్లగా నేనూ వెళ్ళాను కరుణ ముఖం చూద్దును గదా తెల్లవోయింది పెద్దన్నయ్య బాత్‌రూం నించి ఇప్పుడే వస్తున్నాడు ఒక క్షణంపాటు చూసి –

'నీ పేరేమిటి పాపా?'

చెప్పింది

అయితే కమలా ఒకమాట చెపుతా విను రోజూ నువ్వూ కరుణా కలిసి బడికి పోతూండండి, మా కరుణకు ఒంటరిగా పోవడం భయం అందుకే నీతో చెపుతున్నా 'అన్నాడు.

పెద్దన్నయ్య మాటలకి కరుణలో అసహన భావం రేగింది కరుణ నోరెత్తలేదు ఎదురుగా ఆ అమ్మాయి వుంది అందుకు

'అట్లాగేనండి' అని పెద్దన్నయ్య సలహా స్వీకరించి, 'కరుణా రా వేళవుతోంది' అని పిలిచింది ఆ పిలుపు వెనక ఏ భావాలూ లేవు ఏ సందేహాలూ లేవు వీణ మీటితే పలికిన రాగాలు. అంతే కొత్తవాళ్ళతో మాటాడాలంటే నాకు ఎన్ని ఆలోచనలు ముసురుకొస్తాయని!

కరుణ మారుమాటాడకుండా వెళ్ళిపోయాడు బడికి కమలతోపాటు

సాయంత్రం కాలేజీ నించి తిరిగి వచ్చేసరికి ఇంట్లో చిన్న ఎత్తున యుద్ధం జరుగుతోంది ఈ ఉదయం ఫార్సంతా రజనితో చెప్పా అది నవ్వుతోంది. ఆ నవ్వులతోనే వంట గదివేపు వెళ్ళాం.

'ఆ శాడీవా డెందుకట్లా అనాలి?' హుంకరిస్తున్నాడు కరుణ అమ్మ, 'వాడు రానీరా వాడికి పెట్టాల్సిన గడ్డి పెడతాను. వెధవాయ్‌కి నీడి పూసెందుకో?' అని పెద్దన్నయ్యని నిజంగానే తిటుతోంది

అంతలో చిన్నన్నయ్య వచ్చాడు వీడ తామరాకు మీద నీటిబొట్టు. మూడో యేడు మెడిసన్ చదువుతున్నాడు. వాడి స్నేహితులు, వాడి చదువులు వాడి గొడవేదో నాడిది తప్ప మా జోలికి రాడు. 'అచ్చం వాళ్ళ నాన్న పోలికే' అంటోంది అమ్మ చిన్నన్నయ్య వచ్చి తనే యింత టిఫిన్ గబగబా ప్లేట్లో పెట్టేసుకుని కూచున్నాడు తినటానికి అమ్మ స్టౌ మీద అన్నం దించేసి పాలు పెట్టింది పెద్దన్నయ్య నోటిని అదుపులో పెట్టనందుకు ఇంతసేపూ కరుణ అమ్మ మీద యుద్ధం ప్రకటిస్తున్నాడు వాడి ముందు పెట్టిన టిఫిన్ చల్లారి అట్లానే వుంది 'ముందు తిని మాటాడరా' అని అమ్మ బతిమాలుతున్నా వాడు వినిపించుకోవడం లేదు

'వాడు నిన్నేమనాకుండ చూస్తాలేరా తిన్నా' అంది వాడు మొండికేసి కూచున్నాడేగాని తిన్లేదు ఆఖరికి అమ్మ ఎంతో ప్రాధేయపడితేనే గాని తినలేదు వాడు. రాత్రి పదిగంటల సమయంలో పెద్దన్నయ్య వచ్చాడు వాడిని అమ్మ తిట్టింది

'నేనేమన్నానమ్మా? నన్ను తిడుతున్నావ్ రోజూ బడికి కలిసిపోతూండన్నాను అదేం రేప్పొద్దున్న అంటాను కూడా తనో చెప్పు?' అని పెద్దన్నయ్య అంతటితో ఆగక 'సర్లే, వెధవా నీ గురించి కథ రాయబోతానా?' అని భయపెట్టి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు

ఆ మరుసటి దినం కమల వచ్చింది బడి వేళకి కమల రాకముందే కరుణ వెళ్ళిపోయాడు బడికి

'వచ్చేటప్పుడు కలిసి రండి' అన్నాను మూడోరోజు సాయంత్రం

కమల అమ్మగారు వచ్చారు వస్తూ వస్తూ ఆమె అమ్మని 'వదినగారూ' అని పిలిచారు దాంతో మాకు అల్లరి చేయ

దానికి కావలసినంత అవకాశం దొరికింది. ఆమె వచ్చేసరికి ఇంట్లో అంతా వున్నాం. (మా మోహన్ బెజవాడలో వున్నాడులెండి)

అమ్మ మాఅందరినీ పరిచయం చేస్తూ —

'మా పెద్దబ్బాయి వాడు కథలు వ్రాస్తాడు. అన్ని పత్రికల్లోనూ పడుతుంటాయి. మీరు చూసే వుంటారు.

'వాడు రెండోవాడు. మెడిసిన్ మూడో యేడు చదువుతున్నాడు. మూడోవాడు వాళ్ళ పిన్ని దగ్గరున్నాడు బెజవాడలో. వాడు తొమ్మిది. వారం పదిరోజుల్లో వచ్చేస్తాడు. మా వనజ పియూసీలో యీ యేడే చేరింది. వీడు చిన్నవాడు. మీకు తెలుసుకుంటాను. కమల చెప్పే వుంటుంది' అంది దగ్గరున్న కరుణని తట్టి చూపుతూ.

అమ్మని విడిపించుకుని కరుణ మెల్లగా నాన్నగారి గదిలోకి వెళ్ళిపోయ్యాడు. నాన్నగారు పరీక్ష పేపర్లు దిద్దుకుంటున్నారు. కరుణ పక్కనే కూచొని వీక్లీలోని బొమ్మలు చూసుకుంటున్నాడు.

'అల్లుడా, రావోయ్ రా' అని అత్తయ్యగారు పిలిచారు.

'రారా అత్తయ్యగారు పిలుస్తున్నారు.' అని అమ్మ బతిమాలుతోంది.

అత్తయ్యగారు 'అల్లుడా' అని పిలవడంతో ఒకసారి కరుణ మొఖం చూశాం.

మనిషికి అవసరమున్న మరొకటి

వాడి చూపులు వాలిపోయాయి బలహీనంగా. దాంతో అమ్మ పిలుపు కూడా పట్టించుకోలేదు వాడు. అట్లాగే కూచున్నాడు. కదల్లేదు అక్కడ్నుంచి.

'మా అల్లుడికి మరీ సిగ్గుయినట్టుంది'.

అమ్మ అంతలో కరుణని సమర్థించాలని 'వెధవకి ఎక్కడలేని సిగ్గు' అంది.

వెధవాయి సిగ్గు చూస్తే ముద్దొస్తుంది ఈ చేష్టలతో ఆడుకో బుద్ధి అవుతుంది. అందుకే నాన్నగారి గదికెళ్ళి 'రారా' అని చెయ్యి అందుకుని తీసుకురావాలని ప్రయత్నించాను. కాని మొండి కేశాడు. కదల్లా. ఇంకొంచెం పట్టుదల చూపి లాగితే ఏడిచేట్టున్నాడు. ఇంక లాభంలేదని నా ప్రయత్నంమాని నా మట్టుకు నేను బుద్ధిగా కూచున్నాను.

'మా అల్లుడు అలిగిపోయాడా' అని నావేపు చూసారు అత్తయ్యగారు. కరుణ వేపు చూసి 'ఏం కావాలో చెప్పు అల్లుడూ? అత్తయ్య మీద అంత కోపం చూపితే ఎట్లా?' అంది లాలనగా.

''అత్తయ్యగారి మీద కాకపోతే ఇంకెవరి మీద అలుక చూపిస్తాడండీ' అన్నాను. ఆమె కలుపుగోలు ధోరణికి అమ్మ సర్దుకోలేకపోతోంది. ఆమె 'ఏమిటో వింత మనుషులు' అని ఆదిలోనే గొణుక్కోకుండా ఉండాలని కల్పించుకున్నా న్నేను.

అత్తయ్యగారు సన్నగా పొడుగ్గా ఆరోగ్యంగా వున్నారు. చీరకట్టులో అందముంది. ఎంచుకున్న చీర రంగులో నాజూకుతనముంది. నుదుట బొట్టు పెద్దగా వుంది. కుంకుమ కాఫిపొడి రంగుది. సన్నని బంగారు గాజులున్నాయి.

కరుణ నాన్నగారి గదిలో వున్నా తప్పలేదని అక్కణ్ణుంచి తప్పుకోవాలని బయటికి పోబోతుండగా ఒక్కసారి అత్తయ్యగారు తన హాస్యధోరణంతా మారేసి 'నాయినా, కరుణా! ఇటురా' అని వయసుకు మించిన గంభీరతతో పిలిచారు.

కరుణ వచ్చాడు

'కలిసిపోదామని కమలంటే నువ్వు, ముందుగా బళ్ళోంచి వచ్చేశావట నిజమేనా?'

అత్తయ్యగారి కళ్ళల్లో సత్యమున్నట్టుంది అంచేతనే చూళ్ళేక తల దించుకున్నాడు. దోషి ఐనట్టుగా మొఖం చిన్నబోయింది.

'దానికీ వూరు కొత్త. ఆ బడి కొత్త, నువ్వు ఉన్నావ్ గదా అని పంపిస్తే నువ్వేమో విడిచిపెట్టి వెళ్ళిపోతున్నావాయె. రేపట్నుంచి బడికెళ్ళ నంటోంది— ఏం చేయమంటావో చెప్పు?'

దించిన మొఖం ఎత్తలేకపోతున్నాడు.


'రేపట్నుంచి కమలతో పాటే వెళ్ళడం, కమలతో పాటే రావడం. మరి మీరేం బాధ పడొద్దండీ' అన్నాను.

ఆ క్రింది చూపుల్తోనే నా వేపు కొర కొరా చూశాడు.

కాఫీ చేసి తెమ్మని అమ్మ కళ్ళతో చెప్పింది. దాంతో నేను వంట గదికి వెళ్ళిపోయాను. తిరిగి కాఫీతో వచ్చేసరికి కరుణ లేడక్కడ అమ్మతో అత్తయ్యగారు బంధుత్వాలూ, స్నేహితులూ మొదలయిన సంగతులేవో మాటాడుకుంటున్నారు ఆ సత్యవతీదేవి ఎవరో, ఆ ముకుందంగారి పెద్దమ్మాయి శకుంతల ఎవరో, ఆ కృష్ణమూర్తి ఎవరో నేనెరగను.

కరుణని ఎట్లా అమ్మ ఒప్పించిందో ఏమోగాని రెండో దినం కమల వచ్చేవరకు వాడు ఆగి వచ్చాకా కలిసి వెళ్ళాడు. ఇద్దరూ కలిసేవచ్చారు.

ఓ రోజు కమల బడినించి వచ్చేటప్పుడు పెద్దన్నయ్య ఆ పాపని మంచి మాటలతో



వంటగదికి తీసుకుపోయి పాలు కలిపిఇచ్చాడు తాగమని. అక్కడే కూచున్న కరుణ ముఖంలో భావాలు రంగులు మార్చుకున్నాయి. కమలని నేనో, అమ్మో తీసుకెళ్తే వాడంత బాధపడేవాడు కాదనుకుంటాను. పెద్దన్నయ్య తీసుకు వెళ్ళేసరికి తనని ఏడిపించటానికే అనిపించింది.

కమల చింతపువ్వుల పరికిణీ, జాకెట్టు తొడుక్కుంది. సన్నగా కొనలు సాచుతోన్న లతలా పెరిగింది. సన్నని చెంపకి చేరడేసి కళ్ళు. ఆ చూపుల్లో మనుషుల మీద నమ్మకమూ, ప్రేమా కనిపిస్తున్నాయి. చేతికందే సన్నని కంఠం. మనుషుల్లో తెల్లగా వుంటారంటారే ఆ తెలుపు ముక్కు చిన్నగా చూపులని గభాయిన లాక్కునేటంతటి అందంగా వుంది. అత్తయ్యగారు తన ప్రేమనంతటినీ చూపించి, కూతుర్ని ముస్తాబు చేసినట్టున్నారు. రెండు జెళ్ళు. కళ్ళకి కాటుక. నుదుట ఎర్రటి చిన్న బొట్టు గుండ్రంగా. ముద్దుగా చిన్న చెప్పులు. ఈ వర్ణనంతా కథ దిద్దిపెట్టినప్పుడు పెద్దన్నయ్య చేర్చాడు.

కొద్ది నిమిషాల తర్వాత అత్తయ్యగారు వచ్చి 'బాబ్జీ చెప్పాడు ఇక్కడుందని' అని అమ్మతో 'ఏం కూర చేస్తున్నా రొదినగారూ?' లాంటి ప్రశ్నల వేసి కూతుర్ని తీసుకుపోయారు.

'పాలూ, పళ్ళరసమూ టిఫిన్లూ పెట్టి కోడల్ని ఇప్పటినించే మంచి చేసుకుని మమ్మల్ని మరిపించేయా లనుకుంటున్నావా వదినా', అన్నారు అక్కడికి నాలుగయిదు దినాల తర్వాత వచ్చినపుడు.

'రేపొద్దున్న అత్తారింట్లో వుండాల్సిందేకాని, కన్నారింట్లో కలకాలం వుండిపోలేదు కదా. అందుకని ఇప్పట్నించి మంచి చేసుకోవాలనుకుంటున్నా నమ్మా' అంది అమ్మ.

ఆ రకంగా బంధుత్వం కంటె బలమైన తియ్యని స్నేహం ఏర్పడింది.

ఓ రోజు బెజవాడ నించి ఉత్తరం వచ్చింది. మోహన్‌ని కుక్క కరచేసిందట. హాస్పిటల్‌కి తీసుకెళ్ళి బాబాయిగారు ఇంజెక్షన్‌లు ఇప్పిస్తున్నారట ఆ కబుర్లు. ఆ ఉత్తరం చదివి బాధపడ్డాం. అమ్మకి వెళ్ళి మోహన్‌ని చూడాలనయితే వుందికాని వెళ్తేక్కడ తనని దూరం చేసింది అంటారోనని భయపడి ఊరుకుంది. ఆ నాలుగు రోజులు గడిచేసరికి పుష్పలత అయిందని ఉత్తరం వచ్చింది. దాంతో అమ్మ బయల్దేరాల్సి వచ్చింది.

అమ్మ వెళ్ళిపోయిన మరునాటి దినం అత్తయ్యగారు వచ్చి ఎల్లుండి కమల పుట్టినరోజు పండగ' అని చెప్పారు. కరుణనీ అందర్నీ ఆహ్వానించారు.

కమల పుట్టినరోజు పండక్కి నేను కాలేజీలో ఎస్సేరైటింగ్ కాంపిటీషన్ వుండి వెళ్ళలేకపోయాను. పెద్దన్నయ్య తన కొత్త కథని విశ్వనాథశాస్త్రిగారికి వినిపించాలని తెల్లారే వెళ్ళి సాయంత్రం మూడుకి గాని రాలేకపోయాడు. నాన్నగారికి అసలు ఈ సంగతి చెప్పనేలేదు నేను. ఒంటరిగా కరుణ ఒడికి వెళ్ళిపోయాడు.

కమల రాకముందే కరుణ ఒడికి వెళ్ళిపోవడం, కమల కంటె ముందుగానో ఆలస్యంగానో బయల్దేరి రావడం నేను పసిగట్టాను. వాడ్నడిగి కారణం తెలుసుకోలేకపోతున్నాను. ఈ మార్పు కాస్త పెద్దన్నయ్యతో చెప్పాను.

అత్తయ్యగారు అమ్మ ఎప్పుడొస్తుందని అడిగారే తప్పించి అంతగా రావడంలేదు. అమ్మ లేకపోవడం వలనే అత్తయ్యగారు రావడం లేదనుకున్నాను.

ఈ మార్పు ఎవరికీ అర్థంకాలేదు.

వెళ్ళిన వారందినాల తర్వాత అమ్మ తిరిగి వచ్చింది.

పోటీలో నెగ్గిన సంతోషం పంచుకోవటానికి రజని నాతోపాటువచ్చింది. కబుర్లు చెప్పుకుంటున్నాం.

'కరుణ అట్లా కూచున్నాడేం?' అంది రజని చెవులో మెల్లగా.

పడగ్గది మంచం మీద ఏదో కోల్పోయిన వాడిలాగ, చిగుళ్ళు కోసేసిన మొక్కలాగ కన్పించాడు. ఈ వాక్యం పెద్దన్నయ్య కలిపిందే.

వాడు అట్లా వుంటానికి కారణముంది. రాత్రి అమ్మతో చెప్పాడు. అమ్మ ఉదయం అంట్లు తోముతో చెప్పింది నాకు. రజనితో ఆ కారణం చెప్పడం నాకు ఇష్టంలేదు. నాకే అగౌరవంగా వుంది. అంచేత 'పెద్దన్నయ్యో, అమ్మో ఏదో అనుంటారు' అనేశాను.

మరికొన్ని దినాలు పోయింతర్వాత ఓరోజు రజనే అంది. 'చూశావా వనజా, బాబ్జీ వాళ్ళమ్మగారు ఎప్పుడూ ఇక్కడే (అత్తయ్యగారింట్లో) ఉంటున్నారు.' అని.

'అవును.'

అప్పుడు — ఇంక ఆపలేకపోయాను, 'చూడూ, కమల పుట్టినరోజు పండక్కి మేం వెళ్ళేదని అత్తయ్యగారి కోపం. మన ఇంటికి కమల వెళ్ళొద్దందట. ఆ రోజు నేను ఎట్లా వెళ్ళడం, రజనీ—నీకు తెలుసు గదా—నాకు ఎస్సేరైటింగ్ కాంపిటీషన్, అమ్మ బెజవాడ వెళ్ళింది. పెద్దన్నయ్యతో చెప్పాను. వాడేమో శాస్త్రిగారి దగ్గరుండిపోయాడు. అమ్మ లేకపోవడంతో వచ్చిందంతా.'

నాకు వెలితిగా వుంది. అత్తయ్యగారు వచ్చి కబుర్లు చెప్పడం, పరిహాసాలు చేయడం, ఎంతో చనువుగా మంచిచెడ్డలు చెప్పుకోవడం, బంధుత్వాలు కలుపుకోవడం, యివన్నీ ఒక్కసారి పోయాయన్న బాధతోపాటు అంత సన్నిహితంగా వుండేవాళ్ళు ఇప్పుడేమొచ్చి దూరదూరంగా వుంటున్నారని సహజంగా ఇరుగుపొరుగు అనుకుంటారు. వాళ్ళలోనో మాలోనో దోషం చూపిస్తారు. మొదట్లో ఈ పరిచయం కోసం తాపత్రయపడలేదు. అత్తయ్యగారే వచ్చారు. కమలే పిలిచింది వచ్చి. ఇప్పుడు—

అమ్మ 'పోనీయవే, ప్రతిదానికీ బెంగపెట్టుకుంటే బతికినట్టే. వాళ్ళ కిష్టముంది వచ్చారు. ఇప్పుడిష్టంలేదు రాలేదు. దానికో పెద్ద బాధెందుకు?' అని నన్ను సమాధానపరచాలని అనేసింది కాని లోలోన లోటుకు గురవుతోంది.

ఈ సంగతులేవీ రజనితో చెప్పదలచుకోలేదు. అవి చెప్పడం వలన మంచి కంటె చెడుఎక్కువ వుంది. నా ఆత్మాభిమానం దెబ్బతింటుంది నా తమ్ముడు ప్రైజు సంపాదించుకున్నాడన్నప్పుడు పొందిన సంతోషం వేరు. అది నేను ప్రకటించకుండా వుండలేను. నా తమ్ముడు ఫెలయ్యాడన్నది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా తప్పు.

పరే అత్తయ్యగారిని ఏమాకర్షించింది బాబ్జీలో? కరుణ కంటె తెలివైనవాడేం కాదు. క్లాసులో కరుణకున్న మంచిస్థానం కూడా బాబ్జీకి లేదు. కరుణ స్నేహాన్ని కోరి వచ్చాడు. వాడి స్నేహం కోల్పోయినందుకు వాళ్ళు బాధపడాలి కాని నేను కాదు. మా కరుణ చాలా గొప్పవాడు అవుతాడు. చాలా గొప్పవాడు అవుతాడు. నేనేకాదు వాడిని చూసిన వాళ్ళ టీచర్ శ్యాంగారు కూడా అదే చెప్పారు. ఎవరన్నా ఈ సంగతి చెప్పగలరు.

* * *





మనిషికి అవసరమున్న మరొకటి

వారం దినాలు గడిచాయి. కరుణ ఎప్పటి ఉత్సాహంతో ఉన్నాడు. కమల బాబ్జి కలిసే వస్తున్నారు. ఆటలకి పోతున్నారు కబుర్లు చెప్పుకుంటున్నారు. పెన్సు పోయిందనీ, పుస్తకాలు కావాలనీ, క్లాసులో ఎవరో కొట్టుకున్నారనీ, టీచర్ ఏదో తప్పు చెప్పాడనీ, హెడ్మాష్టరు నత్తిమాటలు ఇలా వుంటాయనీ, స్కూల్లో పూలమొక్కలుకు నీరు పోసింది ఎవరనీ—ఏవేవో—నాకు చాల ఇష్టంగా వుండే సంభాషణలు వింటున్నాను.

ఆ మధ్య—

ఒకరోజు అత్తయ్యగారు వచ్చి, 'సత్యనారాయణవ్రతం చేస్తున్నా నొదినగారూ కమల పుట్టిందినానికి లేకుండాపోయారు. ఇప్పుడు అలా వీల్లేదు' అని గతంలో అసలు ఏమీ జరగనట్టుగా చాలా తెలివిగా ఆహ్వానించి వెళ్లారు.

అమ్మ ఎప్పటి ధోరణిలోనే ప్రవర్తించింది.

మా అమ్మని చూస్తే నాకు నవ్వొస్తుంది. ఒత్తి పిచ్చిది. ఇతర్ల తాలూకు ఉద్దేశాలూ, ఊహలు తనకి పట్టవు. అర్థం చేసుకోదు. వాళ్ల ప్రయోజనాలూ, వాళ్ల గొప్పతనాలు ఏదో రకంగా వ్యక్తం చేసుకోవాలని చేసే ప్రయత్నాలేవీ గుర్తించలేదు.

ఎందుకు ఈ వివరణ ఇస్తున్నానంటే ఆ రోజు సత్యనారాయణవ్రతానికి వెళ్లినప్పుడు బాబ్జిఅమ్మ(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు గారి భార్య) గారూ, మరికొందరూ అత్తయ్యగారంటే వారు చూపుతున్న గౌరవాభిమానాలు, ప్రేమాదరణలు, ఆమె స్వల్పకాలంలో సంఘంలో సంపాదించుకున్న పలుకుబడి ప్రకటించే ప్రయత్నం జరిగింది. నిజానికి బాబ్జి అమ్మగారు ఒకసారి—బాబ్జి సాయంత్రం ఎనిమిదింటివరకూ రాలేదని తెలిసినప్పుడు—వచ్చి అమ్మతో పరిచయం చేసుకున్నదే. కాని ఆమెకి అమ్మతో పరిచయానికి, స్నేహానికీ ఆకర్షణలు ఏవీ కనిపించలేదు. అమ్మకి క్లబ్బులూ, మహిళా సమాజాలూ తెలీవు. జడ్జీల భార్యలతోనూ, లాయర్ల భార్యలతోనూ, ఆ పట్టణంలో వున్న 'దిసోకాల్డ్ సివిలైజడ్ ఎండ్ ఎడ్యుకేటెడ్ క్లాస్ పీపుల్స్'తో సంబంధాలు లేవు అమ్మకి. వాళ్ల విజ్ఞానం గురించి, వాళ్లు సంఘానికి చేస్తున్న అపారమైన సేవ గురించి తెలీదు అమ్మకి.

అసలు అత్తయ్యగారు చేసే వ్రతాలకీ, పండుగలకీ సామాజిక ప్రయోజనాలు ఎక్కువగా వుంటాయి. అదే రజని కూడా గుర్తించింది. అప్పుడు అనిపించింది. అత్తయ్యగారు మొదట్లో అంత దగ్గరై పోటానికీ, తర్వాత అంత పలకరించకుండా మరచి పోటానికీ, మళ్లీ అసలు ఏమీ జరగనట్టు అతి నిర్మలంగా ఉన్నట్టు వచ్చి పలకరించటానికీ అక్కడ అర్థం ఉంది.

ఓ రోజు వర్షం పడింది. ఆ వర్షంలో బడినించి వస్తున్న పిల్లలంతా పరుగు తీసుకుంటూ వచ్చారు. ఆ పరుగులో ఏదో ఆకు మీద జోడుతో వున్న కాలు జారి ప్రక్కనే వున్న లైట్ స్థంభానికి తల తగిలి కొద్దిలో సైడుకాలవలో పడిపోయే ప్రమాదం తప్పి కమల హాస్పిటల్‌లో గాయాలతో వుంది.

'ఓ సారి చూసి వద్దామమ్మా' అన్నాను అమ్మతో. ఎందుకో నాకు భయంగా వుంది. చిన్నపిల్ల. ముద్దు మాటలు. నచ్చే ప్రవర్తన. కమల గాయాలతో ఎలా వుందో చూడాలని బుద్ధిపుట్టింది. అమ్మని రమ్మన్నాను. సాయంత్రం విజిటింగ్ అవర్సులో వెళ్లేసరికి చిల్డ్రన్ వార్డులో కాలుని పైకి ఎత్తికట్టి చిన్నమంచం మీద కమలని పడుకోబెట్టారు. తల మీద గాయాలకి పెద్దకట్లున్నాయి.

తీసుకువెళ్లిన పళ్లు కమలకి వొలిచి పెట్టాను. కమల తింది. మాట్లాడింది. మరో వారందినాల తర్వాత వచ్చేయటానికి వీలుంటుందని అత్తయ్యగారు చెప్పారు. ఆమె కళ్లల్లో కాంతి చాలా మారింది.

అత్తయ్యగారు చెప్పిన విషయాల్లో చాలముఖ్యమైన విషయం ఏమిటంటే 'ఇన్‌స్పెక్టరుగారి భార్య(అంటే బాబ్జి తల్లి) మేజిస్ట్రేట్ గారి అబ్బాయి పుట్టినరోజు పండక్కి వాళ్ల అబ్బాయికి చాలా ఖరీదయిన వ్యూమాస్టర్ కొని ప్రజెంట్ చేసారట. అని చెప్పి యింకా ఏదో చెప్పబోయి ఆగిపోయారు. ఆ చెప్పబోయినదేదో ఆమె మీద నిందలాంటిది అయుండాలనిపించింది. లంచాల వలన వచ్చిన డబ్బేకదా, ఇచ్చే ప్రజెంట్‌కి ప్రతిఫలం కూడా వుండాలి కదా లాంటి మాట ఏదో ఆమె మనసులో మెదిలి చెప్పటానికి ధైర్యం చాలక ఊరుకున్నారామె. బాబ్జి తల్లి రాలేదని, మన షులంటే ఏమిటో కష్టాల్లో వున్నప్పుడే

తెలిసొస్తుందనీ ఆమె వివరించారు.

వచ్చేస్తున్నప్పుడు—

"వదినగారూ, రేపు మీరు వచ్చేటప్పుడు కరుణని కూడా తీసుకు రండి" అన్నారు.

కమల భాష అర్థం కానట్టుగానే చూసింది. ఇంకా బాధ తీవ్రత తగ్గలేదు.

వచ్చేస్తుంటే మాతో పాటు వార్డు దాకేంతవరకూ వచ్చారామె. ఆమె నడకలో ఇప్పుడు చురుకుదనం లేదు. ఆమె మాటల్లో ఇప్పుడు ఉత్సాహం లేదు. ఆమె చూపుల్లో ఇప్పుడు ఇతర్లని ఆకర్షించాలనే తపనలేదు. ఆమె గొంతులో వాగరికత లేదు.

ఓడిపోయానన్న దీనత్వమూ లేదు. దిగులూ లేదు.

అత్తయ్యగారిని చూస్తే నాకు జాలేసింది. సమాజంలో స్థానం సంపాదించుకోటానికి ఆమె చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయని ఆ నిమిషాన తెలిసినట్టుయింది.

'మరచిపోరు కదూ' అన్నారామె.

దేన్ని మరచిపోరు కదూ అన్నారామె? కరుణను రేపు తీసుకు రావడాన్ని మరిచిపోరు కదూ—అనికాదు. ప్రేమాభిమానాలని చూపడం, ఈ ఓదార్పు నివ్వడం, సమాజంలో నిజమైన బంధుత్వాన్ని కలిగివుండడం ముఖ్యంగా తన కుమార్తె ఆరోగ్యవంతురాలయి, కుంటిదిగా కాకుండా, జీవితంలో స్నేహానురాగాలు పెంచుకోవడం—అనిపించింది.

మేం వచ్చేస్తున్నప్పుడు లెక్చరర్‌గారు కనిపించి, పలకరింపు చూపు చూసి, తలదించుకుని తన భుజాన వేలాడుతోన్న ఫ్లాస్కుతో, తన చేతిలోని పళ్ళతో లోపలికి వెళ్ళిపోయారు.

ఆ రెండో దినం కరుణని తీసుకొని వెళ్ళినపుడు, కరుణని చూసి కమల చూపులు వికసించాయి.

'నాపూలమొక్కలకి ఎవరు నీరు పోస్తున్నారు?' అడిగింది కమల.

'వర్షాలు పడుతున్నాయి కదా ఎవ్వరూ నీరు పొయ్యడం లేదు.' అని చెప్పి 'రేపు మన క్లాసు పిల్లలంతా నిన్ను చూట్టానికి వస్తున్నా'రన్నాడు.

ఆ మాట విన్నప్పుడు, కమల ముఖంలోని కాంతి చూసి అత్తయ్యగారు ఎంత ఆనందించారో!


(ఈ కథని ఇలా ముగిస్తే పెద్దన్నయ్య బాగా లేదన్నాడు. అనవసరంగా పెంచినట్టుగా వుందన్నాడు. 'మేం వచ్చినప్పుడు లెక్చరర్‌గారు కనిపించి'—అన్న దగ్గర్నించి తీసేయ్యాలని తను ఎర్రగీతలు అడ్డంగా పెట్టాడు. ఇది కథగాదు. జీవితం. దీనికి ఆకర్షణీయమైన మలుపుని జీవితం నించి ఎన్నుకునే సామర్థ్యం నాకు లేకపోయింది. నువ్వే ముగింపు చెప్పకూడదురా—అంటే 'అట్లా చెప్పను. కథలు రాయడం చెపితే వచ్చేది కాదు. తనే తప్పులు చేసి, దిద్దుకుని ఇతర్ల అభిప్రాయాలూ, విమర్శలూ అర్థం చేసుకుని, కథలు చదివి అవి మంచివైతే ఎట్లా మంచివయ్యాయో, గొప్పవయితే ఎట్లా ఏ సంఘటనల వలన, ఏ పాత్రల వలన, ఏ ఇతివృత్తం వలన, ఏ శిల్పం వలన, ఏ రచనావిధానం వలన, ఏ భావాల కూర్పు వలన, ఏ మనస్తత్వ పరిశీలన వలన, ఏ సామాజిక శక్తుల ప్రభావం కనిపించి—అది—ఆకథ ఆకర్షించిందో—ఆరకంగా కథ సాధించిన ప్రయోజనమేమిటో—అర్థం చేసుకోవాలి. కథలు రాయడం స్వంతంగా నేర్చుకోవాలి. చెపితే, 'కథలు రాయడమెలా' అన్న పుస్తకాలు చదివితే రాదు' అన్నాడు. అవన్నీ తెలుసుకునే వరకూ, ఆ చిత్రికలన్నీ పెట్టి ప్రతిభావంతుడయిన శిల్పి చేసిన శిల్పం లాగ తయారయ్యే వరకు ఆగలేను కాబట్టి ఇది ఇలాగే వుంచేస్తున్నాను.) ●

రియాలిజం! (సినిమా నిజం) * * *



"డోపీ"కి వెళ్లొంచ్చి తర్వాత లావయ్యానంటున్నారు నిజమేనా? నాకేం కన్పించటం
నీకేం. నిక్షేపంగా ఉంది. 'కోతి' వేషానికి ఎట్లాసరి-పోయింది. అంత లావైపోతే
మామయ్యోవ్! విజయా 'పూతన'కి 'వేషం కూడా వేయించేదాం. ఒకే నటి రెండు పాత్రలు
మీరు "క్యారెక్టర్" యాక్టర్. ప్రభుబు మిమ్మల్ని 'విలన్' గా కూడా చూడా లనుకుంటున్నారు
పూతకి... వేషం
ఆహ్హా! పూతకి వేషం. నా జాతకానికి బాగా సరిపోయింది. వేషం వేసేవంటే బాగా పేరొస్తుంది
సరే! మా "కృష్ణ ప్రేమ" సినిమాలో 'పూతకి' వేషం వెయ్యడానికి నాకు అంగీకారమే.
ప్రఖ్యాత తార
గా వెండితెర దర్శనం
చూసావా! మామయ్యా ఎట్లా సర్దేశానో
బ్రిలియంట్ బోయ్!


కృష్ణా! భయపడక ఇటు రమ్మ!
నిజంగానే ఆవిడ్ని చూసి భయపడ్తున్నాడు
అమ్మా! నేనో వేషం వెయ్యనే!
అంటే నేను నిజంగా రాక్షసిలా ఉన్నానన్న మాట అందుకేనన్నా వేషం వెయ్యమంది!
మీరు కొంచెం శాంతంగా ఆలోచించండి. మీరు అట్లా వేరు. మీ నటన అంత సహజంగా ఉంది. మీలా ఎవరు నటించగలరు
భా! భా! ఏమి చేసినయ్యా దేముడా సినిమా మళ్లా సెకెన్సులూ కట్ చేసేద్దాం!
యస్ నా అభిప్రాయం అదే
ఇలా మోసం
పెదయ్యా! పూతనకి వేషం సినిమా మా ఉంచుదున్నారే!
ఏం మామయ్యా! కొత్త పిక్చరు ఎప్పుడు మొదలెడ్తాం?



ముద్దమందార

భూపతి

జరిగిన కథ

గోపాలపురం బదిలీ అయిన వాను జీవితంలో సింహాచలం ప్రవేశించి కొంతకాలం తర్వాత విధి తమ కలయికను బయటపెట్టబోతుందని తెల్సుకుని వానుని వూరువదలివెళ్లి పొమ్మంటుంది. తనకు ఉన్న ఒకేకోరికగా తన కొడుకును డాక్టర్ చదివించాల్సిందిగా కోరుతుంది. భాస్కరానికి వివాహం అయి కొన్ని సంవత్సరాలు గడుస్తాయి. రామాన్ని తన కప్పగించి రాధ ఈ లోకాన్ని విడుస్తుంది. వాను సుశీలకు వివాహం చేసుకుంటాడు. కానీ ఆమె కూడా తనకు దక్కకపోవడంతో రామాన్ని సుభద్రమ్మగారికిచ్చేసి తన మకాం నూజివీడు మార్చేస్తాడు.

10

నూజివీడు వెళ్లిన మూడోరోజు రాత్రి కలలోకి సింహాచలం వచ్చింది. ఆమె కన్నీరు విడుస్తోంది. కన్నీరు చిన్న కాలవయ్యింది. సెలయేరై, ఏరునై నదిగా తయారయి చివరికి మహాసముద్రం అయ్యింది. ఇంకా సింహాచలం ఏడుస్తూనే వుంది. ఆ కన్నీటి సముద్రంలో ఒక పసిపిల్లాడు కొట్టుకు పోతున్నాడు. సింహాచలం నాకేసి జాలిగా చూసి, "నన్ను రక్షించమని ఏనాడూ అన లేదు. నా కొడుకు నాకు మాత్రం కొడుకు కాదా. ప్రవాహంలో కొట్టుకుపోతుంటే చూస్తూ వూరుకుంటారా. మీ సుఖానికి, నేనెలాగూ బలి అయ్యాను. వాడిని తీయండి! తీయండి" అని ఏడ్చింది. నేను చంగున ప్రవాహంలోకి దూకి ఆ పసిపిల్లవాడిని తీసి, ఒడ్డుకు తెచ్చేశాను. ఆవేశంలో వున్న సింహాచలం నవ్వింది. "నాకు తెలుసు. మీరు వాడిని రక్షిస్తారని.వాడు మీకొడుకు. వాడు మీ కొడుకు" అంది.

వులిక్కిపడి లేచాను.

రాత్రి మూడున్నరయ్యింది. అంటే తెల్లారుజామన్న మాట. ఇక నిద్రపట్టలేదు. కలని మననం చేసుకుంటూ తెల్లవార్లూ గడిపాను.

తెల్లవారుతునే గోపాల్‌పూర్ వెళ్లాలని నిర్ణయించుకున్నాను. మేనేజరుతో చెప్పి, గోపాల్‌పూర్ చేరి, తిన్నగా రామనాథం గారింటికి వెళ్లాను. పోయినసారి వెళ్లి, వీధిలో సింహాచలం కోసం వెతికి వచ్చేసినట్టుగా కాక, యీసారి తిన్నగా వాళ్లిల్లు అడిగి వెళ్లాలని నిశ్చయించుకున్నాను.

మధ్యాహ్నం భోజనం చేసి, కాస్సేపులోకాభిరామాయణం ప్రశ్నలూ అవీ అయ్యాక నా జీవిత కథ వాళ్లకు చెప్పవలసిన భాగాలు చెప్పి, ఓ కునుకు తీసి, సాయంత్రం లేచి సింహాచలం యిల్లు కనుక్కోడానికి బయల్దేరాను.

తిన్నగా వూరిక పక్కగా వున్న పాకల వైపు వెళ్లాను. ఎవడో ఓ ఆగంతకుడెదురొచ్చి, "బాబూ మందీవూరేనా..ఓ అందమైన" అన్నాడు.

"ఛీ నోర్ముయ్" అనేసి ముందుకు నడిచాను. లోకంతో అరాజకం బహుముఖ

మయిపోయింది. నాలుగు పాకలు దాటి ఒక చోట పిల్లలాడుకుంటుంటే వాళ్ళ ద్వారా గుర్తు తెలుసుకుని, ఆ పాక చేరాను. పాక ముందు ఆనాడు నా యింట్లో ఆనాడు పని చేసిన మనిషి వుంది. నన్ను గుర్తు పట్టింది. "మీరా బాబూ, ఈ పాకలకు మీరు రావాలా, కాకితో కబురంపుతె నే నొసా" అంది.

"ఫరవాలేదులే. నీ కోసమే ఓ పనుండి వచ్చా" అన్నాను. వరాలమ్మ లోపలకు వెళ్ళి, ఓ చిన్న బల్ల తెచ్చి "కూకోండి బాబూ" అంది. కూర్చున్నాక, యోగక్షేమాలన్నీ అడిగింది. అన్నీ చెప్పాను, "మీ అక్క కులాసాయేనా" అనడిగాను. వరాలమ్మ తల వూపుతూ, ఇంకెక్కడి అక్క బాబు, చచ్చి పోయింది" అంది.

"మరి దాని కూతురు వాళ్ళూ" అన్నాను. నా ధైర్యానికి నాకే ఆశ్చర్యం వేసింది.

వరాలమ్మ వుస్సురుమంది.

"అదీ పోయింది బాబూ" అంది.

నేను కూర్చున్న కుర్చీ సీట విరిగినట్టయ్యింది. క్రిందపడబోయి నిభాయించుకుని కూర్చున్నాను. "జాగర్త బాబుగారూ, దిక్కుమాలిన పీట" అంది.

"ఫరవాలేదు" అన్నాను పూడిన కంఠంతో.

వరాలమ్మ కన్నీరు తుడుచుకుంటూ సింహాచలం ఎలా చనిపోయిందో చెప్ప నారంభించింది.

"ఎవడో ఒక వెధవ దాని జీవితం బండలు చేసిపోయాడు. అది మగపిల్లాణ్ణి కంది, మూడేళ్ళ వరకూ కళ్లల్లో ఒత్తులు వేసుకుని చూసింది. వాడు వస్తాడొస్తాడని సంబరపడుతూనే వుంది. దాని పిచ్చిగానీ, వచ్చేవాడయితే అసలు చెప్పా, చెయ్యకా పారిపోడం ఎందుకు? మనసులో దానికి నమ్మకం పోయాక, కొడుకుని వొళ్ళో పెట్టుకుని గంటలతరబడి ఏడ్చేది. చివరికి తిండి కూడా మానేసింది. వాడెవడో చెప్పమంటే ససేమిరా అనేది. పోయిన నాగుల చవితికి కొడుకు చేత పుట్టలో పాలు పోయించింది. అంతా అయ్యాక పుట్టలో ధడేల్న, చెయిపెట్టి నిండుప్రాణం తీసుకుంది. అంతే బాబూ. ఏ పాపం ఎరగని దాని చావుకు కారణమైనవాడికి దీనుసురు మంట తగలదా బాబూ, వాడూ, వాడి పెళ్ళాం పిల్లలూ మగ్గిపోరూ."

ఇది ఆమె చెప్పిన మాటల సారాంశం.

అప్పను. సింహాచలం వుసురు మంట

ముద్దమందార

నాకు, నా పెళ్లాం బిడ్డలకు తగిలింది.

వరాలమ్మ మళ్లీ ప్రారంభించింది.

"పిల్లాడికి మాత్రం రాజతే వొచ్చింది బాబూ. ఇస్కూల్లో జేర్చింది. ఫస్టొస్తున్నాడు. ఇస్కూలు పైనలు చదివించి డాక్టరు చేయించాలనేది. వాడికి ఎంగిలి కూడు పెట్టేదికాదు. ఒకవేళ ఏవో పెడితే వాడు తీసి ముట్టేవాడుకాదు. ఇంట్లో వుడకేసి పెట్టాలి...."

లక్షాధికారి కొడుక్కి ఎంత గతి పట్టిందో.

నా శరీరమంతా వణికింది.

"అబ్బా యెక్కడున్నాడు?" అన్నాను బొంగురుపోయిన కంఠంతో. "అలాగ పెరట్లో ఆడుకుంటుంటాడు బాబూ. ఆ మేళంతో వాడాడడు" అంది. ఎలాగయినా నా కొడుకుని నేను తీసుకుపోవాలి. లేకపోతే సింహాచలం ఆత్మఘోష నా జీవితాన్ని బలి తీసుకుంటుంది. "ఈ పాడువాళ్లో వుండడం ఎందుకు? మావూ రొచ్చెయ్యరాదూ. అక్కడ మా యింట్లో వుందుగాని నువ్వు...నాకా బోలెడు ఆస్తి వుంది." అన్నాను డబ్బు ఆశకయినా వస్తానంటుందేమోనని, కానీ, ఆమె వొప్పలేదు. నా బతుకంతా యీ గడ్డ మీదే బాబూ. ఇక్కడే పోతే నాకు ఓ సంతృప్తి" అంది. ఇంతలో పక్క పాకలోంచి ఎవరో పిలుస్తే వస్తున్నా" అని వెళ్లింది. లోపల్నించి నాలుగేళ్ల కుర్రాడు వచ్చాడు. అతన్ని చూడ్డంతోనే నా శరీరం విచిత్రానుభూతి పొందింది.

సింహాచలం కొడుకు. నా......

"బాబూ మాట" అన్నాను. అతను, దగ్గరకొచ్చాడు.

దొంగలా అటూ యిటూ చూసి, వాడిని అమాంతం ఎత్తుకుని, నా హృదయానికి హత్తుకున్నాను. బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించాను. బాబు హడలిపోయి, నాకేసి భయంగా చూశాడు.

మరింత గాఢంగా నా హృదయానికి హత్తుకున్నాను. ఆ సమయంలో నా హృదయానుభూతి వర్ణనాతీతం. ఇంతలో గుమ్మం వద్ద చప్పుడయ్యేసరికి గమ్మున అతన్ని దింపి, చొక్కా సర్దుకుని, పీట మీద కూర్చున్నాను. వరాలమ్మ గ్లాసుతో పాలు తీసుకువచ్చి "తాగండి బాబూ" అంది.

వచ్చే ముందామె చేతిలో వంద రూపాయిలు పెట్టి, "ఆరోగ్యం జాగ్రత్త" అని చెప్పి, బాబు చేతిలో మరో వంద పెట్టబోయాను. "ఛీ" అన్నాడతను.

"తీస్కోరా. తప్పు" అందామె.

"ఛీ, నాకొద్దు" అన్నాడతను.

"బబూ పెద్దవాళ్లిచ్చినది వద్దనకూడదు, తీస్కోమ్మ" అంటూ డబ్బు జేబులో పెట్టి, "నీ పేరేవిటి" అన్నాను.

"సింహాద్రి" అన్నాడతను. వరాలమ్మ పాల గ్లాసు తీసుకుని వెళ్లిపోగానే మళ్లీ సింహాద్రిని ఎత్తుకుని మళ్లీ తనివితీరా ముద్దు పెట్టుకున్నాను. "బాబూ, మా వూరు వస్తావా" అన్నాను. "అమ్మమ్మ చెపితే వస్తాను", అన్నాడు. మళ్లీ ముద్దు పెట్టుకుని, దింపేసి, కాస్సేపు వరాలమ్మతో మాట్లాడి రామనాథం గారింటికి వచ్చేశాను.

* * *

రాత్రంతా వూహించి ఓ పథకం వేశాను. ఆ పథకం ప్రకారం ఎలిమెంటరీ స్కూలుకు వెళ్లి, మేష్టారిని కలిసి, నేను ఒకటవ తరగతిలో వున్న పిల్లలకు యిద్దరికి స్కాలర్ షిప్పు యిస్తున్నట్టూ, వాళ్ళు ఎంత చదువు చదివినా నేనే చదివించేటట్టూ చెప్పి, 'నెలకి వంద రూపాయలు యిస్తాను' ఇద్దర్ని ఎంచుకోవాలి' అని చెప్పి క్లాసుకు వెళ్ళి, సింహాచలం కొడుకును, అనుమానం రాకుండా వుండడానికి మరో కుర్రాడిని ఏరి, "పిల్లల్ని పేర నెలనెలా వంద పంపుతాను." అన్నాను. మేష్టారు చాలా సంతోషించాడు. ఓ సంవత్సరానికి సరిపడే డబ్బు మేష్టారి పేర రాసి, ఆయనకు కొంత కలిపి చెక్కు రాసి, ఆయనకిచ్చి నూజివీడు చేరాను.

నూజివీడు వచ్చిన రాత్రి చాలా సంవత్సరాల తరువాత నిశ్చింతగా నిద్ర పట్టింది.

హాయిగా, సాఫీగా రెండేళ్లు గడిచాయి.

సింహాద్రిని పెంచుతున్న వరాలమ్మ చనిపోయినట్టూ, పోతూ పోతూ, "నా మనవణ్ణి ఆ స్కాలర్షిప్పిచ్చి నాయనకేయ్యొండి" అని తనను కోరినట్టూ మేష్టారు రాశారు.

నా ఆశయం తీరింది.

వాయువేగంతో గోపాలపురం వెళ్ళి సింహాద్రి వెంకటరమణను తీసుకుని, మద్రాసు చేరాను.

మద్రాసులో ఒక హోటల్లో మకాం చేసి, భాస్కరానికి ఫోను చేసి పిలిచి, నా గాథంతా పూసగుచ్చినట్టు చెప్పి, భాస్కరం రెండు చేతులూ పట్టుకుని, "భాస్కరం నా బాబుని నువ్వు పెంచాలి. వాడిని డాక్టరు చేయించాలని సింహాచలం కోర్కె. అది తీర్చాలి. లేకపోతే సింహాచలం వుసురు నన్ను

నాకు రామం గూడా దక్కడు" అన్నాడు. వాలో అణిగి వున్న దుఃఖం తన్నుకుని వచ్చేసింది. వెక్కివెక్కి ఏడ్చాను.

భాస్కరం ఆశ్చర్యం అణుచుకుని, గంభీరుడయ్యాడు. నా భుజం తడుతూ "ఛీ..ఏడవకలా. ధైర్యంగా వుండు. ఈ కర్తవ్యం నేను తీసుకుంటాను. ఈ రహస్యం నీకూ నాకూ తప్ప, చివరికి సుమతికి కూడా తెలీదు. తెలియనీయను" అన్నాడు.

నా గుండెమీంచి బరువు దింపినట్టయ్యింది. నిబ్బరంగా గాలి పీల్చాను.

* * *

గతం అంతా సర్వణం అయింది. ఇక మిగిలినది భవిష్యత్తు.

రామం డాక్టరయ్యాడు. రమణా డాక్టరయ్యాడు. నా కర్తవ్యంలో చాలాభాగం నెరవేరింది. ఇక. నేను బయట పెట్టాల్సిన రహస్యం.......

* * *

ఆరోజు పోస్టులో నాల్గు ఉత్తరాలు అయ్యాయి. భాస్కరం వుత్తరం పక్కకు పెట్టి, రామం వుత్తరం చదివాను. పరీక్షలు బాగా రాసినట్టూ రేపు బయల్దేరి వస్తున్నట్టూ రాశాడు. భాస్కరం వుత్తరం విప్పుతుంటే చేతులు వణికాయి.

సూర్యానికి వివాహం వేసంగుల్లో స్థిర పరచినట్టు రాశాడు. తరువాత రమణ విషయం రాశాడు.

రమణ బాధ చూసి జాలి వేస్తోంది. పిచ్చిపట్టిన వాడిలా తయారయ్యాడు. అవతల నువ్వు బాధపడుతున్నావు. ఇంకెందుకీ నాన్చుడు. ఆలస్యమయిన కొద్దీ కీడేగాని, మేలు జరగదు. ఏనాటికైనా యీ నాటకానికి నాందిపాడాలి కదా" అని రాశాడు.

అవును పాడాలి.

ఎలా పాడాలో ఎప్పుడు పాడాలో మాత్రం నిర్ణయిం కాలేదు. వుత్తరం మరోసారి చదువుకున్నాను.

* * *

వస్తాడనుకున్న రామం రానే వచ్చాడు.

నూజివీడులోనే రమణ చేత, రామం చేతా ఒక హాస్పిటలు పెట్టించాలి. వాళ్లిద్దరూ రామలక్ష్మణుల్లాగ సఖ్యతగా వుండాలి. ఆడవాళ్ల వార్డుకి సింహాచలం పేరు పెట్టాలి.

ఇవి తీరని కోర్కెలేమో!!

"పరీక్షలు బాగా రాశావా! బాగా చిక్కిపోయావేమిటి? డాక్టరు చదివినవాడివి నువ్వే చిక్కిపోతే ఎలా? ఇతరుల ఆరోగ్యాలు చూసే డాక్టర్లు ఆరోగ్యంగా వుండద్దా" అన్నాను.

రామం హాయిగా నవ్వాడు.

రామం నవ్వులో రాధ కనుపించింది. రామం ముమ్మూర్తులా రాధ పోలిక......

రమణ? ముమ్మూర్తులా నా పోలికే.. కళ్లు మాత్రం సింహాచలానివి. ఎంతటి వాళ్లనయినా ఆకట్టుకునే ఆ కళ్లు. రామం నా కొడుకే అయినా, మా యిద్దరి లోనూ కలవలేని అఘాతం వుంది. పరాయి చోట పెరగడం వల్లనేనంటే చనువు కన్నా భయమే ఎక్కువ.

నాకు ఒకవిధంగా అదే మంచిదనిపించింది. రామం నాకు సన్నిహితుడయితే... తెలియకూడనివి తనంతట తనే తెలుసుకుంటే...జరగకూడనివి జరిగినా జరగచ్చు.

నా పిరికితనం నాతో పాటు ముదిరింది. పిరికివాడు వేయిసార్లు చస్తాడు అయినా చావడు. చస్తూనే వుంటాడు అని సామెత వుంది. కొన్ని కొన్ని సామెతలు కొందర్ని చూసి పుట్టిస్తారు. కొన్ని సామెతలు కొందరి కోసం పుడ్తాయి.

* * *

రోజులు ఎవరి కోసమూ ఆగవు. కొన్ని రోజులు దొర్లాయి.

రాధ కల్లోకి వచ్చి రామం బాగును గురించి అడిగినట్టు కల వచ్చింది. తెల్లవారుతునే రామాన్ని పిలిచి, "నీతో ఒక విషయం మాట్లాడాలి కూర్చో" అన్నాను. రామం సందేహిస్తూ కూర్చున్నాడు.

"నువ్వు డాక్టరువయితే నీ చేత యీ వూళ్లో ఒక హాస్పిటలు పెట్టించాలనుకున్నాను. ఈ నాడు నువ్వు డాక్టరయ్యావు. ఈ వూళ్లో హాస్పిటలు పెట్టడం నీకు సమ్మతమైతే స్థలం ఎంచుకో అది కొని, అక్కడ కట్టిద్దాం. ఇష్టం లేకపోతే నీ అభిప్రాయం చెప్పు" అన్నాను.

రామం నే చెప్పినదంతా విని, తలూపుతూ, "నాకేమీ అభ్యంతరం లేదండి" అన్నాడు. నా మనస్సు కుదుటపడింది. మళ్లీ ప్రారంభించాను.


"ఇక రెండో విషయం—అది నీ పెళ్లి గురించి. నీకు పెళ్లి చేయాల్సిన బాధ్యత నాకటి వుంది. ఎప్పుడు చేసుకుంటావో చెప్పాలి. ఒకటిరెండు రోజుల్లో నీ అభిప్రాయాన్ని చెప్పచ్చు. అంతే." అన్నాను కుర్చీలో వెనక్కు వాలుతూ. పెళ్లి సంగతి మాట్లాడినప్పుడు రామం ఎందుకో ఖంగారు పడ్డాడు.

"అలాగేనండి" అనేసి వెళ్లిపోయాడు.

సిగరెట్టు ముట్టించాను. రామం కూడా ఒకవేళ సూర్యంలా ఎవరినైనా, ప్రేమిస్తే! ఏమో ప్రేమించినా ప్రేమించి వుండచ్చు. రాముడు కనుక ఎవరినైనా ప్రేమిస్తే ఏమీ ఆలోచించకుండా నా అంగీకారాన్ని తెలియజేస్తాను. ఒకవేళ రామం నాలాగ తన ప్రేమ సంగతి నాకు తెలియ జేయలేకపోతే!!

నేనే రేపు అతన్ని పిలిచి అడుగుతాను, అనుకున్నాను. రామాన్ని నా జీవిత పంథాలో నడవనీయకూడదు అని తీర్మానించుకున్నాను.

ఆలోచిస్తూ పడుకునే సరికి కునుకు పట్టింది. లేచేసరికి టైము చాలాగయ్యింది. స్నానం చేసి, బట్టలు మార్చుకొని నా గదిలోకి వచ్చాను. జేబులు



మీద ఏదో వుత్తరం కనబడింది. తీసి చూశాను. అది రామం రాసినది.

రామం నాకుత్తరం రాయడమేమిటి? విప్పి చదివాను.

తనొకమ్మాయిని ప్రేమించినట్టు రాశాడు. ఆ పిల్లని తప్ప ఎవర్నీ చేసుకోనని రాశాడు. నాకు నవ్వొచ్చింది. వెంటనే రామాన్ని పిలిపించాను. ఒదిగి ఒదిగి భయంతో రామం వచ్చాడు. కూర్చో మన్నాక కూర్చున్నాడు. నా చేతిలో వుత్తరం అతని చేతిలో పెట్టి, "నువ్వు చేసిన పని చాలా మంచిదే. నీ పెళ్లి బాధ్యత నాకు తప్పించావు. కాని దేనికైనా ధైర్యంగా వుండడం నేర్చుకోవాలి. చీటీ మీద రాయడం, ఫోనులో చెప్పడం, ఎవరితోనో చెప్పించడం వంటివి చేయకూడదు." అన్నాను గంభీరంగా.

రామం సిగ్గుపడ్డాడు.

"ఎవరా అమ్మాయి? ఏం చదువుకుంది? వాళ్ళవాళ్ళు ఎవరు? వాళ్ళ నాన్నగారి కేం పని" అన్నాను. రామం నా ప్రశ్నలన్నిటికి సమాధానం చెప్పాడు.

"ప్రొఫెసర్ మోహన్ కూతురా. వాళ్ళావిడ పేరు ప్రేమ కదూ. నాకు స్నేహితులే

ముద్దమందార

వాళ్ళు. వెరిగుడ్. అయితే నేను వెళ్ళి నీ పెళ్లి విషయం ఖాయం చేస్తాను. ఎప్పో ఆమ్మాయిని నువ్వు ప్రేమించింది? సరేలే. ఇహ నువ్వు ఆసుపత్రి విషయం చూసుకో" అన్నాను. రామం పరమానందం పొంది కృతజ్ఞతాపూర్వకంగా నాకేసి చూసి, వెళ్ళిపోయాడు.

ఆసుపత్రి పని పూర్తయ్యేసరికి మూడు నెలలయ్యింది. కాని, రామం ఒక్కడి చేతా అందులో ప్రాక్టీసు పెట్టించడం నా కిష్టంలేదు. రమణ, రామం కలవాలి. అది ముందు జరగాలి.

రామం పెళ్లి విషయం ముందు చూసి, స్థిరపరచాలనిపించింది. రామంతో ఆ సంగతి చెప్పి, వైజాగ్ వెళ్ళాను. మోహన్, ప్రేమ నన్ను చూసి పరమానందపడ్డారు. "దైవ నిర్ణయం చూడండి. మనకి చుట్టరికం కూడా కలవబోతోంది" అంటూ అసలు సంగతి చెప్పాను. దంపతులు బ్రహ్మానందపడ్డారు.

తమ నలుగురు కూతుళ్ళనూ పరిచయం చేశారు. మొదటి యిద్దరికి పెళ్లిళ్లయ్యాయట. రామం ప్రేమించినమ్మాయి మూడో అమ్మాయి. పేరు విజయ. రామం ఎన్నిక మంచిదే అనిపించింది.

ఆ రాత్రంతా చిన్ననాటి ముచ్చటలతో కాలక్షేపం చేశాము. తెల్లారు ఝామున మూడింటికి కాస్త నిద్రపట్టింది. కాస్సేపటికి మెలకువ వచ్చింది.

గోపాల్‌పూర్‌లో నేను ప్రేమను చూసినపుడు ఆమె నవయౌవ్వని. ఇప్పుడు నవయౌవ్వనవతులైన నలుగురు కూతుళ్ళకు తల్లి. రామం మోహన్, ప్రేమలను గురించి చెప్పగానే నా మనోఫలకం మీద 'ఆనాటి ప్రేమా మోహనులే నిలచారు. అదే వయస్సుతో. కాని, యీవేళ నేను చూసినది కేవలం దానికి వ్యతిరేకం యౌవ్వనాన్ని కాలానికి బలిగా యిచ్చి, జీవితాశయాలను పిల్లల రూపేణా పెంచుకున్న వయస్సు...

సింహాచలాన్నీ, రాధనీ కూడా ముసలి రూపంతో ఊహించుకోబోయాను. కాని కుదరలేదు.

ఆలోచనలతో తెల్లవారింది. ఆరోజు వెళ్తానంటే మోహన్ వెళ్ళనివ్వలేదు. వాళ్ళ ఆఖరి కూతురు ఉషని చూసేసరికి నాలో ఒక వూహ తట్టింది. ఉషని రమణ కిచ్చి వివాహం చేస్తేనో—బ్రహ్మాండంగా వుంటుందనిపించింది.

"మరి ఒక సంగతి చెప్పాలి. ఒక చాకులాటి కుర్రాడున్నాడు. ఆస్తిలో ఏమీ తీసిపోడు. డాక్టరు చదివాడు. తల్లితండ్రి లేరు. నేనే తండ్రిని. అతనికి మన ఉషనిచ్చి చేయడానికి మీకేమైనా అభ్యంతరం వుంటుందా" అన్నాను.


"ఏమీలేదు. పైగా నిరభ్యంతరం కూడాను. అడక్కుండా ఆడపిల్లలకు సంబంధాలు తెస్తుంటే యీ రోజుల్లో అభ్యంతరం పెట్టేదెవరు" అన్నాడు మోహన్.

విజయ ఫోటో ఒకటి, ఉష ఫోటో ఒకటి తీసుకుని నూజివీడు చేరుకునేసరికి కొంపలంటుకున్నాయి.

నేను లేనిసమయంలో భాస్కరం నాకు రాసిన వుత్తరం రామం విప్పి చదివాడు. విప్పానని చెప్పాడు. చదివి వుంటాడని నమ్మాను. "ఏదైనా అర్జంటు వుత్తరమేమోనని విప్పాను" అన్నాడు వినమ్రుడై.

"సరే, నువ్వెళ్ళు" అని, రామం వెళ్ళిపోయాక వుత్తరం చదవ నారంభించాను.

(సశేషం)



మహానుభావుల చమత్కారాలు

వి. ఎస్. సుక్తాంకర్

హాస్యం కవుల, పండితుల చేతులలో సునిశితమయిన ఆయుధం. మహాత్ములు, ఋషులు కూడా హాస్యాన్ని ప్రయోగిస్తూ ఉంటారు కాని వారి హాస్యప్రయోగాలు కేవలం బుద్ధిని మాత్రమేకాక హృదయాన్నే కదిలించి వేస్తాయి. అంతేకాదు. వారి హాస్యం అనాలోచితంగా బయటపడుతూ ఉంటుంది. వారి ఆత్మ వికాసానికి నిదర్శనంగా ఉంటుంది. ఈ వ్యాసంలో కొందరు మహానుభావుల హాస్య ప్రవచనాలని గురించి రాస్తాను.

హెన్రీ డేవిడ్ థోరో అమెరికాలో బానిసత్వం నిర్మూలించాలని కృషి చేసిన వారిలో ఒకరు. 1845లో ఈ వ్యవస్థ పట్ల తన నిరసన తెలుపటానికని ఆయన పన్ను ఒకటి ప్రభుత్వానికి చెల్లించలేదు. అందుకని జైలులోకి వెళ్ళాడు. అతని మిత్రుడూ, గొప్ప తత్వవేత్త అయిన ఎమర్సన్ ఈ సంగతి విని చూడటానికి వచ్చాడు. "ఇదేమిటి హెన్రీ ఇక్కడున్నావు?" అని అడిగాడు.

"నువ్వు కూడా ఇక్కడెందుకు లేవో ముందు చెప్పు!" అని సమాధానం ఇచ్చాడు థోరో!. ఇది జరిగిన కొంతకాలం తర్వాత థోరో 'సివిల్ డిసొబిడియెన్స్' అనే పుస్తకం రాశాడు. ఈ గ్రంథమే గాంధిగారి సహాయ నిరాకరణోద్యమానికి ప్రాణం పోసిందని అందరూ ఒప్పుకుంటారు. "నువ్వు కూడా ఇక్కడెందుకు లేవో..." అనే మాటల ప్రభావం ఎంత గొప్పదో నేడు మనం గ్రహించగలము."

పైన చెప్పిన ఎమర్సన్ ఒకనాడు ఒక పార్టీ ఇచ్చాడు. ఆహ్వాన పత్రికలో ఇలా రాశాడు. "అయిదు నుంచి ఏభయి మధ్య వయసు పిల్లలంతా సాయంత్రం మా ఇంట్లోకి పార్టీకి రావాలని ప్రార్థిస్తున్నాను.'

"పిల్లల వలె నిర్మల హృదయులయిన వారే భగవంతుడి రాజ్యాన్ని ప్రవేశించగల" రని జీసస్ తన అనుచరులకి చెప్పనే చెప్పాడు కదా! ఈ భావాన్నే ఎమర్సన్ చమత్కారంగా ఇలా ప్రకటించాడు.

స్వామి రామతీర్థని గురించి వినని వారుండరు. 1895 లో లాహోర్‌లో వివేకానందస్వామి ఉపన్యసించినప్పుడు ఆయన ఇంకా సన్యాసాశ్రమం స్వీకరించలేదు. లాహోర్ కాలేజీలో ఉపన్యాసకుడుగా ఉంటూ గృహస్థ ధర్మాలని నిర్వహిస్తున్నాడు. వివేకానందుని ప్రసంగాలని విని ముగ్ధుడయిన ఈయన ఆయనని తన ఇంటికి ఒకసారి రావలసిందని అర్థించాడు. ఇంటికి వచ్చిన వివేకానందుడికి ఏదయినా కానుక ఇవ్వాలనుకున్నాడు. ఆయన ఒక పుస్తకం మాత్రం తీసుకుంటానన్నాడు. రామతీర్థ, ఇంత చిన్న వస్తువా, అని తన జేబు గడియారం ఇవ్వపోయాడు. "స్వామీజీ, మీరు ఈ గడియారం ధరిస్తేనే నాకు తృప్తి కలుగుతుంది!" అని దానిని వివేకానందుడి కోటుకి తగిలించటానికి ప్రయత్నించాడు.

వివేకానందుడు ఆ గడియారాన్ని రామతీర్థ చేతిలోనుంచి తీసుకుని, "అలాగే తమ్ముడూ, నీ కోరిక ప్రకారం నువ్వింత ప్రేమతో ఇచ్చిన గడియారాన్ని ధరిస్తాను!" అంటూ దానిని తిరిగి రామతీర్థ వక్షస్థలం మీదనే కోటుకి తగిలించేసి, "ఇదిగో దీనిని శాశ్వతంగా ఇక్కడ ధరిస్తాను." అన్నాడు... 1900 లో రామతీర్థ తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి సన్యాసాశ్రమం పుచ్చుకున్నాడు. రెండేళ్ల తర్వాత అమెరికాకి ప్రయాణమయ్యాడు. ఓడలో ఒక అమెరికన్ సహప్రయాణీకుడు ఈ కాషాయ వస్త్రధారిని చూసి కుతూహలంతో తనని తానే పరిచయం చేసుకున్నాడు. సంభాషణలలో రామతీర్థస్వామి వద్ద బహుకొద్ది ధనం ఉందని తెలుసుకున్నాడు.

"అయ్యా, ఇంత తక్కువ డబ్బుతో ప్రయాణం చేస్తున్నారే, అమెరికాలో మీకు సహాయం చేసే స్నేహితు లెవరయినా ఉన్నారా?" అని అడిగాడు.

"ఒకరున్నారు." అన్నాడు స్వాములవారు తడుముకోకుండా.

"ఎవరో చెప్తారా?"

"మీరే!"

"మీరే!" అనే ఈ ఒక్కమాటలో ఎంత హృదయనైర్మల్యం, ఆత్మ వికాసం దాగి ఉన్నాయి.


ఇంకో కథ చెప్తాను. రమణ మహర్షి శిష్యులలో ఒకాయన ఆయన మీద అరవంలో పాటలు రాస్తూ ఉండేవాడు. రోజు కొకటి చొప్పున రాసిన పాటని ప్రతిదినం శిష్యులందరూ కలిసి పాడేవారు. ఈ పాడుతున్నప్పుడు మహర్షి కూడా ఆనందంతో వింటూ ఉండటం జరిగేది. ఒకనాడు, శిష్యుడు రాసిన పాట చాలా బాగుండటంతో రమణ మహర్షే అందరితో కలిసి పాడటం ప్రారంభించాడు. మరెవరయినా ఈ పని చేస్తే 'తిక్క' అనుకుని ఉండవచ్చు కాని రమణ మహర్షి అంతటివాడు తనను పొగిడే పాటని పాడటమా అని ఇతర శిష్యులలో ఒకరు, "ఎవరి స్తుతిని వారే పాడుకొనటం నేనింతకు ముందు వినలేదు." అన్నాడు.

"రమణుడిని ఈ ఆరడుగులకి పరిమితం చెయ్యటండేనికి? రమణుడు సర్వాంతర్యామి కదా!" అన్నాడు మహర్షి.

1939 లో నేతాజీ సుభాస్ చంద్ర బోస్ గాంధిగారి నాయకత్వాన్ని ఎదిరించాడు. కొందరు బెంగాలీ మిత్రులు టాగూర్ వద్దకి వెళ్ళి నేతాజీని బలపరచవలసిందిగా కోరారు.

"ఇన్నేళ్ళుగా గాంధిజీ అనే శివుడి ఆలయంలో ఒక నందిని నేను. జీవితాంతం అలాగే ఉండిపోతాను!" అని వారికి చెప్పాడు విశ్వకవి.

మే 6, 1941 నాడు టాగూర్ 80 వ జన్మదినం. గాంధిగారు ఆయనకి తంతి పంపించారు. "నాలుగు ఇరవయిలు చాలవు అయిదుపూర్తి చెయ్యి. ప్రేమతో" అని....



ఆరగంట ఆగవలసిన సర్కార్ ఎక్స్‌ప్రెస్ పూర్తిగా ఒకగంట సేపు విజయవాడ స్టేషనులో ఆగి, తాపీగా ఒకటిన్నరకి బయల్దేరి వెడుతూంది. క్రిందటి రాత్రి నుంచీ స్లీపరుకోచిలో మద్రాసు నుంచి, ప్రయాణం చేస్తున్న శేఖరం 'అమ్మయ్యా' అనుకున్నాడు. అయినా రైలు ఐదు గంటలు లేటా? సింగరాయకొండ వద్ద ఏదో గూడ్సుబండి బోల్తా పడిందని నాలుగు గంటలు ఆలస్యమయింది కాక తరవాత. యింకో గంట చేర్చుకుంది యీమధ్యలో. మద్రాసులో యెక్కేటప్పుడు యెంత వుత్సాహంగా వుంది! ఆరోజే శేఖరు పెళ్లి కాకినాడలో జరుగబోతూంది. రాత్రి యేడు గంటలకు ముహూర్తం. ఆఫీసు పనిలో అన్నాళ్లూ నిమగ్నుడై సరిగ్గా ముహూర్తం రోజు చేరవచ్చు కదా అని కిందటి రాత్రి సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో యెక్కాడు. కానీ మూడున్నరకి కాకినాడ చేరవలసిన రైలు పన్నెండు గంటలప్పుడు యింకా గుంటూరులోనే యేడుస్తూంటే గాభరాపడి గార్డు వద్దకు పరుగెత్తుకుని వెళ్లి అడిగాడు. 'మాస్టారూ, కనీసం యేడు గంటలకైనా కాకినాడ చేరుతుందా?' అని.

'చెప్పలేం, మాస్టారూ. మధ్యలో ఒక గంట గెయిన్ చెయ్యొచ్చు. ఏడు గంటంకి కాకినాడ చేరుతుందనే నా నమ్మకం' అన్నాడు గార్డు. రాజకీయాల్లోంచి బ్రతుకలేక బయటపడి రైల్వే వుద్యోగం చేస్తున్న వాడి ధోరణిలో.

త్వరలోనే గుడివాడ వచ్చేసింది. 'మేము ఆంధ్రులం' అంటే 'మేమూ ఆంధ్రులమే' అన్నట్లుగా జనం కేకలు వేసుకొంటున్నారు. ఒకటే గోల. ఎక్కేవాళ్లూ, దిగేవాళ్లూ కింద పడేవాళ్లూ, టీ అమ్మేవాళ్లూ, సోడా తాగేవాళ్లూ, కిళ్లీ నములుతూ ప్లాటుఫారమంతా ఖరాబు చేసేవాళ్లూ వందలకొలది జనం. కాసేపట్లో కోలాహలం తగ్గింది. రైల్లోని పాత ప్రయాణీకులు ఆగంతకుల్ని కుశలప్రశ్నలు వేస్తున్నారు. రైలు గుడివాడ స్టేషను వదలి వెళ్తూంటే ఏదో జ్ఞాపకం వచ్చింది శేఖరానికి.

సుశీలను గుడివాడలోనేగా యిచ్చారు? ఆమెభర్త యెవరో సినిమా థియేటర్ ప్రొప్రయిటర్ అనీ, బాగా డబ్బున్నవాడనీ గిరి ఒకసారి చెప్పాడు. గిరి వాళ్ల వూరు గుడివాడ దగ్గరే. యూనివర్శిటీలో చదువుకునేటప్పుడే సుశీలంటే తనకు ప్రాణం అని గిరి

చెప్తూండేవాడు. "మీ ప్రేమ దేవదాసు పార్వతుల ప్రేమలాంటిదోయ్, కానీ యీ కేసులో పార్వతి అభిప్రాయం మాకు బొత్తిగా తెలీదు' అని గిరితో చెప్పేవాడు తను. చదువుపూర్తయాక ఒక సంవత్సరానికి విజయవాడలో కనిపించి గిరి చెప్పాడు— సుశీలకి పెళ్ళయిందనీ గుడివాడలో బాగా డబ్బున్నతనికి యిచ్చారనీ. ఆ అమ్మాయిని చేసుకున్న ఆరు నెల్లకే అతను యింకో పెళ్లి చేసుకున్నాడట! సుశీలకేం తక్కువనీ? చక్కటి విగ్రహం, మేలిమి బంగారు ఛాయ. ఎప్పుడూ గర్వంగా నవ్వుతూ వున్నట్లు కనిపించే పెద్దకళ్ళు. అందరితోనూ గలగలా నవ్వుతూ మాట్లాడేది. చాలా మంచి మార్కులు కూడా వచ్చేవి. అందరితో కలిసి చక్కగా మాట్లాడినా యెవరికీ అందనని చాటుతూన్నట్లుగా అనిపించేదామె ధోరణి. అందరికీ అందని మ్రానిపండు లాగా వుండే సుశీలను పొందిన ఆమె భర్త యింకొకర్ని పెళ్లి చేసుకున్నాడు. గిరి చెప్తూంటే నమ్మలేకపోయాడు శేఖరం. ఎప్పుడూ, కళ్లల్లో గర్వం తొంగిచూసే సుశీల యిప్పుడెలా వుంటుందో? ఊహించలేకపోయాడు శేఖరం.

పచ్చటి పొలాలు, కొబ్బరిచెట్లు, తాటి తోపులూ భారతావనికే అన్నపూర్ణ అయిన ఆంధ్రదేశం కన్నులపండువుగా వుంది. గోదావరి కాల్వల్లో పడవల్లు గాలి లేకపోటం వల్ల తెరచాపలు తిన్నగా నుంచున్నాయి. ఎటు వైపు పడవలు కదుల్తున్నాయో తెలీటంలేదు. భీమవరం వచ్చింది. సుజాతది భీమవరమే. యూనివర్శిటీలో చదువుతున్నప్పుడు ఎంతో అమాయకంగా కన్పించేది. ఎవరైనా పలకరిస్తేనే గాని మాట్లాడేది కాదు. చామన చాయ అయినా చక్కని కళ వుట్టిపడే ముఖం. చెవులకు రింగుల్నూ, సాధారణమైన దుస్తులూ. ఓ సారి హైదరాబాదులో కనిపించింది. ఎక్కడో క్లర్కుగా వుద్యోగం చేస్తున్నానని చెప్పింది. బెరుకుగా మాట్లాడింది. రెండు మాటలు మాట్లాడేటప్పటికి 'వస్తానండి' అని నమస్కారం చేసి వెళ్లిపోయింది. ఆమె ప్రవర్తనకు కొంచెం ఆశ్చర్యపడినా, 'ఆడపిల్లకి వాతో మాట్లాడే విశేషాలేముంటాయి' అని తనకు తాను సమాధానం చెప్పుకున్నాడు. తరువాత ఎ. జి. ఆఫీసులో పనిచేస్తున్న సోమసుందరం చెప్పాడు. సుజాత వాళ్ల వూళ్లోని ఒకబ్బాయితో లేచిపోయి హైదరాబాదు వచ్చేసిందని. ఆ అబ్బాయికి ఏదో ఆఫీసులో గుమాస్తా వుద్యోగం దొరికిందనీ, గడవటం కష్టమై తను కూడ వుద్యోగం చేస్తున్నదనీ. నమ్మలేకపోయాడు శేఖరం. 'నమ్ము, నమ్మకపో, నేను చెప్పిందల్లా అక్షరాలా నిజం. వాళ్లిద్దరూ యింతవరకూ పెళ్లి కూడా చేసుకోలేదు. కావలిస్తే వాళ్ల ఆఫీసులో పనిచేసే వాళ్లని అడుగు.' అన్నాడు సోమసుందరం. అంత మెత్తగా నెమ్మదిగా వుండే సుజాత యింత చేసిందంటే మరీ విచిత్రంగా తోచింది శేఖరానికి. సుజాత యిప్పుడెక్కడుందో? వాళ్లిద్దరూ పెళ్లి చేసుకున్నారో లేదో? ఆలోచనలో మునిగిపోయాడు శేఖరం.

రైలు వేగంగా పరుగెత్తి తణుకు చేరింది. ఇక్కడే చక్కెర ఫ్యాక్టరీలో ఆనందరావు పని చేస్తున్నాడు. కాలేజీ వదలిన మూడు నెల్లకే పెళ్లి చేసుకున్నాడు. బందరులో జరిగిన పెళ్లికి తను కూడా హాజరయ్యాడు. మంచి కట్నం, చక్కని అమ్మాయి. రతీమన్మథుల్లాగా వున్నారన్నారందరూ. ఆనందరావు అదృష్టానికి తను కూడా మురిసిపోయాడు శేఖరం. చదువు పూర్తయినవెంటనే మంచి వుద్యోగం. సలక్షణమైన అమ్మాయితో పెళ్లి. తనకు తెలిసిన అదృష్టవంతుల్లో ఒకడు ఆనందరావు అనుకున్నాడు. పెళ్లయ్యాక సంవత్సరానికి కాబోలు మదరాసులో కనిపించాడు ఆనందరావు. మనిషి మునపటి లాగా వుత్సాహంగా లేడు. బాగా చిక్కిపోయాడు. కంపెనీ పని మీద మద్రాసొచ్చాననీ చెప్పాడు. భార్యా, పిల్లలూ (అయివుంటే) కుశల మడిగాడు శేఖరం. ఆనందరావుకు నోటమాట రాలేదు. అతికష్టం మీద తరవాత చెప్పాడు. తన భార్య ఆత్మహత్య చేసుకున్నదని, కారణం తనకు బొత్తిగా తెలీదనీ. కాపురాని కెళ్లాక యెప్పుడూ యేదో దిగులుతో వుండేదట.. సరిగా మాట్లాడేది కాదట. ఇంత ఘోరం తలపెడుతుందని తనెప్పుడూ అనుకోలేదని తల బాదుకున్నాడు ఆనందరావు. మళ్లీ యెప్పుడూ కనిపించలేదు ఆనందరావు. పెళ్లి పత్రిక పంపించాడు తణుకు అడ్రసుకు. బహుశా రావచ్చు ననుకున్నాడు శేఖరం.

నిడదవోలు దాటేప్పటికి ఆరున్నరయింది. మనసు బాగా కలవర పడిపోతూంది. ఏడు గంటలకు ముహూర్తమయితే తొమ్మిది గంటలకు వెళ్తే యేంలాభం? అయినా ఒక్కరోజు ముందుగా బయల్దేరి వెళ్లాల్సింది. ఇప్పుడనుకుని యేం ప్రయోజనం? ఈ పెళ్లి తన కసలు యిష్టమేనా? ఈ ప్రశ్న అతనికి మొదటిసారిగా స్ఫురించింది. పెళ్లి చేసుకోమని తల్లిదండ్రులు బంధువులూ, కొందరు మిత్రులూ అంతా చేరి ఒకటే గోల! నీకేం, వుద్యోగం చేస్తున్నావు, లక్షణంగా పెళ్లి చేసుకోక?' అని ప్రతి ఒకరూ అడగటమే. ఇష్టం లేకుండానే అమ్మాయిని చూసి వచ్చాడు కాకినాడలో. తనకి నచ్చలేదని చెప్పినా, మంచి కుటుంబం అనీ, యిలాంటి సంబంధం మళ్లీ దొరకదనీ పట్టుబట్టారు తల్లీ, తండ్రీ. పోనీ చేసేసుకుంటే యీ గొడవంతా తప్పిపోతుంది. మళ్లీ యిలా అడగరుగా అని ఒప్పేసుకున్నాడు. కాని పెళ్లి కోసం సెలవు తీసుకోటం తన కిష్టంలేదనీ, ఆదివారం రోజు వచ్చేట్లుగా ముహూర్తం యేర్పాటు చేయాల్సిందనీ తండ్రితో వాదించి యెలాగైతేనేం వప్పించాడు. శనివారం రాత్రి మద్రాసులో రైలెక్కి సరిగ్గా ముహూర్తం వేళకు చేరుకోవాలని ప్రయాణం కట్టాడు.

తొమ్మిది గంటలకి కకినాడ చేరితే తన కోసం ముహూర్తం నిలుస్తుందా యేమిటి? సరిగ్గా శాస్త్ర ప్రకారం ముహూర్తానికి చేసుకున్న పెళ్లిళ్లే అలా యేడుస్తూంటే, తను రెండుగంటలు ఆలస్యంగా వెళ్లి చేసుకుంటే యెంతమాత్రం అపేక్షించగలదు? (తన) పెళ్లికూతురు జ్ఞాపకం వచ్చింది. అందంలోనూ, చదువులోనూ సుశీల, సుజాతల కన్నా తక్కువే. ఆనందరావు భార్యతో పోల్చటానికే వీలుకాదు. పాపం యెన్ని కలలు కంటుందో తనను గురించి, భవిష్యత్తును గురించి. అయినా యెందుకు కలలు కనాలి? పెళ్లి చేసుకోటం మంచికే అని యెందు కనుకోవాలి? సుశీల, ఆనందరావుల జీవితాలు యేమయ్యాయి? తనెంత మంది జీవితాలు మంట కలవడం చూడలేదు? వినలేదు? చీకాకు పడుతున్నాడు శేఖరం. రైలు గోదావరి వంతెన పైకి వచ్చేసింది. రైల్లో ఒకాయన ఎదుటివాడికి వరూధిని ప్రవరాఖ్యుల కథ అతిరసవత్తరంగా చెప్తున్నాడు. ఎదుటి బెంచీలో అందరూ ఊ కొడుతూ మధ్యలో

సర్కార్ ఎక్స్‌ప్రెస్

'బలే బలే' అంటున్నారు. మెచ్చుకుంటున్నారు.

గోదావరి స్టేషను. మళ్లీ గోల. ప్లాటుఫారం మీద పెద్ద పెద్ద అంగలు వేస్తూ గబగబా నడిచి పోతున్నాడు సుబ్బరాజు. చాలా రోజులకి కనిపించాడు. వీడెక్కడున్నాడో తెలియదు. తెలిసుంటే పెళ్లి పత్రిక పంపించి వుండేవాడు. కేకేసి పిలిచాడు శేఖరం. వేగంగా నడుస్తూ పెట్టె వద్దకు వచ్చాడు సుబ్బరాజు, 'ఏం గురూ, చాలారోజులకి దర్శనం. ఎక్కడికి ప్రయాణం?' అంటూ. తన పెళ్లి సంగతి చెప్దామనుకున్నాడు శేఖరం అయినా యింకేం పెళ్లి? ముహూర్తం కాస్తా దాటిపోయాక పెళ్లికి పిలవడమేమిటి?

'కాకినాడ దాకా, పూరికేనే' అన్నాడు.

సుబ్బరాజు యెప్పుడు మాట్లాడినా ఒకే విషయం మాట్లాడతాడు. ఇంకొక నిముషం ఆగితే రైలు వెళ్లిపోతుందనేమో' వెంటనే మొదలెట్టాడు.

'శాంత వచ్చింది'

'ఎప్పుడు?'

'ఒక వెలనుంచి యిక్కడే వుంటోంది.'

'..................'

'నిన్ను గురించి రెండుమూడు సార్లు అడిగింది మద్రాసులో వున్నారని చెప్పాను. మళ్లీ యెప్పుడైనా వస్తారా అని అడిగితే తెలీదని చెప్పాను.'

'..................'

'నిన్ను చూస్తే చాలా సంతోషిస్తుంది. నన్ను చూసినప్పుడల్లా నువ్వే జ్ఞాపకం వస్తావుట కనిపిస్తే తప్పక రమ్మని చెప్పమంది.

'...... ......'

'చాలా మంచివారామెస్టారు అంటూంటుంది'

'వెళ్దాం పద' అని సూట్‌కేస్ పట్టుకుని గబుక్కున దిగి సుబ్బరాజుతో కలిసి స్టేషను బయటికి నడిచి వెళ్లాడు శేఖరం.

అయిదు గంటలు లేటయినా సర్కార్ ఎక్స్‌ప్రెస్ బరువుగా కదలి సాగిపోయింది గమ్యస్థానం వైపు ●

ఏకాంకిక రచనల పోటీ

జిల్లాలలో ప్రచారానికి ఉపయోగించే చిన్న ఏకాంకిక రచనల పోటీ ఒకదానిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధ శాఖ నిర్వహిస్తున్నది. ఆధునిక భారతీయ జీవితంలోని ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలను వ్యక్తం చేస్తూ, వర్తమాన జాతీయ ప్రయోజనాలను ప్రతిబింబింపజేసే విధంగా ఏకాంకిక ఉండాలి. ఇతివృత్తం సాధ్యమైనంతవరకు ఒకే ప్రధాన అంశానికి సంబంధించినదై ఉండాలి. ప్రచార లక్ష్యం పరోక్షంగా ఉండి ఆధునిక సాంఘిక నాటికల మాదిరి కళాత్మకంగా ఉండాలి.

1. నాటిక ప్రదర్శన సమయం ఒక గంటకు మించరాదు.
2. పోటీకి రచనను మూడు ప్రతులలో పంపాలి.
3. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎన్నికైన రచనలకు వరుసగా రూ. 500, రూ. 300, రూ. 200 లు ఇవ్వబడుతాయి. బహుమతి పొందిన నాటికలపై సర్వ హక్కులు ప్రభుత్వానికి చెందుతవి.

ఎంట్రీలు అందాల్సిన ఆఖరు తేది : 1966 అక్టోబరు 31 వ తేదీ.

పోటీకి సంబంధించిన అన్ని విషయాలలోను హైదరాబాదులోని సమాచార, పౌర సంబంధశాఖ డైరెక్టరుదే తుది నిర్ణయంగా ఉంటుంది. ఎంట్రీలను ఆయన హోదాపేర పంపాలి గాని ఆయన వ్యక్తిగతపేరున పంపరాదు.

టి. రామచంద్రరావు, డైరెక్టరు.



జరిగిన కథ

ఆమ్రపాలి అందచందాలను గురించి విన్న మగధరాజు బింబిసారుడు ఆమె నెలాగైనా తన దాన్ని చేసుకోవాలనే ఉద్దేశ్యంతో వంజయుడు, మరికొంతమందితో కలిసి వైశాలీ నగరంలో పుత్తలికల సూత్రధారుడుగా ప్రవేశిస్తాడు రేవా ఆదేశానుసారం పాలి భవనంలో ప్రవేశిస్తాడు పుత్తలికల సూత్రధారుని వేషంలో ఉన్న బింబిసారుడు. ఆ కిర్తకుడగు పుత్తలికల సూత్రధారునిపై పాలి దృష్టి పడుతుంది బింబిసారుడు నేర్పుతో ఆనందుడినీ, పాలినీ ఆపదనుంచి తప్పిస్తాడు

7

బింబిసారుడు పాలికి లోబడ్డాడు రణ చండీశౌర్య ప్రేరణల్ని అతడు నేడు స్వయంగా చూచి అనుభవించాడు. ఆమె కూర్చుండే తీరూ, చాపల్యం, చాతుర్యంతో కూడిన ధైర్యం, సంయమం ఇవన్నీ బింబిసారుణ్ణి విస్మితుణ్ణి చేశాయి పాలి తన హృదయం మీద అధికారాన్ని సాగించిందని తొలిసారిగా అతడు గుర్తించాడు ఇప్పుడు మళ్ళీ ఆవిడ్ని పొందే అవకాశంలేదు తిరిగి ఆమెను గ్రహించే శక్తి లేదు బింబిసారుడు ఓడిపోయాడు

పాలి ధనుర్బాణాల్ని ఒకవైపు వేసి సోదరుణ్ణి చూచింది ఆమె వెనుకటి లాగ కళ్ళల్లో కొంటెతనం తెచ్చి అంది 'సోదరా నీ వేమాత్రం సిగ్గుపడకు—నా ఉపకారాన్ని గుర్తించడానికి నీవు నీ సేవకార్యాన్ని నేడు చేయకూడదు మన ఇద్దరి ప్రాణాలని కాపాడిన ఆ గడ్డమూ, మీసములూ కల వ్యక్తికి కృతజ్ఞత చూపు' ఆనందుడు కళ్ళు చక్కగా తెరచి బింబిసారుడి వైపు చూచి ఆశ్చర్యంతో అడిగాడు "నీ వెక్కడున్నావా? నిన్న మొదట చూచినప్పుడే నీవు బొమ్మల్ని ఆడించే వాడివంటే నించినవాడవని నాకు శంక కలిగింది. ఇప్పుడు మా యింటికి వచ్చి విషయమంతా చెప్పాలి'

'నేను పరదేశిని.'

'నీకు మా దగ్గర ఉన్నంతవరకూ ఏ భయమూ లేదు.'

'నమ్మకంగా చెప్తున్నావా?' అని బింబిసారుడు క్రీగంట చూస్తూ 'నమ్మకం' అనే మాటని ఒత్తి అన్నాడు.

'లిచ్ఛవి అనే మాటే నమ్మకం.'

'విశ్వాసం యొక్క విలువని సరిగా కొలిచావా?'

'లిచ్ఛవీయులు శబ్దాల మూల్యాన్ని సరిగా ఎరుగుదురు. అందుచేతనే వాళ్ళు అధికంగా మాట్లాడరు.'

బింబిసారుడు క్షణంపాటు ఊరుకొని అన్నాడు 'కొంత విశ్రాంతి తీసికొని అంతా చెప్తాను. చెప్పనిదే ముక్తి లేదు.'

'ముక్తా?' అన్నా చెల్లెండ్రిద్దరూ అదిరిపడి అడిగారు

'అవును, నేను మారువేషంలో ఉన్నాను దీనికి కారణం కూడా విచిత్రమైందే' అని బింబిసారుడు గుర్రాల్ని కొరడాతో కొట్టి వాటిని పరుగెత్తించాడు అతడు ఇలా అన్నాడు—'నా నిజమైన వృత్తాంతాన్ని విన్న తరువాత మీ మనస్సుల్లో ఏ భావాలు నిశ్చితమవుతాయో వాని మీదనే నా జీవితం ఆధారపడి ఉంటుంది మీరు దాన్ని సరిగా గ్రహిస్తారో లేదో అని నా భయం'

పాలి ఈ నటుణ్ణి రెప్పవాల్చకుండా చూస్తోంది ఇతడెవరో గొప్ప గూఢచరుడని ఆమెకు సందేహముంది కాని ఆమె ఏమీ మాట్లాడలేదు మాట్లాడ్డానికి సమయమూ కాదు ప్రసంగం మార్చడానికి పాలి అతనితో అంది 'రథం ఇటు మళ్ళించు, నంద్రిగామం ఇటువైపు' కాని పాలి చెప్తూ ఆగిపోయింది రథం నంద్రిగామ పరిసరానికి వచ్చింది. పాలి ఆశ్చర్యపడింది. మేము నంద్రిగామం వెళ్ళడానికి బయలు దేరినట్టు ఈ అపరిచితుడైన పరదేశి కెలా తెలిసింది. పాలి మతిపోయి క్రీడాబొమ్మల వానివైపు చూస్తోంది గంభీరవదనంతో, 'నీకు మా యిల్లు చూపించడం కూడా అవసరంలేదేమో. రథం ఇక్కడ ఎందుచేత ఆపావు? ముందుకు పోనీ' అంది

'నిజంగా నేను మీ యిల్లు ఎరుగను. పగ్గం పట్టుకోండి ఇక మీ వంతు వచ్చింది' ఇలా అని అతడు కళ్ళెం వదిలాడు. పాలి నవ్వి దాన్ని తీసుకోడానికి చెయ్యి చాపింది.

* * *

ఆనందుని గాయం పెద్దది కాకున్నా కష్టంతో పాలి అతణ్ణి నిద్రవుచ్చి మహాలు వెలుపలికి వచ్చింది ఈలోపుగా ఆనందుణ్ణి చోరులు ముట్టడించారన్న వార్త విద్యుద్వేగంతో నంద్రిగామంలో వ్యాపించింది ఇంతే కాకుండా మహానాముని ఆ చిన్న ప్రాసాదానికి ముందు అసంఖ్యాకంగా గ్రామవాసులు గుమిగూడారు

'కుమారా, వనరాజు సింహం కూడా ఒకే వైపుకు చూచి పోయేటప్పుడు దెబ్బ తింటుంది. అటువంటప్పుడు మనుష్యులమైన మన మాట చెప్పేదేమిటి? నీ వీపు మీద గాయమవడం నాకు లజ్జాకరం' అని అభిరాముడు తియ్యగా ఎత్తిపొడిచాడు. తనకేమీ కానట్టు పైకి కనిపించడానికి ప్రయత్నించి కూడా ఆనందుడు కాని, పాలి కాని అస్వస్థులైతే మనస్సులో అతడెంత బాధపడతాడో ఆనందు డెరుగును. ఈ సంగతి ఎరగని వాడిలాగ ఆనందుడు, 'సోదరా, దోషమంతా యీ ప్రియమైన శిష్యురాలిదే' అన్నాడు

'పొరపాటు ఆమెదేకాని కాని దెబ్బతిను సందర్భంలో లిచ్ఛవీయుడైనా దోషం ఒక స్త్రీ మీద మోపకూడదు' బొమలు ముడిచి వృద్ధుడన్నాడు—

'నీ వెంట ఈ గడ్డంగల అతడెవరు?'

'క్రీడాబొమ్మల్ని ఆడించేవాడు'

'కాదు' అని వృద్ధుడు అలోచిస్తున్నాడు.

'అయితే ఎవడైనా గూఢచరుడా' అని శయ్య నుండి లేచి ఆనందు డడిగాడు

'ఊహూ' అని వృద్ధుడు ఆనందుణ్ణి నిద్రపుచ్చుతూ అన్నాడు.

పాలీ ఆనందుల వయోవృద్ధుడైన, గురువు అభిరాముడు ఆనందునికి శౌర్యోపచారం చేయుటతో నిమగ్నుడయ్యాడు. వైశాలిలో ప్రాప్యణ్యానికి అవశిష్ట సద్భా

మైన ఈ వృద్ధ బ్రాహ్మడు సంతానం లేనివాడు. వారణాసి యాత్ర చేసిన తరవాత, అనేకమంది ఇతర సాధువులతో కలిసిన తరవాత అతడీ చిన్న నందిగ్రామంలో ఏకాంత జీవనం గడపడానికి నిశ్చయించాడు. గ్రామానికి వెలపల ప్రాచీన యక్షమందిరానికి కొంతదూరంలోనే ఒక కుటీరంలో నివసించే వేదాంతి వానప్రస్థుడు అతని మిత్రుడు.

పాలీ ఆనందుల్ని అతడు తన సంతానం లాగ ప్రేమిస్తున్నాడు. బ్రాహ్మణ్యానికి సంబంధించిన ఉత్తమ సంస్కారాల్ని అతడు వాళ్లిద్దరిలో సంపూర్ణంగా కలిగించాడు. అతడు ఆ వేదాంతి మిత్రుని సాంగత్యంలో చాలావరకు నాస్తికుని వలె అయిపోయాడు. అతడు అనేక పర్యాయాలు ధర్మప్రచారం చేసేవాళ్లతో కలహించేవాడు. అయినా, వృద్ధుడైన అభిరాముణ్ణి నందిగ్రామంలోనే కాకుండా మగధ, కోసల, మల్ల మొదలైన అనేక బ్రాహ్మణాగ్రహారాలలోని ప్రజలు సమానంగా గౌరవించేవారు. భీష్మునిలా పొడ్డైన ధవళకుంతలుడైన విప్రుడు అభిరాముడు శస్త్రశాస్త్రాలలో భుజబలంలో, బుద్ధిబలంలో సమానమైన నైపుణ్యం కలవాడు.

'నీ ప్రాణాల్ని ఈ విధంగా ఏ గుప్తచరుడూ రక్షించలేడు. గృహాన్నుంచి పారిపోయి వచ్చిన కులీనుడి లాగ కన్పిస్తున్నావు.'

ఆనందుడు జవాబుగా కొంచెం చెప్ప కోరాడుకాని ఆకస్మికంగా ఆగిపోయాడు. ద్వారంలో పాలి ఆ బొమ్మలాటగాణ్ణి తీసుకొని వస్తోంది. ఎగుడుదిగుడు మార్గంలో ఎండు వేగముతో రథాన్ని పరుగెత్తించడం వల్ల చెట్లకూ, పొదలకూ రాచుకొని అతని వక్షమందూ భుజములందూ పెక్కు గాయాలయ్యాయి. అక్కడికి రాగానే పాలి, 'సోదరా, ఇటు కొంచెం చూచి ఉపచారం చెయ్యి' అంది.



సోదరుడు ఉలికిపడ్డాడు. వెనక్కి తిరిగి బొమ్మలాటగాణ్ణి చూచి మరింత ఉలికిపడ్డాడు. ఆనందుని ఒంటి మీద గాయమైన చోటనే బింబిసారుని దేహం మీద కూడా గాయం కన్పించింది. వృద్ధ అభిరాముడు బొమ్మలాటగాని వైపు రెప్పవాల్చకుండా చూడసాగాడు. మెల్లగా అతడు ముందుకి పోయి అతని సమక్షంలో చూడకుండానే చేతిని పరీక్షించసాగాడు. దక్షిణ హస్తాన్ని తిప్పగానే అరచేతి మీద దృష్టి పడింది. కల్పంలో నవారిన వనస్పతిని పట్టిస్తూ అతడన్నాడు—'అనతి కాలంలోనే పుట్టుకను వదలి మహారాజా కొలువు వస్తుంది' అభిరాముని మాటలు వినగానే పాలి, ఆనందుడూ విస్ఫారిత నేత్రాలతో అతనివైపు చూడసాగారు.

ఒక జాము తరువాత పాలి వ్యాకుల చెంది నిద్రపోవడానికి ప్రయత్నిస్తోంది. దూరంగా రెండవభాగంలో పరుండిన బింబి

సారుడూ అంతే ఉద్విగ్నుడయ్యాడు. అభిరాముడు మాత్రం నిశ్శబ్దంగా నిద్రపోతున్నాడు. అతని దగ్గరే అభిరాముడు పరున్నాడు. అతడు పాలిని బొమ్మలాటగాడిని ఒక్కసారిగా ఎదుట చూచిన తరువాత ఏదో అపూర్వమైన ఆలోచనలో మునిగి పోయాడు. జ్యోతిషుడు కూడా కదా మరి!

కాని, బింబిసారుడు జ్యోతిషుడుకాకున్నా అభిరాముడు ఏ వస్తువు కోసం భయసందేహాలతో పని చేస్తున్నాడో దాన్ని ప్రకటించే విషయం ఆలోచిస్తున్నాడు. ఈ విషయం సత్యం అగునో కాదో అని పాలి శంకిస్తోంది.

'మహారాజా' అని ఎవడో మెల్లగా అన్నాడు. బింబిసారుడు ఉలికిపడ్డాడు., చప్పుడు కాకుండా నడచి వచ్చి సంజయుడు అక్కడ ఎప్పుడు కూర్చున్నాడో తెలియదు. బింబిసారుడు మంద్రస్వరంతో ప్రశ్నించాడు— 'అందరూ కుశలంగా ఉన్నారా?'.....

అవునన్నట్లు సంజయుడు తలపంకించాడు. కాని అతని ముఖంలో ఒక విచిత్రమైన వ్యాకులత ఉంది. అతడు ఏదో విషయాన్ని కప్పిపుచ్చడానికి యత్నిస్తున్నట్లుంది. బింబిసారుడు ఈ విషయాన్ని గ్రహించాడు. 'ఏమి సంజయా' అని అతడడిగాడు.

'మహారాజా, కొంచెం మహలు వెలుపలికి రండి.'

బింబిసారుడు తక్షణం నిలబడి సంజ

ఆమ్రపాలి

యుణ్ణి వెంట బెట్టుకొని వెలుపల ఉన్న చిన్న ఉద్యానంలోకి వచ్చాడు.


సంజయుడు పరిసరాల్ని పరికించి చాలా మెల్లగా అన్నాడు— 'మహారాజా, మనం ఇక్కడ నుండి తొందరగా పోవాలి. కోసల, చేటక రాజుల సేనలు మగధకు పరిసర ప్రాంతం మీద ఆకస్మికంగా దండెత్తడానికి ప్రయత్నం చేస్తున్నాయి. గూఢచారి ఇక్కడికి సమాచారం తీసికొని వచ్చాడు. ఈ విషయం తెలిసికోడానికి మనం అక్కడికి పోవాలి.

బింబిసారుడు జవాబుగా నవ్వుతూ చెప్ప సాగాడు— 'సంజయా, నన్ను రాజభవనానికి (రాజధానికి) తీసికొనిపోడానికి మరో మంచి ఉపాయం వెదకవలసి ఉంది. ఈపాటి విషయం......'

'కాదు మహారాజా, విషయం పూర్తిగా నిజమైనదే.'

'ఇంతకంటె భయంకరమైన ఉపద్రవం జరిగినప్పుడు నన్నడగకుండానే నీవు ఒంటరిగానే ఎదుర్కొన్నావు. నేను యశం ఆర్జించాను. నేడు ఆ సంజయుడే......'

'మహారాజా, మేమంతా పోడానికి సిద్ధంగా ఉన్నాం. కాని, యిప్పుడిక్కడ ఉంచడానికి, ఒక్కడైనా అంగరక్షకుడు ఉండడు కాబట్టి.....'



'హా కంటకిపిటుకు గురించి చింతించకు, పో. మంగళం చేకూరును గాక!'

'మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తాను' అని సంజయుడు తలవంచి జవాబిచ్చాడు.

దూరంగా నిలబడ్డ బ్రహ్మదత్తుడు తను కూడా నిలబడ్డట్లు, కాని దగ్గరకు రాలేనట్లు దగ్గి సూచించాడు. బింబిసారుడు కూడా దగ్గి జవాబిచ్చాడు. సంజయుడు అందర్నీ తీసికొని అదృశ్యుడయ్యాడు.

బింబిసారుడు మెల్లగా ప్రాసాదం వైపుకు నడచాడు. సంజయుడి సమాచారం అతని హృదయం మీద ఎటువంటి విశేష ప్రభావం కలిగించలేదు. కోసల, చేటక రాజులు అతన్నెదుర్కోడానికి అసమర్థులని అతడు బాగా ఎరుగును. అయినా వాళ్ళ మనో వృత్తుల్ని తెలుసుకోవాలి. ఈ పనికి సంజయుడు చాలు.

శత్రువులు కాబోయే లిచ్ఛవీయుల గ్రామంలో అతడు ఒంటిగానే ఉన్నాడన్న భావం అతనికి ఎక్కువ మనశ్శాంతినీ ఉత్సాహాన్నీ కగిలించింది. తాను కోరిన వస్తువు లభ్యమైనట్లు అతని కనిపించింది.

పాలి నేడుఅతని మనస్సును జయించింది. రథంలో మాట్లాడుతున్న పాలి, మహలుకు వచ్చాక అతని రక్తస్రావాన్ని చూచి కలవరపడిన పాలి, వ్రణానికి ఔషధోపచారం చేసేటప్పుడు ఉచ్ఛ్వాసనిశ్వాసాలు స్పష్టంగా వినిపించేలాగ తనకు దగ్గరగా నిల్చున్న పాలి, ఎంత స్ఫూర్తితో అతని హృదయంలోనూ, మనస్సులోనూ పరుగిడుతోందో కదా. పాలి శయనాగారం వైపుకు పోయి పాలి మేల్కొని ఉన్నా, నిద్రపోతున్నా ఒక్కసారి ఆమెను చూచి రావాలనే వూహా పందల కొద్దీ సార్లు కలిగింది.

ఇప్పుడు అతనికి ఆ వూహాలే తోస్తున్నాయి. ఉద్యానంలోని శాంత వాతావరణం అతణ్ణి ప్రేరేపించ సాగింది. అతని కాళ్ళు వశం తప్పి పాలి శయనమందిరం వైపు నడచాయి. కాని కొన్ని అడుగులు వేసి ఆగిపోయాయి. క్రరతో చెంబబడ్డ ఒక అందమైన విశ్రామస్థానంలో పాలి ఒంటరిగా కూర్చుంది. గాలిలో ఎగురుతున్న ఆమె చపల వస్త్రం ఆమె శయనగృహం నుండి ఇప్పుడిప్పుడే వచ్చి కూర్చున్నదని స్పష్టంగా చెప్తోంది. ఆమె విశ్రాంతిలో కూర్చున్న విధం, ఆ అంగపరివేష్టనం, చెదరిన కురులూ ఆమె సౌందర్యానికి అపూర్వమైన శోభను కలిగిస్తున్నాయి. అతడు పాలిని నిర్ని

మోహనయనాలతో చూడసాగాడు. ముందుకు పోగడమో లేదో తెలియని అనిశ్చితావస్థలో అతడు కింకర్తవ్య విమూఢుడై అక్కడే నిలబడ్డాడు

రాత్రి వాసనలీనే పువ్వులు పగటిపూల వాసనని మరపింపడానికి సుగంధాన్ని వెద జల్లుతున్నాయి. బింబిసారుడు నిల్చున్న ప్రదేశాన్ని పాలి చూడలేకుండా ఉంది పాలి హృదయంలో ఒక అణచరాని తుఫాను చెల రేగుతోంది. బింబిసారుడి కది అనుభూత పౌతోంది. బింబిసారుని హృదయం ఉప్పొంగుతోంది. పాలికి ఇది అనుభూతమవుతోంది.

'ప్రేమ' అని ప్రజలు దేన్ని అంటారో, నేడు వాళ్ళిద్దరికే దాని రహస్యానుభూతి కలుగుతోంది. ఇద్దరి హృదయాల్లోనూ ఒకే విషయం ఒక్కసారిగా మొలకెత్తుతోంది. నేటివరకు వాళ్ళు ప్రేమను గురించిన విషయాలు పురాణాలనుండీ, వదంతుల మూలంగా విన్నారు. కాని వాళ్ళకి నేడు దాని నిజరూపం గోచరించింది.

పాలి హఠాత్తుగా లేచి నిలబడి పిచ్చి దాని లాగ ఉద్యానానికి మధ్య చిరుచేపలతో ఒప్పుతున్న చిన్న తటాకం యొక్క ఒడ్డుకి రావడానికి బింబిసారుడున్న వైపుకు మెల్లగా పోగుతోంది. బింబిసారుడు కలవరపడి, వెంటనే వెళ్ళిపోసాగాడు కాని వెనక్కి పోడానికి చోటులేదు. పాలి అక్కడికి వచ్చి ఆగింది. ఇద్దరూ ఒకేసారి 'మీరా' అన్నారు.

ఒకమాట చెప్పి ఇద్దరూ ఆగిపోయారు. ఒక్కసారిగా నవ్వారు. పాలి వినోదంగా, వ్యంగ్యంగా అంది—'ఇంకా దెబ్బలు తినడం మిగిలిందా ఏమిటి? ఒంటరిగానే తిరుగుతున్నావు?'

'లిచ్ఛవీయులు వెనక నుండ తలపడరు. మరి భయమెందుకు?'

'నీవు లిచ్ఛవీయుడవా?' అని పాలి ఆశా పూరిత నేత్రాలతో అడిగింది.

'కాదు, నేను లిచ్ఛవీయుల్ని ఎరుగుదును.' పాలి నిరాశ గలదైంది మాట్లాడుతూ ఆమె ఆగిపోయింది. వాళ్ళు ఒకరి నొకరు చూచుకొని మాట్లాడవలసిన విషయాన్ని గురించి ఆలోచిస్తున్నట్లున్నారు. ఈ సారి బింబిసారుడు మొదట మాట్లాడాడు

'నీ సోదరుణ్ణి గురించి ఇప్పుడాలోచించ డాని కేమీలేదు'

'మీరు ఉత్తమ వైద్యులని నాకు తెలియదు' అని పాలి ప్రారంభించింది.

'నేనుకాదు నా మిత్రుడొకడు వైద్యుడు' ఇలా అని బింబిసారుడు ఆగిపోయాడు. 'మీకు రాజవైద్యుడు జీవక కుమారభృత్యుని పేరు..' అనుమాట అతని నోటి చివర వరకూ వచ్చింది. కాని అతడు మాగధీయుడనే శంక పాలికి తోస్తుందేమో అనే భయంచేత అతడా మాటను అక్కడే ఉంచేశాడు.

ఇద్దరూ మాట్లాడుతూ విశ్రాంతి స్థలం దాకా వచ్చారు. పాలి ఒక మూల కూర్చుంది బింబిసారుడు కూడా అదే ఆసనం మీద ఆమెకు కొంచెం దూరంగా కూర్చున్నాడు. కాని వెంటనే తాను బొమ్మలాట



గాడనే విషయం అతనికి జ్ఞాపకం వచ్చింది. అతడు ఒక్కసారిగా నిలబడ్డాడు. అతని యీ చేష్టకు పాలి మందహాసం చేసి అడిగింది—'ఎందుకు నిలబడ్డారు? భయం వేసిందా?'

'భయమా?'

'అవును. నీ వెవరో ఆమ్రపాలి కను క్కొంటుందని భయం. కాని నే నెరుగుదును.'

'ఏమి?.........'

'బొమ్మలాట వృత్తిగల నటుడవు కావా నీవు?' బింబిసారుడు ఒక్క క్షణం మౌనం వహించి 'కాదు, నేను నటుణ్ణి కాను' అన్నాడు.

'అయితే నీ వెవడివి?' అని పాలి ప్రశ్నించింది.

'తెలిసికొని ఏంచేస్తావు?' బింబిసారుడూ అలాగే ప్రశ్నించాడు.

'చెప్పకపోతే నీకు కలిగే లాభమేమిటి?'

'ఇప్పుడా? ఏమీలేదు.'

'ఇప్పుడా......?'

'అవును, ఇప్పుడేమీ లేదు. నా జీవితంలో ఒక ఘనకార్యం మారువేషన్నే చేయాలని వ్రాసి ఉంది. అది జరిగిపోయింది.'

'ఆ ఘనకార్యం మా వైశాలిలోనే చేయవలసి ఉందా?'

'అవును, మీ వైశాలిలోనే.'

పాలి బింబిసారుణ్ణి తదేకదృష్టితో, చూస్తోంది. ఆమెకు ఈ పురుషుడు అత్యంత రహస్యయుతుడుగా తోచాడు. బింబిసారుని మాటల్లో నిర్భీతి, స్పష్టత, హృదయ పార శ్యం ఉన్నాయి. అయినా, పాలి కళ్లపై నుండి ఒకతెలికైన శంకావారిదం వెలువడింది. ఆత్మీయుడిలా తోచే ఈ పరపురుషుడు తన నుండి కొంతకాలం పాటు దూరమవుతున్నట్లు ఆమెకు తోచింది. వైశాలికి శత్రువులు తక్కువగా లేరు. సాధారణులూ కారు. ఆ తోలుబొమ్మలాటగాడి గడ్డాన్ని అప్పుడే ఊడ లెరకాలని పాలి కోరింది కాని ఉత్తర క్షణంలోనే ఆమె తన యీ హృదయ వేగాన్ని ఆపుకొంది. బింబిసారుడు ఆమె మనస్సులోని అభిప్రాయాన్ని కనుక్కున్నాడు. అతడు కొంచెం ముందు వంగి చెప్పసాగాడు. 'నేను నీకు శత్రువును కానని నమ్ము' పాలి విశ్వసించడానికి సిద్ధంగానే ఉంది. అయినా గంభీరంగా మందహాసం చేస్తూ అంది—

'మా వైశాలిలో నీవు ముగించిన ఘనకార్యమేది?'

'నిజం చెప్పనా?'

'అబద్ధమాడే మోసం నీ ముఖంలో కనపడ్డంలేదు, చెప్పు.'

తన ఘనకార్యాన్ని గురించి చెప్పడం తప్ప బింబిసారుడికి వేరే మార్గమేలేదు. 'ఆమ్రపాలిని చూడడం' అని అతడన్నాడు.

పాలి బింబిసారుణ్ణి చూస్తోంది. అతని మాట విని ఆమె తక్షణమే నిలబడింది. పాలి తన్ను నీచునిగా తలుస్తున్నట్లు బింబిసారుని కనిపించింది. స్వేచ్ఛాపూరితమైన ప్రసన్నత అతని మనస్సులో చిందులాడ సాగింది. అప్పుడు పాలి నిండు గాంభీర్యంతో ఉంది.

'గాంధార, సాకేత దేశపు రాజకుమారులు నన్ను చూడవచ్చారు. నటులైకాదు, రాజకుమారులుగానే వచ్చారు. నీవు రాకుమారుడవా?' అని పాలి ఆకస్మికంగా బింబిసారుని వైపు చూచి నిశ్చయంతో కూడిన స్వరంతో అడిగింది.

'ఎవరు నీవు? ఎక్కడి నుండి వచ్చావు? దక్షిణాపథం నుండా?'

బింబిసారుడు పాలిని చూస్తూ ఉన్నాడు. అతడన్నాడు—'నీ మొదటి వాక్యం సత్యమైంది. నేను రాజకుమారుణ్ణి కాను. కాని ఉత్తర దిశ నుండి కాదు. దక్షిణాపథం నుండీ కాదు. నాకు ఒక్కటే పథం ఉంది. నిన్న ఆ పథంలో తీసికొని పోడానికి నా జీవిత సర్వస్వం ఒడ్డి, హృదయ సర్వస్వాన్ని వెంట తీసికొని ఇక్కడకు వచ్చాను.' పాలి స్థిరబుద్ధితో అతనివైపు చూస్తోంది.

'ఆ పథం పేరేమిటి?'

'దాని పేరు చెప్పడానికి వీలుపడదు. దానిపేరు ఎవరూ చెప్పలేరు.'

'నీ వంటి కుశల నటుడు కూడా చెప్పలేడా?'

'నీ వంటి అనుపమ సుందరి కూడా చెప్పలేదు ఆ పథమెలాంటిదో దాని మీద పోయే వాళ్లే చెప్పగలరు'

బింబిసారుడు పాలి కోసం కంఠస్థం చేసిన వాక్యాన్ని చెప్తున్నాడేమో అనిపించింది. ఇప్పటి వరకూ పాలి బింబిసారుని గాయాన్ని గురించిన చింతలో ఉంది. కాని యీ నిర్భయుడైన పురుషుడు ఇంత కొద్దికాలంలో ఇంతవరకు సాగిరాడం చూచి ఆమె తన బలహీనతకు సిగ్గుపడింది మితిమీరిన ఈతని సాహసానికి ఆమెకు రోషం వచ్చింది. కఠినమైన జవాబు చెప్పేతలపు కలిగింది. కాని అతణ్ణి చూడగానే ఆ మాటలు ఎటు పోయాయో తెలియదు. కోరిక మాయమయింది. కోపం ద్రవించింది. ఆమె కపట కోపం చూపించి అంది—

'సరే, నువ్వు మా అతిథివి, లేకపోతే ..'

'ఏం చేస్తావు?'

'ఈ గడ్డాన్ని ఒలిచి వేసేదాన్ని ఇతర రాజకుమారులు ఏమి వినిపోయారో దానినే నీకూ వినిపించి ఉండేదాన్ని'

అయితే గడ్డాన్ని ప్రాతఃకాలమే తీసి వేయడానికి సిద్ధంగా ఉన్నాను కాని నువ్వు కోపిస్తావేమో అనే భయం కలుగుతోంది'

'అయితే నేం కోపించనే కూడదన్న మాట ఎందుచేత?'

'ముఖంలో స్పష్టంగా కన్పించడం లేదు'

'స్వదేశానికి పోయి నీకు పరమమిత్రుడైన వైద్యశేఖరుణ్ణి కంటిమందిమ్మని తప్పకుండా అడుగు'

'మా మార్గాన్ని పోయేవాళ్లకిది అవంత కూడా అవసరంలేదు హృదయ చక్షువులు తెరచి ఉంటే అంతా వచ్చినట్లే'

'మీహృదయచక్షువులు తెరచిఉన్నాయా?' అని వ్యంగ్యంగా అడిగింది

బింబిసారుడు ఉలికిపడ్డాడు అతని నోటిమాట నోటిలోనే ఉంది పాలి ఏమందో అదే నిజంగా అతడూ అనబోతున్నాడు

ఇంతవరకు పాలి మాటలు అతణ్ణి హేళన చేయలేదు తాను ఇలా ఎన్నడూ ఎవరితోటీ మాట్లాడలేదని పాలి కూడా తనలో తాను అనుకుంటోంది.

బింబిసారు డామె దగ్గర నిలబడి ఆశ్చర్య పడుతూ చెప్పసాగాడు—'ప్రజల మాటలలో విశ్వాసం ఉంచకూడదని గురువుల ఆజ్ఞ. కాని ఆమ్రపాలి వాళ్లందరినీ అసత్యవాదులుగా చేస్తోంది ....'

(సశేషం)

వారఫలం

15-7-1966 శుక్రవారం మొదలు 21-7-1966 గురువారం వరకు.

మేషం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి ఉద్యోగంలో అనుకూల వార్తలు వింటారు. సాంఘిక కార్యక్రమాల్లో మీకు ముందు ఉపయోగించగల వ్యక్తులను కలుసుకొంటారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు.

వృషభం . కొన్ని పనులు సులువుగా నెరవేరినా, మరికొన్నింటికి శ్రమ పొందవలసి వస్తుంది. డబ్బు ఇచ్చి పుచ్చుకోవడాల్లో చికాకులు రావచ్చును. సాహసముతో కూడిన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు బాగా ఉంటాయి. విలాసవస్తువులు కొంటారు.

మిథునం : ఆదాయంమాట యెలా ఉన్నా, అన్ని వ్యవహారాల్లోను గౌరవప్రాబల్యాలు బాగా ఉంటాయి. నూతన వ్యాపారాలు శ్రమ మీద ఫలిస్తాయి. ఉద్యోగంలో మీ అభిప్రాయాలను అధికారులు కూడా ఆమోదిస్తారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం వారంప్రారంభంలో వృత్తివ్యాపారాల్లో చికాకులుకలిగి తరువాత సర్దుకొంటాయి. కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. ఆరోగ్యం బాగానుంటుంది పుణ్యకార్యాలు చేస్తారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది.

సింహం · వృత్తివ్యాపారాల్లో మీకు ముందు లాభించగల వ్యవహారాల్లో చొరవ చూపించవలసిన సమయం. వృత్తిలో నూతన మార్గాల ద్వారా ఆదాయం పెరుగుతుంది సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యం పెరుగుతుంది స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

కన్య: ఇప్పుడు మీరు చేసే ప్రయత్నాల వలన వెంటనే విశేషమైన ప్రయోజనం ఉండకపోయినా ముందు తగిన ఫలితాన్ని పొందగలరు. ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది స్థిరాస్తి వ్యవహారాల్లో అనుకూలం లభిస్తుంది స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

తుల : గ్రహబలం బాగా ఉంది. వృత్తి వ్యాపారాల్లో మీరు యిదివరకు అసాధ్యం అనుకొన్న వ్యవహారాలు కూడా యిప్పుడు సానుకూల పడతాయి వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో మిత్రుల సహకారం లభిస్తుంది. రాజకీయ వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. స్త్రీలకు—సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది బంధువులకు సహాయం చేస్తారు

వృశ్చికం . మీరుకష్టించకూడా తీరుబడిలేకుండా యెంతో కృషి చేస్తేనే గాని యే వ్యవహారంలోను అనుకూలతను సాధించలేరు. రావలసిన డబ్బు మీద ఆధారపడి యితరులకు వాగ్దానాలు చేయడం తగదు. దూరాంతంలో చేసే ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. ఆరోగ్యం బాగా ఉంటుంది స్త్రీలకు—ప్రయాణాలోచనలు చేస్తారు. సంఘ సేవికలకు మంచి సమయం.

ధనుస్సు . మీరు యిదివరకు యెంతోకృషిచేసి ఒకదారికి తెచ్చిన వ్యవహారాల్లోకి కొత్త సమస్యలు తలయెత్త వచ్చును. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మి వ్యవహరించడం తగదు. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం పెరుగుతుంది స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది బంధుమిత్రులను కలుసుకొంటారు.

మకరం : ఇతరుల నిమిత్తం చేసే ప్రయత్నాలు సులువుగా నెరవేరుతాయి గాని మీ స్వంతపనుల్లో శ్రమ కలుగుతుంది. ప్రయాణాల్లో ప్రయోజనం కంటే ప్రయాస అధికంగా ఉంటుంది కొంతమంది వ్యక్తులు కాళ్ళ మీద పడి వేళ్ళు కరచే విధంగా ప్రవర్తిస్తారు. మానసికాందోళన కలుగుతుంది స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

కుంభం : వృత్తివ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి, జరిగేది మరొకటి కావచ్చును పోటీవారితో వాదప్రతివాదాలకు దిగడం మంచిదికాదు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం తగదు ఉద్యోగంలో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుందికాని గౌరవం బాగానుంటుంది స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు.

మీనం : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. అవసరానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది నూతన వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు ఫలించగలవు కోర్టు వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్

మౌల్వీ నసిరుద్దీన్ - కథలు

*మహీధర్ నళినీ మోహన్



ఒకనాడు పదిమంది పిల్లకాయలు తోటలలో పడి బుట్టెడు మొక్కజీడి గింజలు ఏరుకొచ్చారు. కాల్చి, వాటిని పంచుకోవడంలో పేచీలు వచ్చాయి. అంతలో ఆ దారిన వెడుతున్న మౌల్వీ నసీరుద్దీన్‌ని చూచి, ఆగింజలను తమకు పంచిపెట మని అడిగేరు.

మౌల్వీ పిల్లలను పరకాయించి చూచి ఇల్లా అన్నాడు:

"పంచడంలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి దేవుని పద్ధతి. రెండోది మౌల్వీ నసీరుద్దీన్ పద్ధతి.— మీకు ఏపద్ధతి నచ్చుతుందో చెప్పండి"

పిల్లలు ముఖముఖాలు చూచుకున్నారు. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చేశారు.

"దేవుడి పద్ధతే కావాలి మాకు"

మౌల్వీ పంపకం ప్రారంభించాడు. ఒకడికి పదిగింజలు, రెండవవాడికి ఒక్కటి, మూడోవాడికి రెండువందల ఏభై, నాలుగో వాడికి అరవై, అయిదో వాడికి తొమ్మిది. మిగిలిన వాళ్లకి ఏమీ మిగులలేదు.

పిల్లలు ఆశ్చర్యపడ్డారు.

"ఇదేం పంపకం? అన్యాయం అన్యాయం" అన్నారు.

"అల్లా ఈ విధంగానే పంచుతాడు. మీకు ఇది నచ్చకపోతేపోనిండి



మౌల్వీ నసీరుద్దీన్ పద్ధతిలోనే పంచు తాను'' అని ఒక్కొక్కరికి ముప్పై గింజల చొప్పున ఇచ్చి, తాను ముప్పై గింజలు తీసుకున్నాడు మౌల్వీ. ●

ఎవరిబాధ్యత?



ఒకనాడు రెండు ఇళ్ల మధ్యనున్న దారిలో ఒక కుక్క చచ్చిపడి ఉంది. దానిని ఎవరు తీసి బాగు చేయించాలన్న విషయం మీద ఆ రెండిళ్ల వాళ్లకీ మాటా మాటావచ్చి, ఆఖరికి జుటూ జుట్టూ పట్టుకోవడం దాకా వచ్చింది. ఇద్దరూ నగరపాలకుని దగ్గరకు వచ్చారు. ఒకళ్ల నొకళ్లు నిందించు కున్నారు.

అంతలో మౌల్వీ నసీరుద్దీన్ అటు వైపుగా వెడుతూ కనిపించాడు. ఆ నగరపాలకునికి మౌల్వీ అంటే పడదు. మంచి అదను దొరికిందనుకుని, మౌల్వీని పిలువనంపేడు.

"రావయ్యా రా! నీకు సంబంధించిన ఫిర్యాదు వచ్చింది. తీర్పు చెప్పగలవేమో చూడు'' అని వివరాలన్నీ తెలియ జేశాడు నగరపాలకుడు.

"నీకు సంబంధించినది'' అని ఒత్తి చెప్పడంతో తనను వేళాకోళం చేయ డానికే పిలిపించేడని మౌల్వీ గ్రహించాడు. వెంటనే తీర్పు ఇచ్చేశాడు.

"కుక్క దారిలో పడి ఉంది. ఆ దారి ఈ వ్యక్తు లిద్దరిదీ కాదు. ప్రభుత్వం వారిది. నగరపాలకులైన తమరు ఇక్కడ ప్రభుత్వానికి ప్రతినిధులు. కనుక తమరే దానిని తీసి బాగు చెయ్యడం న్యాయం.'' ●

చిత్రహింస

(12వ పేజీ తరువాయి)

టానికే నేను పుట్టేను. ఉదయం ఏడు గంటల నించీ, రాత్రి పదిగంటల వరకూ, ఉప్పు కానీయండి, మిర్చి కానీయండి, నూనె కానీయండి ఎవరొచ్చి ఏది కావాలన్నా జాతి, మత విచక్షణ లేకుండా అందరికీ ఆదరణతో అందచేస్తూ ఉండటమే నా పనండి'' అని.

మానవ కల్యాణం ఒకరి ధ్యేయమైతే, మానవ సేవ మరొకరి లక్ష్యం.

గురువుగారు సూటుకేసు లోంచి మూడు రకాల తాయెత్తులు తీసి వాటి ఖరీదులు, మూడు రూపాయలు, ఆరు రూపాయలు, పది రూపాయలు అని చెప్పేరు.

హెడ్ గుమాస్తాగారినించి రెస్పాన్సు లేకపోవటం గురువుగారికి నిరుత్సాహంగానే ఉంది.

మామూలు గుమాస్తాననేమో నా అస్తిత్వమే గుర్తించినట్టు లేదు గురువులు. అయినా నేనే కల్పించుకుని "అయ్యా! గురువుగారూ! ధరలలో తేడాలు చెపుతున్నారు. మహిమలలో కూడా తేడాలు ఉంటాయా?'' అన్నాను.

"ఎంత చచ్చు ప్రశ్న వేశావురా చవట తండ్రీ'' అన్నట్టుగా గురువులవారు నాకేసి చూసి, "అది కాదయ్యా, ఉపయోగించిన లోహాన్ని పట్టి ధర మారుతుంది. అంతేగాని మహత్తులో తేడా ఉండదు'' అన్నారు.

ముళ్ల మీద కూచున్నట్టుగా ఉన్నట్టుంది హెడ్‌గుమాస్తాగారికి.

మంత్ర శాస్త్రానికి మూలాధారం ప్రణవం. ప్రణవానికి అపారశక్తి ఉంది. "ఓం'' అని గుక్కపట్టి శబ్దం చేసారు తాయెత్తుల వారు. "ఘంటికా నాదంలా వినిపించి తమలో అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించలేదా హెడ్‌గుమాస్తాగారూ'' అని అడిగేరు నోరూ, కళ్ళూ మామూలు స్థితికి తెచ్చుకుని.

హెడ్‌గుమాస్తాగారు అనిర్వచనీయమైన అనుభూతిని పొందినట్టే కనిపించి, "వర్షం తగ్గిందేమో చూడవయ్యా, ఆనందంగారూ'' అన్నారు నాకేసి చూసి.

"అబ్బే! ఇంకా జోరుగానే పడుతూందండి. నా దగ్గర గొడుగు ఉండదు. నేనసలు గొడుగు ఉపయోగించను. భగవదంకితమైన ఈ జటాజూటానికీ, భగవత్సృష్టి అయిన ఆకాశానికీ మధ్యగా అడ్డంకిగా గొడుగు ఉంచటం అపచారంగా భావిస్తాను.'' అన్నారు గురువుగారు.

హెడ్‌గుమాస్తాగారి కంఠంలో నించి వచ్చిన స్వరం, మూలుగో, 'ఊఁ' అనటమో తెలుసుకోలేకపోయాను.

"చాలా బలహీనంగా ఉన్నారు. ఆసనాలు వేయకూడదుటండీ. ఈ ఆసనాల విషయంలో మనకన్న ఉత్తరాదివారికి శ్రద్ధ ఎక్కువ. విధిగా లంగోటీ ధరిస్తారు. శీర్షాసనం శారీరకముగా, మానసికముగా కూడా పుష్టినిస్తుంది. వేసే పద్ధతి మీక్కిప్పుడే స్థూలముగా చూపుతాను'' అని వేయబోయారు గురువుగారు.

శీర్షాసనం చూద్దామని నాకూ ఉంది. కాని హెడ్‌గుమాస్తాగారు వెయ్యనిస్తేగా!

"బాబూ శ్రమపడకండి మరో మారు చూస్తానులెండి'' అన్నారాయన.

"అలాగే ఇంకో వారంరోజుల వరకు నేను ఈ ఊళ్లోనే ఉంటానులెండి. ఇక్కడి నించి కటక్ వెళ్లాలనుకుంటున్నాను. ఒక ఆదివారం తమరు దయచేస్తే....అన్నట్టు ఇవాళ శనివారం కాదూ!''

"ఈ వర్షం తెల్లవార్లూ ఇలాగే ఉండేట్టుందే'' అన్నారు హెడ్‌గుమాస్తాగారు.

తాయెత్తు ధరిస్తే మీ ఆరోగ్యం చక్కబడుతుంది. వీటిని గురించి యోగ్యతా పత్రాలు కూడా చాలా ఉన్నాయి నా దగ్గర. తమబోటి వారు ఇచ్చినవి. — అంటూ, 23×10 సెంటిమీటర్ల కవరు పెట్టెలో నించి తీసి, దానిలోంచి కాగితాల దొంతర బయటకు లాగేరు.

"ఇది చదవండి?'' అని ఒక కాగితం హెడ్‌గుమాస్తాగారికి ఇవ్వబోయారు.

"నా కళ్లజోడు ఆఫీసులో ఉందండీ. నువ్వు చూడవయ్యా, ఆనందం'' అన్నారు.

"పోనీ నాది ఆనుతుందేమో చూడండి'' అన్నారు గురువుగారు. హెడ్‌గుమాస్తాగారే స్వయంగా చదవాలని వారి అభిలాష.

"లాభం లేదండీ'' పాము నోట్లో ఇరుక్కున్న కప్ప అరిచినట్టుగా ఉంది ఆయన గొంతు.

వాన తగ్గిందేమో చూద్దామని వసారాలోకి వెళ్లేను. ప్రాణాయామం—భూమి మీద నుండి మూడునాలుగు అడుగుల పైకి లేవటం — హంస, ఎగిరిపోవటం— సత్తు — చక్రాలు — ఏవేవో మాటలు గురువుగారు సెలవిస్తున్నారు.

"ఈ వర్షం ఇప్పుడప్పుడే తగ్గేట్టు లేదు. వస్తానండీ'' అని సెలవు తీసుకుని "పదవయ్యా, పోదాం'' అంటూ వసారాలోకి వచ్చి గబగబ రోడ్డు మీదకు చేరుకున్నారు హెడ్‌గుమాస్తాగారు. ఆయన నడక వేగం చూసి నేను ఆశ్చర్యపోయాను.

"రేపు తప్పక దయ చేయండి. ఆసనాలు చూద్దురుగాని. తాయెత్తులను గురించిన వివరాలు కూడా వివరంగా మనవి చేస్తాను'' అంటున్నారు వెనకనించి గురువుగారు.

నీళ్లలో నడిచిపోతున్నాము. పెద్ద పెద్ద చినుకులే పడుతున్నాయి.

తలకాయ తడిస్తే నాకు రొంప పడుతుంది. హెడ్‌గుమాస్తాగారిది బట్టతల గనుక చినుకు నిలవదు. జారిపోతుంది.

నా చొక్కా విప్పి నెత్తి మీద వేసుకున్నాను.

చిన్నప్పుడు బళ్లో చదువుకొనేటప్పుడు బడి వదలిన తర్వాత వర్షం వస్తే, చొక్కా భుజం భాగం నెత్తి మీదకు లాక్కొని, పలక, సుమతీ శతకం, గణితబోధిని, వాచకం, చొక్కా ముందు పొరలో దాచి పరిగెత్తే వాళ్లం ఇంటికి.

మధ్య మధ్య వెనక్కి చూస్తూ హెడ్ గుమాస్తాగారు ముందు నడుస్తున్నారు మౌనంగా.

ఎలాగో కొంపలు చేరుకున్నాము

"పూర్తిగా తడిసిపోయారే. తల తుడుచుకోండి'' అంటూ తువ్వాల చేతికి అందించింది మా శ్రీమతి.


"సరేగాని దేవిగారూ, మీ తాతయ్యగారు ఆసనాలు వేస్తూ ఉంటారు గదా— పద్మాసనం వేసుకుని, భూమి మీదనించి పైకి లేవగలరా!'' అన్నాను.

అర్ధాంగికి అర్థమయినట్టు లేదు.

"మా తాతయ్య లేవటం మాట అలా ఉంచండి. ఆలస్యం చేస్తే వంటవాడు లేస్తాడు. ఇంతకుముందే నిద్రపుచ్చాను. భోజనానికి లేవండి. వాడు లేచాడంటే భోజనం ముందునుంచి అర్ధాకలితో మీరు లేవవలసి వస్తుంది'' అంది ఆవిడగారు.

నిజమే మరి. ఆకలి లేకుండా చేసే మహిమ తాయెత్తుకున్నదేమో గురువుగారిని కనుక్కోవాలి, ఈ సారి హెడ్ గుమాస్తాగారితో వెళ్లినప్పుడు. అంతవరకు శ్రీమతి సంహా పాటించక తప్పదు. ●

హరిజనులని గౌరవించే హైందవాలయం



శ్రీ శాంతదుర్గ దేవస్థానం, కైవల్యపూర్ (గోవా)

గోవాలో పొందామహల్ అనే లోయలో ఒకదాని పక్కనే ఒకటిగా కొన్ని చక్కటి కోవెలలు ఉంటాయి. వీటిని చూడటానికి ఎందరో వచ్చిపోతూ ఉంటారు.

వీటిలో 'కాల్లెమ్' గ్రామంలోని 'శాంత—దుర్గ' గుడికి ఒక ప్రత్యేకత ఉంది. (కాల్లెమ్ అసలు పేరు 'కైవల్యపూర్'.) ఈ గుడి వాస్తు శిల్ప శాస్త్రాల దృష్ట్యా మనల్ని ఆకర్షించటమే కాక ఒక ఉదాత్తమయిన సాంప్రదాయాన్ని నిర్వహిస్తుంది. దీని చరిత్ర నాలుగు శతాబ్దాల క్రితం ప్రారంభం అయింది. 16వ శతాబ్దంలో ఈ 'శాంత—దుర్గ' గుడి ఇంకా ఆవిర్భవించలేదు. అప్పటి శాంత—దుర్గ గుడి 'జువారీ' నది అవతల ఒడ్డు మీద ఉండేది. దేవాలయం ఉన్న ఊరి పేరు 'కెల్షి' ('కర్షలీవన్' నుంచి వచ్చిన మాట). పాడు పడిపోయిన దాని శిధిలాలు నేటికీ చూడవచ్చు. వీటిని బట్టి ఆనాటి వైభవాన్ని ఊహించవచ్చు.

కెల్షి వాసులు శాంత—దుర్గ పట్ల ప్రత్యేకాభిమానం చూపేవారు. చుట్టుపట్ల ఉన్న వారందరి కన్నా ఈ దేవి శక్తి అధికం అని నమ్మేవారు. స్కాందపురాణంలో ఒక కథ ఉంది. ఒకప్పుడు శివవిష్ణువుల యుద్ధంతో భూలోకంలో ప్రళయం వచ్చినంత పని అయి, బ్రహ్మ జగదంబ శరణుజొచ్చి వీరి యుద్ధాన్ని ఆపించాడుట. జగదంబ చెరొక దేవుడినీ చెరొక చేత్తో పట్టుకుని ఇద్దరినీ శాంత పరిచిందిట. అందుకనే ఆమెకి 'శాంత—దుర్గ' అనే పేరు వచ్చిందన్న మాట.....

కాని ఈ దేవి భక్తులు ఆమె దేవాలయాన్ని పోర్చుగీసు విధ్వంసకుల బారి నుంచి కాపాడుకోలేకపోయారు. విగ్రహాన్ని మాత్రం నది అవతల వైపుకి తీసుకువెళ్ళారు. అప్పుడు పొందామహల్‌ని 'సుందెవ్' రాజా పరిపాలించేవాడు.

వలస వెళ్ళిన వారికి నిరాశ ఎదురయింది అక్కడి బ్రాహ్మణులు ఈ వలస వచ్చిన బ్రాహ్మణులకి దేవాలయ నిర్మాణానికి స్థలం ఇప్పించనన్నారు. ఇక చేసేదిలేక కెల్షి వారు మరొక చోటికి వెళ్ళిపోవటానికి ఉద్యుక్తులయ్యారు. ఇక ఊరి ఎల్లలు దాటిపోతూ ఉండగా కొందరు మాహర్‌లు ('అస్పృశ్యులు) వారికి ఎదురయి దేవీ విగ్రహం ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. శాస్త్ర ప్రకారం ఉండవలసిన దూరం నుంచే. అంతే కాక, జరిగిన కథనంతా తెలుసుకుని వారు తమ దేవికి జరిగిన అవమానానికి చింతించి తమ గుడిసెలు వేసుకున్న భూమిని ఇచ్చేస్తామన్నారు. దాని మీద గుడి కట్టమని కోరారు. వారి కోరిక ఫలించింది. 'మాహర్ వాడ' లో దేవి ఆలయం వెలిసింది. వారు తమ నివాసాన్ని మరొకచోటికి మార్చుకున్నారు. అయితే, అప్పటి దేవాలయం మట్టి నిర్మాణం కలది మాత్రమే. అదీ అప్పటి భక్తులకి సాధ్యం అయింది.

రెండువందల సంవత్సరాలు గడిచాయి. ఒకనాడు షాహు మహారాజా ఎనిమిది మంత్రులలో ఒకరయిన నరోరావ్ మంత్రి తన కులదైవమైన దేవి దర్శనార్థం కాల్లెం వచ్చాడు. ఆమెకి కట్టిన ఆలయం ఎంత దుస్థితిలో ఉందో చూసి విచారించాడు. తన దేవాలయానికి ఒక పెద్ద విరాళం ఇచ్చాడు. అంతటితో ఊరుకోక పేష్వా బాజీ రావుతో చెప్పి కాల్లెం గ్రామాన్ని దేవస్థానానికి ఇప్పించాడు. ఈనాటికి కూడా కాల్లెం గ్రామం ఈ ఆలయానిదే. 18వ శతాబ్దంలో నరోరావ్ మంత్రి చేసిన కృషి ఫలితాలు ఎటువంటివో ఈ దేవాలయంలో జరిగే ఉత్సవ వైభవాలని బట్టి గ్రహించవచ్చు.

ఈ ఉత్సవాలు సంవత్సరం పొడుగునా జరుగుతూనే ఉంటాయి. కాని అన్నిటికన్నా ముఖ్యమయినది మాఘమాసం ఆరవ రోజు వచ్చేది. ఈ పుణ్యదినం నాడు ఎక్కడెక్కడి నుంచో తీర్థప్రజలు వచ్చిపోతూ ఉంటారు.

సాయంకాలం ఒకానొక సుముహూర్తాన సాధారణంగా వినిపించే సన్నాయి సంగీతం 'ఘుమట్'ల (డప్పుల) మ్రోతలో మునిగిపోతుంది. ఈ డప్పులని వాయిస్తున్న మాహార్‌ల దండు—పెద్దలూ, పిన్నలూ, స్త్రీలూ పురుషులూ—ఒకటి ఆలయ ప్రాకారంతో గుమిగూడుతుంది. ఆతర్వాత జట్లుజట్లుగా దండులోని వారందరూ గర్భగుడి ప్రవేశించి దేవి దర్శనం చేసుకుంటారు. దర్శనం పిదప పెద్దపూజారి, వారికి దేవి ధరించిన వస్త్రాన్ని ఒకటి కానుకగా ఇస్తారు. వస్త్రముతో బాటు కొంత బియ్యం, కొబ్బరి కాయా, నాణాలూ కూడా ఇస్తారు.

ఆలయానికి స్థానం దొరకక వెళ్ళిపోతున్న భక్తులకి తమ నివాసస్థానాన్ని కోవెల కట్టుకొనటానికి ఇచ్చిన మాహార్‌లకి ఏటా జరిగే గౌరవం ఇదే.

—వి. ఎస్. సుక్తాంకర్

సినిమాపరిశ్రమపై రూపాయి విలువ తగ్గింపు ప్రభావం!

ప్రభుత్వం రూపాయి విలువ తగ్గించినట్లు ప్రకటించగానే సినిమా పరిశ్రమలో అలజడి బయలుదేరింది. ఎవరి మొహాల్లోనూ ఉత్సాహ చైతన్యాలు లేవు. అసలే మోయలేని పన్నుల భారంతో కుంగిపోతున్న పరిశ్రమను యీ ప్రకటన మరింత దెబ్బతీసింది. మిన్ను విరిగి మీద బడ్డట్లయి బాధాకరంగా పరిణమించింది నిర్మాతలకు.

సినిమా పరిశ్రమకు సంబంధించినంతవరకు అంటే ముడిఫిలిమ్ నుంచి మేకప్ సామగ్రి వరకూ మనం విదేశాల నుండి దిగుమతి చేసుకొనవలసి వస్తున్నది. విదేశాలలో మన రూపాయి విలువ తగ్గిపోయింది కనుక, అక్కణ్ణించి దిగుమతి అయ్యే ప్రతి వస్తువు ధర విపరీతంగా పెరిగిపోతున్నది. అందులో సినిమాకు సంబంధించిన సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నవంటే అతిశయోక్తి కాదు.

* * *

ఈ విషయమయి పరిశ్రమకు చెంది, చిత్రనిర్మాణంలో విశేషానుభవం గడించిన కొందరు ప్రముఖులను కలుసుకోవడం జరిగింది. ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్డు కార్యదర్శి, ఆలిండియన్ ఫిలిమ్ ఛాంబర్ కార్యదర్శి అయిన శ్రీ డి. వి. యస్. రాజుగార్ని కలిసి చర్చించినపుడు వారిలా అన్నారు "వినోదం పన్ను, ఎక్సయిజుడ్యూటీ తదితర పన్నులతో పరిశ్రమ యిప్పటికే అంతంతమాత్రంగా వున్నది. గోరుచుట్టు మీద రోకటి పోటులా మళ్లీ యిదొకటి వచ్చి పడ్డదిప్పుడు. గేటు కలెక్షన్ వందరూపాయలు వస్తే—అందులో నిర్మాతకొచ్చేది 12½ శాతం. వినోదం, తదితర పన్నులు అంటూ ప్రభుత్వం, పంపిణీదారుని (డిస్ట్రిబ్యూటర్) కమిషన్, పబ్లిసిటీకి 12½ శాతం పోయి నిర్మాతకు 12½ శాతం వస్తున్నది. లక్షలు వెచ్చించి, రాత్రింబవళ్లు కష్టపడి ఒక చిత్రం తీస్తే నిర్మాతకు యీ పన్నెండున్నరా రావడం కష్టమవుతున్నది. ఇవన్నీ ఇలా వుండగా ఇన్‌కంటాక్సు. పదిలక్షలు ఖర్చయిన చిత్రానికి మొదటి సంవత్సరంలో ఎనిమిది లక్షలు వసూలు చేస్తే రెండు లక్షలు లాభం అని ప్రభుత్వం దాని మీద టాక్సు విధిస్తున్నది. ఎమార్టయిజేషన్ స్కీమ్ ప్రకారం మొత్తం విలువలో 60 శాతం ప్రభుత్వం తొలి సంవత్సరంలో తీసుకొంటున్నది. ఇపుడు విడదల ప్రింట్ల మీద విధించే ఎక్సయిజు సుంకంతో కేంద్రప్రభుత్వం, వినోదం పన్ను (హైయెస్ట్ 45 శాతం) తో రాష్ట్రప్రభుత్వాలు సదుపాయాలు కల్పించవలసిందిగా కోరుతున్నాము. ఈ పన్నులు తగ్గించే సదుపాయం కల్పించకపోతే నిర్మాతలు విపరీత నష్టానికి గురవుతారన్నది ఖాయం. దీని ప్రభావం చిన్నచిత్రాలు నిర్మించే వారి మీద చాలా అధికంగా వుంటుంది. పెద్ద పెద్ద సంస్థలే చిత్రనిర్మాణం విరమించుకోవాలనుకుంటున్న యీ తరుణంలో —యిక చిన్నసంస్థల సంగతి ఆలోచించండి" అంటూ శ్రీ రాజు వొక్క్షణం ఆగి మళ్లీ యిలా అన్నారు "అయితే మీరింకా చిత్రాలు ఎందుకు తీస్తున్నారని అడుగవచ్చు...వచ్చిన నష్టాల్ని రాబట్టుకుందుకు. ఈ చిత్రాలలో అయినా లాభాలు వచ్చి నష్టం పూడుతుందని తీస్తున్నాము."

* * *

"ఒక చిత్రానికి డెబ్బయిఅయిదు వేల నుంచి లక్షరూపాయల దాకా అదనంగా అవుతుంది. రాబడిలో యాభయి, అరవయి వేల దాకా పోతుంది. అంటే ఒక చిత్రాన్ని పదిసార్లు చూసే వ్యక్తి రెండుసార్లే చూడడం ద్వారా వచ్చే నష్టమన్నమాట...మొత్తం మీద రూపాయి విలువ తగ్గినందువల్ల ఒక చిత్రానికి వచ్చే నష్టం లక్షన్నర వరకూ ఉంటుంది" అన్నారు ప్రముఖ దర్శక నిర్మాత శ్రీ బి. యన్. రెడ్డి.

* * *

శ్రీ విఠలాచార్య మాట్లాడుతూ "ఒక తెలుగు చిత్రానికి నలభయిఆరు వేల రూపాయలు అదనంగా అవుతవి. ప్రొడక్షన్‌లో పదహారు వేలు, ప్రతిప్రింటు మీదా వెయ్యి రూపాయలు పెరుగుతవి. మేకప్ సామగ్రి ఇతర సరుకులు సినిమాకు ముఖ్యంగా సంబంధించినవన్నీ దిగుమతి చేసుకొనవలసిందే కాబట్టి మొత్తం మీద డెబ్బయిఅయిదు వేల రూపాయలు ఎక్కువవుతుంది" అన్నారు.

* * *

చిత్రనిర్మాణ రంగంలోని అన్నిశాఖల్లోనూ విశేషమయిన అనుభవం గడించిన వ్యక్తి, చందమామా ఫిలిమ్స్ అధినేత అయిన శ్రీ డి. యల్. నారాయణ యీ విషయం గురించి ముచ్చటిస్తూ "ఇప్పటి పరిస్థితుల్లో లక్షన్నర ఎక్కువవుతుందనీ, ఇతర భాష కథలు కొని తీస్తే యీ లక్షన్నరకు మరో లక్ష అదనంగా అవుతుందనీ చిత్రాల నిడివి తగ్గించుకోవడంలోను, రీటేక్స్ రాకుండా జాగ్రత్తగా చిత్రీకరించుకోవడంలోను నిర్మాతకు కొంత సౌలభ్యమేర్పడగలదనీ" అన్నారు.

* * *

ఫిలిం పరిశ్రమ యిపుడు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నది. ప్రభుత్వం పన్నుల తగ్గింపు విషయంలో సదుపాయం చూపకపోయినట్లయితే నిర్మాతలకు తీరని నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా చిన్న నిర్మాతలు ఎన్నో ఇబ్బందులకు లోను కావలసి ఉంటుంది. కొన్ని కంపెనీలు మూతపడే ప్రమాదం కూడ ఉన్నది. కంపెనీలన్నీ ఒక్కొక్కటిగా మూతబడుతూంటే సినిమా పరిశ్రమను నమ్ముకొని, అంటి పెట్టుకొని బ్రతుకుతున్న లక్షలాది ప్రజల జీవితాలు దుర్భరంగా పరిణమిస్తవి. ఇందువల్ల ప్రభుత్వానికి అఖిలభారత సినిమా పరిశ్రమ ద్వారా పన్నుల రూపేణా వచ్చే 70 కోట్ల రూపాయల ఆదాయంలో ఎంతో భాగం తగ్గిపోయే అవకాశం వుంది.

—మోహన్‌కుమార్



'శ్రీకృష్ణతులాభారం'లో, కొత్తనటి విజయశ్రీ

చిత్రలహరి

రంగులరాట్నం

వాహినీలోని నాలుగో ఫ్లోర్ దగ్గరికి వచ్చేసరికి పాశ్చాత్య సంగీత ధ్వనులు వినిపించినవి. ఆసక్తి కలిగి ఫ్లోర్‌లోకి వెళ్లాను. సెట్లో దర్శకులు బి. యస్. రెడ్డి కనిపించారు. కొంతమంది అమ్మాయిలు, వారి ముందు సుకన్య పాశ్చాత్య దుస్తుల్లో నిలబడి సిద్ధంగా వున్నారు.

"యస్, రెడీ ఫర్ టేక్, సుకన్యా రెడీ!"



భక్తపోతనలో పద్మిని

అన్నారు బి. యస్. రణగొణ ధ్వనితో విండిన సెట్ ఒకసారిగా నిశ్శబ్దమయిపోయింది. "స్టార్ట్ సౌండ్!" శబ్దయంత్రం నుంచి సంగీతం వినిపిస్తున్నది. అమ్మాయిలంతా "ట్విస్ట్" ఆరంభించారు.

బి. యస్. గారి చిత్రంలో "ట్విస్ట్" డాన్స్ ఉండడం చూసి కొంచెం ఆశ్చర్యమే కలిగింది. అదే వారితో అన్నాను. రెడ్డిగారు నవ్వుతూ "ఇది చిత్రంలో వచ్చే చిన్న 'బిట్' ఫారిన్ డెలిగేట్స్ బందం వస్తే మనవాళ్లు వాళ్లకి విందు యిచ్చి ట్విస్ట్ చేయ నారంభిస్తారు, వాళ్లను సంతోషపరచడానికి. ఇది వారికి నచ్చదు. 'మా నృత్యం మాకు చూపించే కన్నా భారతీయ సంగీత నృత్యరీతులు చూపితే మాకెంతో ఆనందం కలుగుతుంది' అంటారు అప్పుడు 'కుమార సంభవం' ప్రదర్శించడం జరుగుతుంది" అంటూ సందర్భం వివరించారు.

ఇంతలో రామ్మోహన్ వచ్చి "సార్, నేనూ ట్విస్ట్ చేస్తాను" అన్నాడు. "ఈ షూటింగ్ అవనివ్వండి. మీతో నేనూ వస్తాను. ట్విస్ట్‌కి" బి. యస్. చెప్పారు నవ్వుతూ. ఆయన సెట్లో చాలా ఉషారుగా వుంటారు. నటీనటులకు ఉత్సాహప్రోత్సాహాలందిస్తూ, వారిని తనకు కావలసిన విధంగా నటింపచేసుకుంటారు. ఈ సందడి అంతా వాహినీ వారి "రంగులరాట్నం" చిత్రానికి సంబంధించినది. ఇందులో అంజలీదేవి, నీరజ, సుకన్య, వాణిశ్రీ, విజయశ్రీ, పుష్పవల్లి, రామ్మోహన్, చంద్రమోహన్, రమణారెడ్డి వి. నాగరాజారావు, కాకరాల, వి. శివరావ్, సి. హెచ్. కృష్ణమూర్తి, మొదలయిన వారు నటిస్తున్నారు. పాలగుమ్మి పద్మరాజు వ్రాసిన కథకు డి. వి. నరసరాజు సంభాషణలూ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సి. నారాయణరెడ్డి, కొసరాజు, దాశరథి గీతాలూ వ్రాశారు. సంగీతం: యస్. రాజేశ్వరరావు, బి. గోపాలం. నృత్యాలు: వెంపటి చినసత్యం: వేణుగోపాల్, కళ ఏ. కె. శేఖర్, కెమెరా: రాజగోపాల్, నిర్మాత, దర్శకుడు: బి. యస్. రెడ్డి.

* * *

ఆరవ ఫ్లోర్‌లో డి. వి. యస్. ప్రొడక్షన్స్ వారి కొత్త జానపద చిత్రం, షూటింగ్ జరుగుతున్నది. సెట్లో శ్రీ యస్. టి. రామారావును కలిశాను. "కొత్త చిత్ర నిర్మాణ కార్యకలాపాలేమయినా ఆరంభించారా?" అన్న ప్రశ్నకు ఆయన సమాధానంగా 'ఇంకా లేదనీ', ఉమ్మడి కుటుంబం పేరుతో ఒక సాంఘిక చిత్రం నిర్మించదలిచామనీ చెప్పారు. ఉమ్మడి కుటుంబం చిత్రానికి సంభాషణలు: సముద్రాల జూనియర్, గీతాలు: సి. నారాయణరెడ్డి, కొసరాజు, సముద్రాల(జూ) వ్రాశారు. సంగీ



నటి కాంచన. ఫోటో: మాణిక్యత్యాగరాజన్

తం టి. వి. రాజు, కెమెరా: రవికాంత్, దర్శకత్వం: యోగానంద్ నిర్వహిస్తారు.

హైదరాబాద్‌లోని వారి "రామకృష్ణ 70 ఎం. ఎం." థియేటర్ గురించి శ్రీ యన్. టి. ఆర్.తో ముచ్చటించగా "అది ఇంకాపూర్తిగా తయారు కాలేదు. ప్రస్తుతం రూఫింగ్ జరుగుతున్నది. 1967 జనవరిలో ప్రారంభించా లనుకుంటున్నాము. అన్నారు. యన్. టి. ఆర్. జూలై 17 వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్న "పరమానందయ్య శిష్యుల కథ" శతదినోత్సవపు వేడుకల్లో పాల్గొనేందుకు 16 వ తేదీన బయలుదేరి 17న ఫంక్షన్‌కు హాజరయి 18 వ తేదీన తిరిగి మద్రాసుకు వస్తారు.

చిత్రలహరి

డి. వి. యస్. వారి కొత్త జానపదం

"నీ మనసులోని గుబులు నాకు తెలుసు నువ్వు వలచినవాడు నీకు చిక్కలేదు కదూ?" అంటూ రాకుమార్తె వేపు చూసి చిరునవ్వు విసిరి "ఈ రాత్రి ఆ తోటలోకి వెళ్ళి పిలు. నీ ప్రియుడు పలుకుతాడు" అన్నాడు జ్యోతిష్యుడు. రాకుమార్తె మధుమతి మనసుకు నెమ్మది చిక్కింది. అతడు చెప్పినట్లే చేసింది. రాత్రి వేళ తోటలోకి వచ్చి పిలిచింది. పలికాడు. అతని గొంతు రాగ



'వగై' హిందీ చిత్రంలో రాజశ్రీ



'కన్నెమనసులు'లో రామమోహన్, సంధ్యారాణి.

మాలాపిస్తున్నది. తన గుండెల్లో వాగేదో ప్రవహిస్తున్నట్లున్నది. మనిషి కనిపించడేం మరి? మరింత దగ్గరగా వినిపిస్తున్నది గొంతు. అతడే! తన మనసు దోచుకున్నవాడు. తనలో మరులు నిర్పిపోయినవాడు. దగ్గరగానే వున్నట్లున్నది కాని మనిషి కనిపించడంలేదు. మధుమతి హృదయం అన్యరాగంతో ఓలలాడుతున్నది. రాముణ్ణి చూడాలనే ఆకాంక్ష బలీయమవుతున్నది. "ఏ మబ్బు మాటున్నావో ఏ పొదల చాటున్నావో— కలగా నన్నే కవ్వించేవో" అతని పల్లవికి అనుపల్లవి అందించింది. "చందమామలో ఉన్నాను చల్లగాలిలో ఉన్నాను. నీలో నేనై నిలుచున్నాను" అంటూ సమాధానించాడు రాముడు. "కట్" అన్నారు దర్శకులు విఠలాచార్య. ఇది డి. వి. యస్. ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న కొత్త జానపద చిత్రానికి చెందిన యుగళగీత చిత్రీకరణ. రాముడుగా యన్. టి.ఆర్, రాకుమార్తె మధుమతిగా కుమారి రాజశ్రీ నటిస్తున్నారు. రాజశ్రీ నటనలో గతంలో కన్న ఇప్పుడు ఎంతో అభివృద్ధిని సాధించింది. పై యుగళగీతాన్ని పి. సుశీల, ఘంటసాల ఆలపించారు. యువ హృదయాలను గిలిగింతలు పెట్టే యీగీతం వ్రాసినది సి. నారాయణరెడ్డి. మధురమయిన బాణీ సమకూర్చినది టి. వి. రాజు. ఇంకా యీ చిత్రంలో రాజనాల, పద్మనాభం, రేలంగి, మిక్కిలినేని, అల్లురామలింగయ్య, వాణిశ్రీ, మణిమాల, మీనాకుమారి, బుష్పేంద్రమణి కూడా పాల్గొంటున్నారు. కెమెరా: వరదన్, నృత్యాలు: కొంపటిసత్యం, ఎడిటింగ్: జి. డి. జోషి,

ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్: పి. వి. గోపాలకృష్ణ, యస్. చిట్టిబాబు, సంభాషణలు: సముద్రాల జూనియర్, దర్శకత్వం : విఠలాచార్య, నిర్మాత: డి. వి. యస్. రాజు. ఇంతవరకు పన్నెండు రీళ్ళుపూర్తి అయింది.

* * *

ఈ సెట్లోనే దర్శకుడు శ్రీ బి. విఠలాచార్యను కలిశాను. వారి 'అగ్గిబరాటా' చిత్రం విజయవంతంగా సాగుతున్నదనీ, 1930లో మొదటి తెలుగు చిత్రం విడుదలయిందనీ, అప్పటి నుంచి 1966 జూన్ 2 వరకూ విడుదలయిన తెలుగు




'అమన్'లో సైరాబాను, రాజేంద్రకుమార్

చిత్రాలలో 'అగ్గిబరాటా' మొదటివారం, వసూలు చేసినంత పెద్దమొత్తం మరే చిత్రమూ వసూలు చేయలేదనీ చెప్పారు విఠలాచార్య. "అగ్గిదొర" పేరుతో మరొక చిత్రం తీసే ప్రయత్నాలు చేస్తున్నారాయన. ఇందులో యన్. టి. రామారావు, యస్. వి. రామదాసు, దశరథరామిరెడ్డి ఉంటారు. మిగిలిన నటీనటుల ఎన్నిక పూర్తి కాలేదు. జి. కృష్ణమూర్తి బి. ఏ. రచన చేస్తున్నారు.

శ్రీకృష్ణ తులాభారం

సురేష్ ప్రొడక్షన్స్‌వారి "శ్రీకృష్ణ




'మొహబత్ జిందగీ హై' చిత్రంలో ధర్మేంద్ర, రాజశ్రీ

తులాభారం" చిత్రానికిగాను ఇటీవల వాహిని లోని మొదటిఫ్లోర్‌లో ఇంద్ర దర్బారు, నందనవనం సెట్స్ వేశారు. రంభ మొదలయిన అప్సరకాంతల నృత్యగీతాలతో ఇంద్రుడు, శచీదేవి శ్రీకృష్ణసత్యభామల హృదయపూర్వక స్వాగతం చెప్పడం నందనవనంలో సత్యభామను రంభ, ఆమె బృందం జలక్రీడ లాడించి దివ్యభామినిగా మార్చి పారిజాత వృక్షచ్ఛాయను ఆనందమనుభవించవని చెప్పి నిష్క్రమించడం మొదలయిన దృశ్యాలను చిత్రీకరించారు. ఈ రెండు సెట్లూ కన్నుల పండువుగా అందంగా ఎంతో హుందాగా ఉన్నవి. వాటిని రమణీయంగా రూపొందించిన కళాదర్శకుడు రాజేంద్రకుమార్. యన్. టి. రామారావు, కాంతారావు, రాజనాల, పద్మనాభం, బాలకృష్ణ, మిక్కిలినేని, సీతారాం రేలంగి, రామచంద్రరావు రాధాకృష్ణమూర్తి, జమున, అంజలీదేవి, కృష్ణకుమారి (గెస్ట్), ఎల్. విజయలక్ష్మి, యస్. వరలక్ష్మి, నిర్మల, వాణిశ్రీ, మీనాకుమారి, విజయశ్రీ ద్వయం, విజయరాణి, అనూరాధ ఈ చిత్రంలో నటిస్తున్నారు. రచన: సముద్రాల రాఘవాచార్య, గీతాలు: సముద్రాల, ఆరుద్ర, శ్రీశ్రీ, కొసరాజు, దాశరథి సంగీతం: పెండ్యాల, నృత్యాలు కె. యస్.



'శ్రీకృష్ణతులాభారం'లో జమున



'ఆమ్రపాలి' హిందీ చిత్రంలో యుద్ధ దృశ్యం.

రెడ్డి; ఆర్ట్ వి. వి. రాజేంద్రకుమార్ బి. ఏ., కెమెరా అన్నయ్య, ఎడిటింగ్ మార్తాండ్, సహకారదర్శకులు జి. వి. ఆర్. శేషగిరిరావు, కె. బాపయ్య; దర్శకత్వం: కె. కామేశ్వరరావు బి. ఏ., నిర్మాత. డి. రామానాయుడు. పదమూడు రీళ్ళ చిత్రం తయారయింది.

గౌరీ ప్రొడక్షన్స్ చిత్రాలు

"భూలోకంలో యమలోకం" చిత్రం

చిత్రలహరి

నిర్మాణంలో వుండగానే గౌరీ ప్రొడక్షన్స్ వారు మరొక కొత్త చిత్రం ఆరంభించారు. ఇందులో యన్. టి. రామారావు, రాజశ్రీ, జయలలిత, పద్మనాభం, వాణిశ్రీ యింతవరకు ఎన్నుకోబడినారు. రామారావు, జయలలితలపై ఒకపాట చిత్రీకరణ కూడ జరిపారు. సంభాషణలు: పాలగుమ్మి

పద్మరాజు, గీతాలు: సి. నారాయణరెడ్డి, సంగీతం: కోదండపాణి, నృత్యాలు: ఏ. కె. చోప్రా, కెమెరా హెచ్. ఎస్. వేణు, ఎడిటింగ్: కె. యస్. ఆర్. దాస్, దర్శకత్వం: జి. విశ్వనాథం, నిర్మాత: వై. వి. రావు, నిర్వహణ: యస్. భావనారాయణ. వీరి "భూలోకంలో యమలోకం" చిత్ర నిర్మాణం పూర్తి కావస్తున్నది. కాంతారావు, రాజనాల, సత్యన్నారాయణ, ప్రభాకరరెడ్డి,



'నగ్మా' హిందీ చిత్రంలో రాజశ్రీ

మిక్కిలినేని, రాజబాబు, కొత్త నటుడు పి. సాంబశివరావు, రాజశ్రీ, రత్న, పుష్పవల్లి నటిస్తున్నారు. సంభాషణలు: జి. కృష్ణమూర్తి, గీతాలు: సి. నారాయణరెడ్డి, కొసరాజు, ఆరుద్ర, దాశరథి. జూలై చివరి వారంలోకాని ఆగస్టు ప్రారంభంలోగాని విడుదల చేయాలని అనుకుంటున్నారు.

లక్ష్మీరమణ ఫిలిమ్స్

లక్ష్మీరమణ ఫిలిమ్స్ అనే నూతన చిత్ర



'ఆమ్రపాలి' (హిందీ) చిత్రంలో వైజయంతిమాల



'కన్నెమనసులు'లో సుకన్య.

నిర్మాణ సంస్థ శైలజానంద ముఖర్జీ వ్రాసిన కథ ఆధారంగా తెలుగులో ఒక చక్కని సాంఘిక చిత్రాన్ని నిర్మించనున్నది. కృష్ణకుమారి, కాంతారావు, జగ్గయ్య, శోభన్‌బాబు, రమణారెడ్డి, నాగభూషణం, సూర్యకాంతం ప్రభృతులు నటిస్తారు. సంభాషణలు వార్ల చిరంజీవి, సంగీతం టి. చలపతిరావు, కళ సూరన్న, ఎడిటింగ్ అంకిరెడ్డి, కెమెరా సుఖదేవ్. చాలా చిత్రాలకు సహాయదర్శకుడుగా పనిచేసి అనుభవం గడించిన ఒక యువకుడు యీ చిత్రానికి దర్శకత్వం వహించగలరని తెలుస్తున్నది. నిర్మాతలు: డి. లక్ష్మీకాంతారావు, యస్. సుధాకర్. షూటింగ్ కార్యక్రమం ఆగస్టు నుంచి ప్రారంభమవుతుంది.

శ్రీకృష్ణ మహిమ

"భక్తకుచేల" మళయాళ చిత్రాన్ని "శ్రీకృష్ణ మహిమ" పేరుతో శ్రీ రంగా అండ్ చిత్రాంజలి వారు తెలుగులోకి అనువదిస్తున్నారు. కాంతారావు, సి. యస్. ఆర్., కమలా లక్ష్మణ్, కుమారి కుచలకుమారి మొదలయిన వారు నటించారు. రచన: అనిసెట్టి సుబ్బారావు, సంగీతం: బ్రదర్ లక్ష్మణ్, వి.కె. మూర్తి, కూర్పు: బి. గోపాలరావు, దర్శకుడు సుబ్రహ్మణ్యం, నిర్మాతలు టి. బ్రహ్మానందరెడ్డి బి. యస్. పి., కె. జె. మోహన్.

బ్రహ్మరథం

అన్నపూర్ణ ప్రొడక్షన్స్ అనే కొత్త సంస్థ "బ్రహ్మరథం" పౌరాణిక చిత్రాన్ని నిర్మించే సన్నాహాలలో ఉన్నది. రచన: శ్రీశ్రీ, సంగీతం: ఘంటసాల, కెమేరా: అన్నయ్య, కళ: వాలి, దర్శకత్వం: కె. కామేశ్వరరావు, నిర్మాణ నిర్వహణ, ఇ. వి. శర్మ బి. ఏ. బి. ఎల్. నటీనటుల ఎన్నిక పూర్తిచేసుకుని త్వరలో సెట్స్‌కు వెళ్లనున్నారు.

కీర్తిశేషుల కుటుంబ సహాయనిధి

విరాళాల సేకరణకై ఏర్పాటు చేస్తున్న వినోద కార్యక్రమాలలోనూ, శ్రీ భమిడిపాటి రాధాకృష్ణ వ్రాసిన "కీర్తిశేషులు" నాటకంలోనూ పాల్గొనడానికి ప్రముఖ నటీనటులందరూ అంగీకరించినట్లు శ్రీఎం. సత్యం (జైహింద్) తెలియజేశారు.

ఈ ప్రదర్శనలు 31 జూలై 1966 ఆదివారం మద్రాసులోని యస్. కె. టి. కళామండపం (హిందూ గర్ల్స్ హైస్కూలు ఆవరణ)లో జరుగుతవి.

—మోహన్‌కుమార్.



పుస్తకాలు

తెర వెనుక

రచన: కిషోర్ సాహు, అనువాదం. బాల, రిరెడ్డి 464 పేజీలు. వెల: రు 10—00 ప్రతులకు మూర్తి అండ్ కో, నంద్యాల, కర్నూలుజిల్లా.

సినిమాను తెరమీద చూసేప్పుడు అందంగా, ఆహ్లాదకరంగా వుంటుంది ప్రేక్షకుడికి. కాని, ఆసినిమాను అంతరమణీయంగా తెరమీదకు తీసుకు రావడానికి తెరవెనుక ఎంత కృషిఉన్నదో అందరికీ అర్థంకాదు...... కైలాష్‌సిన్హా మేధావంతుడయిన యువకుడు. కళకు తనజీవితాన్ని అంకితం చేసుకున్నాడు. ధనం చుట్టూ మూగే పెద్దదర్శకులముందు రాణించలేకపోయాడు. సెకండ్ హీరోయిన్ నలినా హీరో రజనీకాంత్ అతనిప్రయత్నాన్ని బలపరిచారు. పరిమిద్ధతుతో తార అనేకొత్తఅమ్మాయిని కథానాయకిగా తయారు చేశాడు. ఫిలింజర్నలిస్టు రహమాన్, శిల్పి చిత్రకారుడు అయిన ఫ్రాన్సిస్ కైలాష్‌కు అండగా నిలిచారు. తనమిత్రద్వయం నిక్పృష్టజీవులైనా ఘనవిజయాన్ని సాధించగలిగాడు కైలాష్‌సిన్హా. లక్ష్యసిద్ధిపట్ల అతనికి గలశ్రద్ధ, పట్టుదల, కృషి— అతనికావున్నత స్థానాన్ని సంపాదించి పెట్టినది. కాని అతను మనస్ఫూర్తిగా కాంక్షించిన తార చేరువకు వస్తున్నతరుణంలో —అష్టకష్టాలకోవడి నిర్మించిన "జ్వాలాముఖి"చిత్రం దగ్ధమై, సిద్ధించబోతున్న కీర్తిసౌధం కూలిపోయింది...... కళాకారులహృదయాలు ఎలాంటి రసానుభూతిని పొందుతవో, ఎంతటి ఉన్నతమైనవో—కైలాష్ సిన్హా తార, నలినా, రజనీకాంత్ పాత్రలద్వారాయీ నవలలో వివరించారు కిషోర్‌సాహు. అవినీతి అనేది సినిమారంగాలలోకన్నా ఇతర రంగాలలోనే అధికంగా వున్నదనీ, సినిమాచూడటంవల్ల ప్రజలు చెడిపోవడం లేదనీ— వాటిద్వారా కావలసినంత వినోదం,సంతోషం ప్రజలకు సమకూర్చబడుతున్నదనీ నిరూపించే ప్రయత్నం చేశారు రచయిత. సినిమాపరిశ్రమలోని అన్నిశాఖలల్లోనూ శ్రీ కిషోర్‌సాహు ఆరితేరిన వ్యక్తి గనుక—యీనవల వాస్తవానికి దగ్గరగా వుంది. పుస్తకంవెల కొంచెం అధికమేననిపించినా, ఒకమంచినవల చదివామన్న తృప్తి కలుగుతుంది పాఠకుడికి. అనువాదం సరళంగా సాఫీగా సాగింది.

—మోహన్ కుమార్.

బాధ్యులెవరు? (అను) భవిష్యద్వాణి

నవల. రచన: వల్లభనేని వెంకట్రాది. ప్రతులకు: క్రాంతి ప్రసాద్ ప్రచురణలు, కుచ్చికాయలపూడి—గుడివాడతాలూకా. పేజీలు: 160. వెల: రు. 2.

కళ్ళున్న ప్రతివాడూ చూడగలడు, కాళ్ళున్న ప్రతివాడూ నడవగలడు. కానీ చేతులున్న ప్రతివాడూ వ్రాయలేడని అన్న సూక్తి ఎంతటి యథార్థమైందో ఈపుస్తకం చదివినవారికి తెలుస్తుంది. మనసులో ఊహాలూ, మనిషికి అనుభవమూ కొండంతగా వున్నా, రచనా విధానమూ, భాషా బలమూ లేని కారణం చేత వెంకట్రాద్రి గారి సమస్త ప్రయత్నమూ వాసనా హీనమైపోయింది. పైగా రచయిత అహంకారం పుస్తకంలో అడుగడుగునా అడ్డుతగులుతూ, పాఠకులకు వినుగు కల్గిస్తుంది. ఉదాహరణకు: "ప్రాక్కథనం" అన్న ఆముఖంలో, ఒంకార స్వరూపిణియైన ఆ వరదేవత తన చేయిపట్టి ఈ పుస్తకాన్ని వ్రాయించినట్లు రచయిత చెప్పుకుంటారు.

"నా రెండు చేతుల మధ్యకూ మూడో చేయి వచ్చింది. 'ఆగు' అనిపించింది. ఆగాను. చూశాను ఆ రూపం, ఒకానొక దివ్యసుందరి. నా స్వప్నసుందరి. కలంలో క్రింది భాగాన నా కుడిచేయి పైన నా ప్రేయసిట..మిన్కు మిన్కు మంటున్న దీప కళిక క్రమక్రమానుగతంగా పెరిగింది. ఇంత అంత క్షితిజ పటలమంతా వ్యాపించింది. అందులో ధగద్ధగాయమానంగా, ఇంద్రధనస్సులా 'ఓం కారం ప్రకాశిస్తూ వుంది. ప్రళయనాదమై, ప్రణయ వినాదమై ప్రళయ భీకరనాదమై గానంచేసింది... ప్రశాంతత ఏర్పడింది. తెప్పరిల్లాను. ఎడమ చేతిలో పుస్తకం, కుడిచేతిలో కలం పట్టించి వ్రాయిస్తుంది. అపైన మూడవ చేయి వ్రాస్తున్నా కాగితం వివాద బాధ్యులెవరు?"

వాణి నా రాణి అని పినవీరభద్రుడు చెప్పుకొన్నాడు కొన్ని శతాబ్దాల క్రితం. మళ్ళీ వెంకట్రాద్రి గారు వాణిని తన స్వప్నకాంతగా ప్రకటించుకున్నారు. కాని ఆ వాణి పినవీరభద్రుని చేత జైమినీ భారతం వ్రాయించగా వెంకట్రాదిగారిచేత "ఇంతటి అద్భుతమైన గ్రంధం" వ్రాయించింది. గ్రంథంలో పెళ్ళి బేరాలు, వర్గ కలహాలు, కులకక్షలు, స్వదేశీ ఉద్యమం ఆధారంగా తయారు చేసిన ఓ కథలాంటిది ఉంది. వెంకటరామయ్య, వెంకాయమ్మ, రంగయ్య సత్యవతి, కుమారస్వామి వంటి రక్తమాంసహీనమైన పాత్రలు కొన్ని ఉన్నాయి. వ్యావహారికమూ గ్రాంధికమూ కలసిన భాష వాడబడింది. అట్ట చూడగానే, 'ఇదేదో మత సంబంధమైన గ్రంథం కాబోలు' అన్న భ్రాంతి కలుగుతుంది. ఆంధ్ర సాహిత్యంలో ఇది రెండవ పుస్తకమని 'హి సా. విశారద అయిన రచయిత గారి అట్టచివరి ప్రకటన వలన తెలుస్తోంది. నవల, నాటకం, గేయం వంటి వివిధ సాహిత్య ప్రక్రియల పూర్ణ స్వరూపాన్నీ, భాషపై అధికారాన్నీ, భావన శబలతనూ సంపాదించుకుని వెంకట్రాది గారు రచనలు చేయకపోతే, వారి పాఠకులకు వారి శారదలో హింసలప్ప మరేమీకనపించదు.

—శ్రీరామచంద్రమూర్తి.

శ్రీరంగ నీతులు

నాటకం, రచన: శ్రీ వడ్లమూడి సీతారామారావు, క్రౌనుసైజు 131 పుటలు. వెల రెండు రూపాయలు. ప్రచురణ: విశాలాంధ్ర ప్రచురణాలయం, ఏలూరు రోడ్డు, విజయవాడ—2.

నాటక కళాభిజ్ఞులూ, స్వయంగా నటులూ అయిన శ్రీ సీతారామారావుగారు యిప్పటి దేశకాలపరిస్థితులను ఆలోచించి ఒకటిన్నర గంటల కాలంలో ప్రదర్శించడానికి అనుకూలమయ్యేటట్లు మూడు రంగాల్లో ఈ నాటకాన్ని కూర్చారు. "శ్రీరంగ నీతులు" అనే గ్రంథ శీర్షికను బట్టి చెప్పేవన్నీ నీతులున్నా, చేసేవన్నీ దుర్నీతికి తావలాలైన పనులున్నా లోకంలో వుంటాయని ప్రదర్శించడమే కవి యొక్క ఆశయమైనట్లు తెలుస్తున్నది. చివరి వరకూ ఆయోమయమూ, ఆందోళనకరమూ అయిన స్థితిలోనే కథ నంతటినీ నడిపించి, చివరలో ఉన్నపాటున ఆశ్చర్యకరంగా కథను మార్చి సుఖాంతం చేయడంలో రచయిత ఎంతో నేర్పును చూపించారు. మన ప్రాచీన నాటక లక్షణ వేత్తలు కూడా నిర్వహణ సంధిలో అద్భుతాన్ని చూపాలనే నియమించారు. మహాకవి కాళిదాసు మున్నగు వారి రూపకాలు ఆ రీతినే అనుసరించాయి అప్పుడే నాటకం రసవత్తరంగా ఉంటుంది. స్వయంగా నటుడైన ఈరచయిత ఆ పద్ధతిని అనుసరించడంచక్కగా ఉన్నది.

నాటకానికి ప్రేక్షక జనుల ఆదరమూ, ఆనందమూ ప్రధాన లక్ష్యాలయినా లోకం పోకడను ప్రతిబింబింప చేయడమూ ముఖ్యమే. ఇందులో అది కూడా చక్కగా నిర్వహించబడి వున్నది. నిష్కల్మష హృదయంతో వుండడమూ, అవినీతికి దూరంగా వుండడమూ మానవజాతికి ఈ కాలంలో సాధ్యమనీ, అందుకోసం ప్రయత్నిస్తే అధోగతి పాలు కావడం తథ్యమనీ, పిలయిన మార్గాలలో ధనాన్ని సంగ్రహించే వారే సుఖంగా కాలం గడపగలరనీ రచయిత చక్కగా నిరూపించారు. తమ కుమార్తెల వివాహాలను గురించి తల్లిదండ్రులు పడే అగచాట్లు బాగా ఇందులో చూపబడినవి.

ఈ నాటకంలో నిజాయితీగా బ్రతుకటాలనే మలభంగా వచ్చే లంచాలను తీసుకోకుండా మడి కట్టుకుని కూర్చుని దుర్భర జీవితాన్ని యీడ్చుకుంటూ, ఆ విధంగానే ఉద్యోగం నించి రిటైరయిన వెంకటరావు చివరకు తన ఆదర్శాలకు ఎదురు తిరిగి ధనం కోసం నింద్యాలయిన పనులలోకి దిగటం, ఒప్పుడు ఎవర్నీ లక్ష్యపెట్టకపోవడం రచయిత చిత్రణలో విశిష్ట స్థానాన్ని ఆక్రమించుకొన్నవి సూర్యం చంద్రం, రాజి, శోభ ఆడిన కపట నాటకం చివరిదాకా యథార్థంగానే కనబడి, యే పిస్తోల్ల ప్రయోగంతో అంతమవుతుంది. రంగ చిత్రణ ఆయా వ్యక్తుల స్వభావ పోషణ అనుగుణమైన పద్ధతిలో నడిచాయి. అట్ట మీది చిత్రం నాటకం పేరుకు తగిన విధంగా చాలా చక్కగా కుదిరింది. స్వల్ప వ్యవధిలో ప్రదర్శించదగిన నేటి నాటికలలో "శ్రీరంగ నీతులు" ప్రముఖ స్థానాన్ని ఆక్రమించదగి ఉన్నది.

ఇది యిదివరలోనే ప్రదర్శించబడి మంచిపేరు తెచ్చుకున్నదనీ, పత్రికలు ప్రశంసించాయనీ ఈ పుస్తకంలోని ప్రకటనలు చెపుతూ ఉన్నవి. ఆ ప్రకటనలు యథార్థాలను వెల్లడిస్తున్నవనే అంగీకరించాలి. అందరూ చదవదగిన నాటకం యిదీ. చదివినవారు సంతృప్తి చెందుతారని నమ్మిక.

—అంగీరస. ●

Edited Printed and Published by S. Radhakrishna at the AndhraPatrika Press; 6&7 Thambu chetty Street Madras-1. Phones Editorial, 21747; Other depts: 29766. Chief Editor: S Sambhu Prasad.

